www.bharathasakthi.com

# భారత శక్తి®

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి : 21 | సంచిక : 15 | హైదరాబాద్ | శుక్రవారం,జూన్ 19 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00

### జీ7 తీర్మానాన్ని పూచికపుల్లలా

## తీసిపారేసిన కిమ్ సోదరి



అణు నిరాయుధీకరణ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ఉత్తర కొరియా మరోసారి స్పష్టం చేసింది. ఆ దేశ నేత కిమ్ జోంగ్ ఉన్ సోదరి, అత్యంత శక్తివంతమైన నాయకురాలిగా పేరున్న కిమ్ యో జోంగ్ గురువారం ఈ మేరకు సంచలన వ్యాఖ్యలు చేశారు. అణు నిరాయుధీకరణ అనేది ఎప్పటికీ జరగని పని అని, అణ్వాయుధాలు తమ దేశ 'ప్రధాన ప్రయోజనాల్లో' భాగమని ఆమె తేల్చిచెప్పారు. ఈ విషయంలో వెనక్కి తగ్గడం అనేది దాటకూడని గీత అని

2లో..

# సచివాలయ ముట్టడికి జర్నలిస్టుల యత్నం

- ప్రజా ప్రభుత్వంపై 'ఛలో హైదరాబాద్' పోరుకేక
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా అందని హామీలు
- చిన్న, మధ్యతరహా పత్రికలకు ప్రకటనల బకాయిలు చెల్లించాలని డిమాండ్.
- అడ్డుకున్న పోలీసులు.. పంజాగుట్ట, ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్లకు తరలింపు

**గన్ పార్క్ వద్ద ఉద్రిక్తత, భారీగా అరెస్టులు!**



పెన్ పట్టిన చేతులు పిడికిలి ఎత్తాయి! అక్షర సైనికులు హక్కుల పోరాట క్షేత్రంలోకి దూకారు. పాలకుల వివక్షపై, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై జర్నలిస్టులు సమరశంఖం పూరించారు. అమరవీరుల సాక్షిగా 'ఛలో హైదరాబాద్' అంటూ తరలివచ్చిన అక్షర శ్రామికులను సచివాలయ ముట్టడికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడం, అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు. న్నడు ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణాలొడ్డి పోరాడిన జర్నలిస్టులను, నేడు తమ న్యాయమైన హక్కుల కోసం రోడ్డెక్కితే తీవ్రంగా అణచివేయడం దుర్మార్గం. పత్రికల మనుగడ ప్రశ్నార్థకమై, కుటుంబాల భద్రత కరువైనా బెదరక, అక్షరాన్ని ఆయుధంగా మలచి జర్నలిస్టులు చేస్తున్న ఈ న్యాయపోరాటం పాలకుల కళ్లు తెరిపించక మానదు. ఈ పోరుకేక అణచలేనిది, ఆపలేనిది!

2లో..

## హరిత హారం..

### ఎల్బీనగర్‌కు

# పర్యావరణ వరం



- గుర్రంగూడ అటవీ ప్రాంతంలో 424 ఎకరాల భారీ 'పర్యావరణ ఉద్యానవనానికి' శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- వనమహోత్సవంలో కీలక ప్రకటనలు
- నగర జీవ వైవిధ్యానికి పెద్దపీట.. రద్దీ నివారణకు మేఘ మార్గం (ఫ్లైఓవర్) మంజూరు.



**హైదరాబాద్ జూన్ 18 (భారత శక్తి బ్యూరో):** రాష్ట్రంలో పర్యావరణ సమతుల్యతను కాపాడటమే ధ్యేయంగా చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమం బుధవారం రంగారెడ్డి జిల్లా పరిధిలో ఘనంగా ప్రారంభమైంది. బి.యన్ రెడ్డి నగర్ సమీపంలోని గుర్రంగూడ అటవీ ప్రాంతంలో 424 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న 'పర్యావరణ ఉద్యానవనం' (ఎకో పార్క్) అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2లో..

## ఆర్టీసీ పురోగతిపై మంత్రి పొన్నం సమీక్ష



**హైదరాబాద్ (భారత శక్తి)** ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడి 30 నెలలు పూర్తయిన సందర్భంగా టీజీఎస్ఆర్టీసీ పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.ఆర్టీసీ సమ్మె సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆర్పీఎస్-2021కు సంబంధించిన 11 శాతం ఫిట్మెంట్ను జూలై 1 నుంచి అమలు చేయాలని

2లో..

### మైనార్టీ సంక్షేమానికి

# భారీ కేటాయింపులు

**- డిప్యూటీ సీఎం మల్లు**



**హైదరాబాద్ (భారత శక్తి)** మైనార్టీల సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బడ్జెట్‌లో మైనార్టీ సంక్షేమానికి భారీ కేటాయింపులు చేసినట్లు తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మైనార్టీ సంక్షేమ పనుల పురోగతిపై ఉన్నతస్థాయి సమీక్షను ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. ఉర్దూ అకాడమీ గోల్డెన్ జూబ్లీ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ముషాయిరాలు నిర్వహిస్తామని అన్నారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో భారీ ముషాయిరాకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే 20 మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల ప్రారంభానికి సిద్ధం చేస్తున్నామన్నారు.

2లో..

### హైడ్రా 'మెట్' టెండర్లు

# పారదర్శకం

HYDRAA

**అవాస్తవాలు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు**

- ఎంపిక కమిటీ పరిశీలన తర్వాతే ఖరారు
- టెండర్లు దక్కని వారి అక్కసుతోనే తప్పుడు ప్రచారం: హైడ్రా ఘాటు ప్రకటన


**హైదరాబాద్ జూన్ 18 (భారత శక్తి):** వర్షాకాలంలో నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అత్యవసర పనుల నిమిత్తం ఏర్పాటు చేసే 'మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్' ఎంపిక ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరగలేదని 'హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ' (HYDRA) గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. గ్రేటర్

2లో..

## రికార్డు ధర పలికిన హైదరాబాద్ భూములపై న్యాయ వివాదం..

### ఎస్బీఐ పిటిషన్‌తో వేలానికి బ్రేక్

- రాయదుర్గం భూముల వేలం ప్రక్రియపై తెలంగాణ హైకోర్టు స్టే
- భూమి తమదేనంటూ కోర్టును ఆశ్రయించిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
- మే 28న ఎకరానికి రూ. 237 కోట్ల రికార్డు ధర పలికిన భూమి
- టీజీఐఐసీ, గౌరా వెంచర్స్‌కు కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు
- మూడు వారాల పాటు తదుపరి చర్యలు నిలిపివేయాలని ఆదేశం



**హైదరాబాద్(భారత శక్తి)** హైదరాబాద్ నగరంలోని రాయదుర్గంలో ఇటీవల రికార్డు ధర పలికిన అత్యంత ఖరీదైన భూముల వేలం ప్రక్రియపై తెలంగాణ హైకోర్టు మధ్యంతర స్టే విధించింది. వేలం వేసిన భూమిలో కొంత భాగం తమదేనంటూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) దాఖలు చేసిన పిటిషన్‌తో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ ఉత్తర్వులతో

2లో..

### డిపెండెంట్ ఉద్యోగం కోసం

# టెన్షన్ పడవద్దు

**- ఆఫీసర్ మాట కాదని ప్రశ్నిస్తే ఛార్జ్ షీట్ ఇస్తున్నారు**

**- టీఆర్ఎస్ ఛీఫ్ కవిత**



**రామగుండం (భారత శక్తి)** సింగరేణి బాయిబాటలో భాగంగా రామగుండం ఓసీపీ -3, బేస్ వర్క్ షాప్ లను సందర్శించి, కార్మికులతో తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మాట్లాడారు. కవిత మాట్లాడతూ సింగరేణిలో ఇప్పటికీ బ్రిటీష్ పాలన నడుస్తోంది. కార్మికులను వేధిస్తూ వాళ్లను ఇబ్బంది పెడుతున్నారు. నేను కార్మికుల పక్షాన ఉంటే ఓ గుంటనక్క కాంట్రాక్టర్ల పక్షాన ఉంది. మా కారణంగా జరిగిన తప్పులకు క్షమాపణ చెబుతున్నా. ఆత్మపరిశీలన చేసుకొని కార్మికుల హక్కుల కోసం పోరాటం చేస్తాం. బీఆర్ఎస్ నుంచి పంపిస్తే ప్రజల కోసం పార్టీ పెట్టాను. ప్రాణప్రదమైన సింగరేణి కార్మికులను కలిసి వారి ఆశీర్వాదం కోసం వచ్చాను. మళ్లీ గెలిపిస్తే మంచి మార్పు తెస్తాం. రేవంత్ రెడ్డి చెప్పినట్లు కాదని అన్నారు.ఆఫీసర్ మాట కాదని ప్రశ్నిస్తే ఛార్జ్ షీట్ ఇస్తున్నారు. కార్మికులను

2లో..

## మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జీవితాన్ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలి



**బేగంపేట (భారత శక్తి)** బేగంపేటలోని స్వామి రామానంద తీర్థ మెమోరియల్ స్కూల్ విద్యార్థులకు నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులు పంపిణీ చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అనంతరం మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభించి, విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కేటీఆర్ హైదరాబాద్‌లోని బేగంపేటలో ఉన్న స్వామి రామానంద తీర్థ మెమోరియల్ స్కూల్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సందర్శించి విద్యార్థులకు నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చిన కేటీఆర్, "16 భాషల్లో ప్రావీణ్యం సంపాదించిన పీవీ నరసింహారావు దేశానికి, ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని జీవితంలో గొప్ప స్థాయికి చేరుకోవాలి" అని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రంలో 2023లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారి నాయకత్వంలో ప్రారంభించిన 'సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం'ను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో విద్యారంగంలో అనేక కార్యక్రమాలు చేసిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. భవిష్యత్తులోనూ విద్యార్థుల సంక్షేమానికి దోహదపడే ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేస్తామని తెలిపారు. "పిల్లలతో

2లో..



## రైతు భరోసా నిధుల విడుదలకు డేట్ ఫిక్స్..

**కేబినెట్ నిర్ణయాలను వెల్లడించిన ఉత్తమ్**

- జూన్ 30న రేవంత్ చేతుల మీదుగా రైతు భరోసా నిధులు విడుదల చేస్తామన్న ఉత్తమ్
- 7 రకాల సన్న వడ్లకు బోనస్ ఇవ్వనున్నట్టు వెల్లడి
- నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామన్న మంత్రి

**హైదరాబాద్ జూన్ 18 (భారత శక్తి):** తెలంగాణ సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈరోజు జరిగిన కీలక కేబినెట్ సమావేశంలో ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ భేటీ వివరాలను భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. "వానాకాలం రైతు భరోసా నిధులను విడుదల చేయాలని కేబినెట్ నిర్ణయించింది. జూన్ 30వ తేదీన మధిరలో నిర్వహించబోయే 'రైతు సమ్మేళనం' బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి ఈ నిధులను నేరుగా విడుదల చేస్తారు. మార్కెట్ డిమాండ్ మేరకు 7 రకాల సన్న వడ్లకు బోనస్ ఇవ్వాలని కూడా కేబినెట్ నిర్ణయించింది" అని తెలిపారు. తెలంగాణ నుండి

2లో..

# సచివాలయ ముట్టడికి జర్నలిస్టుల యత్నం





**హైదరాబాద్, జూన్ 18 భారత శక్తి:** రాష్ట్ర ప్రభుత్వ వివక్ష, నిర్లక్ష్య వైఖరికి నిరసనగా, తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జర్నలిస్టులు గురువారం చేపట్టిన 'ఛలో హైదరాబాద్' కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టి.డబ్ల్యూ.జె.ఎఫ్) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి జర్నలిస్టులు భారీ సంఖ్యలో రాజధానికి తరలివచ్చారు. గన్ పార్క్ నుంచి సచివాలయ ముట్టడికి బయలుదేరిన జర్నలిస్టులను పోలీసులు గన్ పార్క్ వద్దే అడ్డుకొని, బలవంతంగా అరెస్టు చేశారు.

## అమరవీరులకు నివాళి -- వినతిపత్రం సమర్పణ

ఈ సందర్భంగా ఫెడరేషన్ వ్యవస్థాపక, రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య గన్ పార్క్‌లోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జర్నలిస్టుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అమరవీరుల స్థూపానికి సమర్పించారు.

## పన్నెండేళ్లుగా వివక్షే.. పాలకులపై సోమయ్య ఆగ్రహం

అనంతరం జరిగిన నిరసన సభలో మామిడి సోమయ్య మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించి పన్నెండేళ్లు గడుస్తున్నా.. పాలకులు జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా వివక్ష చూపుతున్నారని మండిపడ్డారు. 'తెలంగాణ కోసం తెలంగాణ జర్నలిస్టులు' అనే నినాదంతో ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన విలేకరులను పాలకులు చిన్నచూపు చూడటం దుర్మార్గమన్నారు. "రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ, జర్నలిస్టులకు ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చకుండా మొండిచేయి చూపుతోంది. ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి వల్ల రాష్ట్రంలో అనేక చిన్న, మధ్య తరహా పత్రికలు మూతపడే పరిస్థితికి వచ్చాయి. గత రెండున్నర ఏళ్లుగా ప్రభుత్వం ప్రకటనల బకాయిలను (అడ్వర్టైజ్‌మెంట్ బిల్స్) చెల్లించకపోవడం దారుణం."

## మామిడి సోమయ్య, రాష్ట్ర అధ్యక్షుడు, టి.డబ్ల్యూ.జె.ఎఫ్

### జర్నలిస్టుల ప్రధాన డిమాండ్లు ఇవే:

- **బకాయిల విడుదల:** చిన్న, మధ్యతరహా పత్రికల పెండింగ్ ప్రకటనల బిల్లులను వెంటనే చెల్లించాలి.,
- **కార్డుల జారీ:** ప్రతి శ్రమజీవి అయిన జర్నలిస్టుకు గుర్తింపు కార్డు (అక్రెడిటేషన్) తో పాటు ఆరోగ్య కార్డు (హెల్త్ కార్డు) మంజూరు చేయాలి.
- **ఇళ్ల స్థలాలు:** గ్రేటర్ హైదరాబాద్‌తో సహా రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలి.

పత్రికల ఎంపానెల్‌మెంట్: భారత పత్రికల రిజిస్ట్రార్ (ఆర్.ఎన్.ఐ), ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (పి.ఆర్.జి.ఐ) గుర్తింపు ఉండి, క్రమబద్ధంగా వస్తున్న పత్రికలను ప్రభుత్వ ప్రకటనల జాబితాలో (ఎంపానెల్‌మెంట్) చేర్చాలి. ఉచిత విద్య, వైద్యం: జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఉచిత విద్యను, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సదుపాయాన్ని కల్పించాలి.

బీమా, పెన్షన్లు: ప్రతి జర్నలిస్టుకు ఉచిత బీమా పథకాన్ని వర్తింపజేయాలి. 60 ఏళ్లు దాటిన సీనియర్ జర్నలిస్టులకు పింఛను (పెన్షన్) సౌకర్యం కల్పించాలి. బడ్జెట్ కేటాయింపులు: జర్నలిస్టుల సంక్షేమం కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయించాలి., ఉచిత ప్రయాణం: జర్నలిస్టులందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి.

## ప్లకార్డులతో నిరసన.. భారీ ర్యాలీ

రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన వందలాది మంది జర్నలిస్టులు తమ డిమాండ్ల సాధనకై ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో గన్ పార్క్ పరిసరాలను హోరెత్తించారు. అనంతరం సచివాలయం వైపు భారీ ర్యాలీగా దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు భారీ బారికేడ్లతో వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, జర్నలిస్టులకు మధ్య తోపులాట జరిగి ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## పోలీసుల అరాచకం.. పోలీస్ స్టేషన్లకు తరలింపు

పోలీసులు జర్నలిస్టులను బలవంతంగా ఈడ్చుకెళ్లి వాహనాల్లో ఎక్కించి అరెస్టు చేశారు.

అరెస్టయిన వారిని పంజాగుట్ట, ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా సోమయ్య ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ.. "జర్నలిస్టుల న్యాయమైన కోర్కెలను ఈ ప్రజా ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలి. లేనిపక్షంలో గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికీ పడుతుంది" అని స్పష్టం చేశారు.

## నిరసనలో పాల్గొన్న ముఖ్య నేతలు

ఈ మహా ధర్నాలో టి.డబ్ల్యూ.జె.ఎఫ్ రాష్ట్ర కో-కన్వీనర్లు బండి విజయ్ కుమార్, యాదగిరి, తన్నీరు శ్రీనివాస్, జాతీయ కౌన్సిల్ సభ్యులు చిత్రా శ్రీనివాస్, దామెర జగదీశ్వర్ గుప్తా, కే. పాండురంగారావు, పద్మనాభరావు, సామ్రాట్ గుప్తా పాల్గొన్నారు. అలాగే హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవి కుమార్, కో-కన్వీనర్లు ఆర్. శ్రీనివాస్ గౌడ్, సంతోష్ కుమార్, ఎం.రవికుమార్, సుభాష్, రేగటి వెంకన్నలతో పాటు వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు నానబాల రామకృష్ణ, అర్వపల్లి నగేష్ (ఖమ్మం), గండీటి నర్సింహా, గోపాల్ (మహబూబ్ నగర్), మధు (మంచిర్యాల), పాల్వాయి జానయ్య, ముషం హరిప్రసాద్ (సూర్యాపేట), జక్కుల విజయ్ కుమార్, స్వామిదాస్, పాలడుగు సురేందర్ (వరంగల్), దూమర్ల భాస్కర్ (నాగర్ కర్నూల్), అశోక్ కుమార్ గౌడ్, పర్వతాలు (రంగారెడ్డి), మల్లేశం, గడ్డమీది అశోక్ (మేడ్చల్) తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హైడ్రా 'మెట్' టెండర్లు పారదర్శకం

హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (GHMC), సంబంధిత మున్సిపల్ కార్పొరేషన్లకు చెందిన తొమ్మిది మంది ఇంజినీర్లతో కూడిన ప్రత్యేక కమిటీ నిబంధనల ప్రకారమే టెండర్లను పరిశీలించి, ఖరారు చేసిందని వెల్లడించింది. మీడియా, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని తేల్చిచెప్పింది.

## నిబంధనల్లో స్వల్ప సడలింపు.. అందుకే!

వర్షాల తీవ్రత దృష్ట్యా నగర ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని 'మెట్' వాహనాలను క్షేత్రస్థాయిలోకి దించే ముందే పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (గ్రజీ) సర్టిఫికేట్, ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ పత్రాలను సమర్పించాలనే నిబంధనపై టెండర్ల ఖరారు సమయంలో స్వల్ప సడలింపు ఇచ్చినట్లు హైడ్రా తెలిపింది. అయితే, కాంట్రాక్టర్ల గత అనుభవం, ఆర్థిక సామర్థ్యం, సొంత లేదా లీజు వాహనాలు కలిగి ఉండాలనే కీలక నిబంధనల్లో ఎలాంటి మినహాయింపులు ఇవ్వలేదని స్పష్టం చేసింది. కేవలం చిన్న సాంకేతిక కారణాలను బూతద్దంలో చూపిస్తూ, టెండర్లు దక్కించుకోలేకపోయిన కొందరు వ్యక్తులు ప్రభుత్వంపై, హైడ్రాపై బురదజల్లేందుకు కుట్రపూరితంగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది.

## గతంలోనూ బెదిరింపులు.. సమర్థవంతంగా తిప్పికొట్టిన హైడ్రా

గతంలో ఈ వ్యవస్థ జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్నప్పుడు కూడా కొందరు కాంట్రాక్టర్లు ఇలాంటి బెదిరింపులకు, ఆరోపణలకు దిగి టెండర్లు దక్కించుకునేందుకు ప్రయత్నించేవారని హైడ్రా గుర్తుచేసింది. గత ఏడాది నుంచి ఈ పనుల బాధ్యతను హైడ్రా స్వీకరించింది. ప్రారంభంలో ఎదురైన అడ్డంకులను అధిగమించి సమర్థులైన వారికే టెండర్లు అప్పగించామని, గత వర్షాకాలంలో 'మెట్' బృందాలు ఎంత అద్భుతంగా పనిచేశాయో నగర ప్రజలందరికీ తెలుసని పేర్కొంది.

## ఒకే కాంట్రాక్టర్ 30 టెండర్లకు దరఖాస్తు.. నిబంధనలు ఉల్లంఘించడంతోనే తిరస్కరణ

ప్రస్తుతం జరుగుతున్న అసత్య ప్రచారానికి ప్రధాన కారకుడు పట్నం శ్రీశైలం అనే కాంట్రాక్టరేనని హైడ్రా బహిరంగపరిచింది. గత ఏడాది కూడా వారం రోజుల్లో సొంత వాహనాలను సమకూరుస్తానని హామీ ఇచ్చి, వర్షాకాలం ముగిసే వరకు రోజువారీ అద్దె వాహనాలతోనే కాలయాపన చేశారని తెలిపింది. ఈ ఏడాది కూడా సదరు కాంట్రాక్టర్ ఏకంగా 30 టెండర్లకు దరఖాస్తు చేసుకున్నారని, కానీ సొంత వాహనాలు లేదా లీజుకు తీసుకున్నట్లు ఎలాంటి చట్టబద్ధమైన పత్రాలను సమర్పించలేదని కమిటీ గుర్తించింది. దీంతో నిబంధనల ప్రకారం టెండర్ల ఎంపిక కమిటీ ఆ దరఖాస్తులను తిరస్కరించడంతో, ఆ కక్షతోనే తప్పుడు ప్రచారానికి తెరలేపారని హైడ్రా విమర్శించింది.

## ప్రజా శ్రేయస్సు కోసమే నిరంతర శ్రమ

ఇటీవల జూన్ 9, 12 తేదీల్లో కురిసిన భారీ వర్షాలకు నగరంలో ట్రాఫిక్ స్తంభించిన నేపథ్యంలో, 'మెట్' బృందాలను తక్షణమే రంగంలోకి దించాలనే పట్టుదలతో అధికారులు పనిచేశారు. మూడు కమిషనరేట్లకు చెందిన ఇంజినీర్లు, హైడ్రా అధికారులతో కూడిన కమిటీ సెలవు దినాల్లో సైతం 24 గంటలూ శ్రమించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేసింది.

## అవకాశాలు పెంచేందుకే సవరణలు :

పూడికతీత , ఇన్‌స్టంట్ రిపేర్ టీమ్స్ పనులు చేసే కాంట్రాక్టర్లకు కూడా ఈ టెండర్లలో పాల్గొనే అవకాశం కల్పించాలని కొందరు ప్రతినిధులు కమిషనర్‌ను కోరారు. దాంతో ఎక్కువ మందికి అవకాశం కల్పించి, ఆరోగ్యకరమైన పోటీ ద్వారా సమర్థులను ఎంపిక చేసేందుకు జూన్ 10న సవరణ ప్రకటన (Corrigendum) జారీ చేయడం జరిగింది. ఇంత పారదర్శకంగా, ప్రజా ప్రయోజనాలే పరమావధిగా చర్యలు తీసుకుంటుంటే.. వ్యక్తిగత స్వార్థంతో సంస్థ ప్రతిష్టకు భంగం కలిగించేలా అసత్య ఆరోపణలు చేసేవారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హైడ్రా హెచ్చరించింది.

# డిపెండెంట్ ఉద్యోగం కోసం టెన్షన్ పడవద్దు

ఆఫీసర్లు ఇబ్బంది పెడుతున్నారు. మేనేజ్ మెంట్ ఒత్తిడితో కార్మికుల ఆందోళనతో ఉన్నారు. ఆఫీసర్లమో వాళ్ల హక్కుల కోసం నిన్న ధర్నా చేశారంట. అదే కార్మికులు ధర్నా చేస్తే మాత్రం మెమో లు ఇస్తున్నారు. ఇది సరికాదు. ఆఫీసర్లు, ప్రభుత్వం తీరు మారాలి. నేను టీజీబీకేఎస్ లో ఉన్నప్పుడే ప్లే డే, ఎన్ మైనస్ పద్ధతి, హీహెచ్డీ లో 50 శాతం ఇచ్చే విధానం వచ్చింది. దీని కారణంగా కార్మికులు 2 నుంచి 3 లక్షల వరకు నష్టపోతున్నారని తెలిసింది. కార్మికులకు ఇంత నష్టం జరుగుతుందని అప్పుడు మాకు తెలియదు. మా కారణంగా జరిగిన తప్పునకు కార్మికులకు క్షమాపణ చెబుతున్నానని అన్నారు. కచ్చితంగా జరిగిన తప్పులను సవరించుకుంటాం. ఆత్మ పరిశీలన చేసుకుంటాం. మళ్లీ హీహెచ్డీ పూర్తిస్థాయిలో వచ్చే హక్కును మీకు తెచ్చి పెడతానని మాట ఇస్తున్నా. అదే విధంగా మెడికల్ స్కీమ్ అందరికీ ఒకేలా వర్తించాలని కోరుతున్నా. ఒక్కొక్కరికీ ఒక్కో న్యాయం ఉండొద్దు. మెడికల్ స్కీమ్ పారదర్శకంగా అమలు చేయాలి. సింగరేణి కార్మికుల నుంచి రిఫరల్ హాస్పిటల్స్ డబ్బులు వసూలు చేయకుండా చూడాలి. ఒకప్పుడు సింగరేణి కార్మికుల కోసం మంచి స్కూల్స్ ఉండేవి. కానీ ఇప్పుడు స్టాఫ్ లేదే. కొన్నేళ్లుగా ప్రభుత్వాల విధానాల కారణంగా ఈ పరిస్థితి వచ్చింది. సింగరేణి కార్మికులు కూడా విద్య, వైద్యం కోసం భారీగా ఖర్చు చేసే పరిస్థితి తెచ్చారు. ఇక అలియాస్ పేర్లకు సంబంధించి చాలా ఇబ్బంది పెడుతూ విజిలెన్స్ కేసులు పెడుతున్నారు. గతంలో మేము అలియాస్ పేర్ల విషయంలో చూసి చూడనట్లు వ్యవహరించాలని యాజమాన్యానికి చెప్పి ఎంతో మందికి మేలు చేశాం. కానీ ఉద్యోగాలు ఇవ్వవద్దన్న కారణంతో అలియాస్ పేర్ల విషయంలో విజిలెన్స్ కేసులు పెడుతున్నారు. టెన్త్ పాస్ అంటూ కొర్రీలు పెడుతున్నారు. సింగరేణి కార్మికులకు చదువు ప్రామాణికం కాదు. కానీ ఉద్యోగాలు ఇవ్వొద్దన్న కారణంతో ఇవన్నీ చేస్తున్నారు. డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. ఇప్పటి వరకు కూడా 2 వేల మందికి ఇంకా ఉద్యోగాలు ఇవ్వకుండా పెండింగ్ లో ఉంచారు. నాలుగు నెల క్రితం మేము హైదరాబాద్ లో సింగరేణి భవన్ ను ముట్టడిస్తే మెడికల్ బోర్డు పెట్టారు.

కానీ దాని వల్ల కూడా ఎవరికీ ప్రయోజనం లేకుండా పోయింది. కచ్చితంగా నెలకు రెండుసార్లు సింగరేణి మెడికల్ బోర్డును నిర్వహించాలి. నాలుగైదు నెలల్లో రిటైర్ మెంట్ అవుతున్న వాళ్లు డిపెండెంట్ ఉద్యోగం కోసం టెన్షన్ పడవద్దు. హెచ్ఎంఎస్ గెలిచిన వెంటనే మీ అప్లికేషన్ డేట్ ను ప్రామాణికం చేసేలా చేస్తాం. సింగరేణలో ఓపెన్ కాస్ట్, అండర్ గ్రౌండ్ మైనింగ్ రెండు ఉండాలనే పాలసీ మాకు ఉంది. ఇక్కడ ఓసీ-3 మన సంస్థ ఆధ్వర్యంలో నడవటం కారణంగానే ఇక్కడ ఎక్కువ మంది పర్మినెంట్ ఎంప్లాయిస్ ఉన్నారు. అదే ప్రైవేట్ వాళ్లు నిర్వహించే మైనింగ్ లో ఎక్కువ మంది కాంట్రాక్ట్ కార్మికులే ఉంటారు. ఫ్యూచర్ లో ఓపెన్ కాస్ట్ గనులను కూడా సింగరేణియే నిర్వహించాలని మేము డిమాండ్ చేస్తున్నాం. నిన్నటి వరకు అండర్ గ్రౌండ్ మైనింగ్ కార్మికులను కలిశాం. ఇప్పుడు ఓపెన్ కాస్ట్ కార్మికులను కలుస్తున్నాం. వాళ్ల బాధలు వాళ్లకుంటే మీ బాధలు మీకు ఉన్నాయి. ముఖ్యంగా ఈపీ ఆపరేటర్లకు చాలా ఇబ్బందులు ఉన్నాయి. ప్రమోషన్ల కోసం వాళ్లు 12 ఏళ్లు వేచి చూడాల్సిన పరిస్థితి ఉంది. అలా కాకుండా వాళ్లు రిక్రూట్ అయ్యేప్పుడే బీ గ్రేడ్ విధానంలో రిక్రూట్ చేసుకుంటే వాళ్లకు మేలు జరుగుతుంది. ఇక వాళ్లు నడిపే వెహికిల్స్ నాసిరకంగా ఉంటున్నాయి. దీంతో ఆపరేటర్లు ప్రాణాలు పణంగా పెట్టాల్సి వస్తోంది. ఏడాది క్రితం జరిగిన ప్రమాదంలో ఒక ఈపీ ఆపరేటర్ ఇప్పటికీ కూడా కోమాలో ఉన్నారు. వాళ్ల చేసేది హైరిస్క్ జాబ్. అందుకే వారి భద్రత విషయంలో జాగ్రత్తగా ఉండాలని అన్నారు.

## రికార్డు ధర పలికిన హైదరాబాద్

# భూములపై న్యాయ వివాదం

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన ఈ లావాదేవీపై సందిగ్ధత నెలకొంది. రాయదుర్గం పాన్‌మక్తాలోని నాలెడ్జ్ సిటీ పరిధిలోని సర్వే నంబర్ 83/1లో ఉన్న భూమిని తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) ఈ-వేలం వేయడాన్ని సవాలు చేస్తూ ఎస్బీఐ కోర్టును ఆశ్రయించింది.

ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ విచారణ చేపట్టారు. సుమారు 5 ఎకరాల భూమికి సంబంధించిన ఈ వివాదంలో మూడు వారాల పాటు వేలం మరియు తదనంతర ప్రక్రియలను నిలిపివేయాలని ఆయన ఆదేశించారు.

ఈ మేరకు టీజీఐఐసీ, ఎస్బీఐతో పాటు వేలంలో భూమిని దక్కించుకున్న గౌరా వెంచర్స్‌కు కౌంటర్ అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేశారు. టీజీఐఐసీ మే 28న నిర్వహించిన వేలంలో 6.29 ఎకరాల భూమి ఎకరానికి రూ. 237 కోట్ల రికార్డు ధర పలికి, మొత్తంగా సుమారు రూ. 1,490 కోట్లను ఆర్జించింది. అనంతరం జూన్ 1న జరిగిన మరో వేలంలో 5.09 ఎకరాల భూమి ఎకరానికి రూ. 204 కోట్ల చొప్పున రూ. 1,038 కోట్లకు విక్రయించబడింది. వివాదంలో ఉన్న 5 ఎకరాల భూమిని 2010లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమకు కేటాయించిందని, దీని కోసం అప్పట్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ (ఎస్బీహెచ్) రూ. 13.33 కోట్లు చెల్లించిందని ఎస్బీఐ తన పిటిషన్‌లో పేర్కొంది. అయితే, ఆ తర్వాత ప్రభుత్వం కేటాయింపులను రద్దు చేయగా, దానిపై న్యాయపోరాటం కొనసాగుతున్నప్పటికీ టీజీఐఐసీ వేలం నిర్వహించడం సరికాదని వాదించింది. ప్రస్తుతం ఈ కేసులో తదుపరి విచారణను హైకోర్టు వాయిదా వేసింది.

# జీ7 తీర్మానాన్ని పూచికపుల్లలా

## తీసిపారేసిన కిమ్ సోదరి

ఆమె స్పష్టం చేశారు. పారిస్‌లో జరిగిన జీ7 దేశాల సదస్సులో, ఉత్తర కొరియాను పూర్తిగా అణు నిరాయుధీకరణ చేయాలని నాయకులు ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానాలకు అనుగుణంగా ఇది జరగాలని వారు కోరారు. ఈ డిమాండ్‌పై కిమ్ యో జోంగ్ తీవ్రంగా స్పందించారు. అమెరికా, దాని మిత్రదేశాలు చేస్తున్న ఈ డిమాండ్ 'పాతకాలపుది' అని ఆమె విమర్శించారు. ఉత్తర కొరియా అధికారిక వార్తా సంస్థ కేసీఎన్ఏ ఈ వివరాలను ప్రచురించింది. "అణు నిరాయుధీకరణ అనేది వెనక్కి తీసుకోలేని విధంగా ముగిసిపోయిన అజెండా. అది ఎప్పటికీ సాకారం కాదు" అని ఆమె తన ప్రకటనలో పేర్కొన్నారు. అణ్వాయుధాలు తమ సార్వభౌమాధికారాన్ని కాపాడే శక్తివంతమైన సాధనాలని, దేశ శాంతికి మూలస్తంభాలని ఆమె అన్నారు. "అణ్వస్త్ర దేశం యొక్క ప్రధాన ప్రయోజనాలకు హాని తలపెట్టాలని చూసేవారు, విపత్తును ఆహ్వానించినట్టే" అని ఆమె తీవ్రంగా హెచ్చరించారు. అమెరికా, బ్రిటన్, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, ఇటలీ నేతలు తమ సమావేశంలో ఉత్తర కొరియా అణు, బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, 1970లు, 80లలో కిడ్నాప్‌కు గురైన వారి సమస్యను వెంటనే పరిష్కరించాలని, ఉత్తర కొరియా పాల్పడుతున్న సైబర్ నేరాలు, క్రిప్టోకరెన్సీ దొంగతనాలను కూడా అరికట్టాలని వారు పిలుపునిచ్చారు.

# ఆర్టీసీ పురోగతిపై మంత్రి పొన్నం సమీక్ష

నిర్ణయించాం. అలాగే ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల షెడ్యూల్ను త్వరలో విడుదల చేసి ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశించారు.

నాగర్కర్నూల్, పెద్దపల్లి డిపో పనులను వేగవంతం చేయడంతో పాటు మంజూరైన బస్ స్టేషన్ల శంకుస్థాపనలకు కార్యాచరణ రూపొందించాలని సూచించాను. ఆత్మహత్య చేసుకున్న ఉద్యోగి శంకర్ కుటుంబానికి రూ.1 కోటి చెక్కు, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు అందించే ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలో దక్షిణ భారత రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, కమిషనర్లు, ఆర్టీసీ ఎండీలతో సమావేశం నిర్వహించి ప్రజా రవాణా వ్యవస్థ అభివృద్ధిపై చర్చించనున్నామని మంత్రి వెల్లడించారు.

# మైనార్టీ సంక్షేమానికి

# భారీ కేటాయింపులు

నిర్మాణంలో మరో 17 పాఠశాలలను ఉన్నాయని చెప్పారు. వాటిని త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం ఆదేశించారు.

రెసిడెన్షియల్ స్కూల్ భవనాల పనులకు టైమ్ క్యాలెండర్ రూపొందించాలని అధికారులకు స్పష్టం చేశారు. రాజీవ్ యువ వికాసం ద్వారా మైనార్టీ యువతకు ఆర్థిక సహాయం అందిస్తామని పేర్కొన్నారు. క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమానికి రూ.50 కోట్లు కేటాయింపులు చేసినట్లు వివరించారు. వక్ఫ్ భూముల పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మైనార్టీల శ్మశాన వాటికల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. కొత్త శ్మశాన వాటికల కోసం భూముల సేకరించాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్లను ఆదేశించామని అన్నారు. ఈ శ్మశాన వాటికల చుట్టూ ప్రహరీ గోడల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు.

## మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జీవితాన్ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలి

గడిపే ప్రతి క్షణం ఆనందాన్ని ఇస్తుంది. సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం కూడా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది" అని కేటీఆర్ పేర్కొన్నారు. స్వామి రామానంద తీర్థ మెమోరియల్ స్కూల్‌కు అవసరమైన అదనపు తరగతి గదులు, ఆధునిక లైబ్రరీ నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. విద్యార్థులకు అండగా నిలుస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న ఎమ్మెల్సీ సురభి వాణీదేవి సేవలను ప్రశంసించారు.

# హరిత హారం.. ఎల్బీనగర్‌కు పర్యావరణ వరం

శంకుస్థాపన చేశారు. పెరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో నగర ఊపిరితిత్తులుగా మారనున్న ఈ సువిశాల అరణ్య ప్రాంతాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన స్పష్టం చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గ పర్యావరణ సమతుల్యతను, స్థానిక వాతావరణాన్ని ఈ ప్రాజెక్టు సమూలంగా మార్చనుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఎల్బీనగర్ నా స్వగృహం: భావోద్వేగానికి లోనైన ముఖ్యమంత్రి

సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ భావోద్వేగపూరిత వ్యాఖ్యలు చేశారు. తన జన్మభూమి అయిన కొండారెడ్డిపల్లి గ్రామానికి వెళ్తే ఎంతటి మానసిక ప్రశాంతత లభిస్తుందో, ఎల్బీనగర్ నియోజకవర్గానికి వస్తే తన సొంత ఇంటికి వచ్చినంత సంతోషం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజలు తనపై చూపిస్తున్న ఆదరణను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

## దీర్ఘకాలిక భూ వివాదాలు, జీవో 118పై సానుకూల స్పందన

నియోజకవర్గ పర్యటనలో భాగంగా స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి వచ్చాయి. జీవో నం. 118 వివాదం: బి.ఎన్.రెడ్డి నగర్ పరిధిలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 118 భూ రిజిస్ట్రేషన్ల సమస్యను స్థానిక నేతలు ముఖ్యమంత్రికి వివరించారు.

లి లిన్యాయపరమైన చిక్కులు:లి కర్మన్‌ఘాట్, బైరమల్‌గూడ, సుల్తాన్ వాల్వా రెవెన్యూ పరిధిలో కోర్టు తీర్పుల కారణంగా నిలిచిపోయిన రిజిస్ట్రేషన్ల వివాదాన్ని పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.

ఈ సమస్యలపై స్పందించిన ముఖ్యమంత్రి, వీటన్నింటిపై తనకు పూర్తి అవగాహన ఉందని స్పష్టం చేశారు. త్వరలోనే చట్టపరమైన అడ్డంకులను తొలగించి బాధితులకు పూర్తి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

## వాహనాల రద్దీ నివారణకు 'మేఘ మార్గం' (ఫ్లైఓవర్)

సాగర్ రహదారిలోని ఓంకార్ నగర్ కూడలి నుండి గుర్రంగూడ అటవీ ప్రాంతం వరకు నిత్యం ఎదురవుతున్న తీవ్ర రవాణా రద్దీ సమస్యను స్థానికులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన ముఖ్యమంత్రి, రద్దీ నివారణకు వీలుగా అక్కడ ఒక ఉన్నత వంతెన లేదా 'మేఘ మార్గాన్ని' (ఫ్లైఓవర్) మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన పరిపాలనా అనుమతులు, ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

## వైజ్ఞానిక, పర్యావరణ ప్రాధాన్యత:

ఈ పర్యావరణ ఉద్యానవనం కేవలం వినోద కేంద్రంగానే కాకుండా, నగర జీవ వైవిధ్యానికి (బయోడైవర్సిటీ) ఒక రక్షణ కవచంగా నిలవనుంది. స్థానిక వృక్ష, జంతుజాలాల పరిరక్షణతో పాటు, భూగర్భ జలాల పెంపునకు, కార్బన్ ఉద్గారాల తగ్గింపునకు (కార్బన్ సీక్వెస్ట్రేషన్) ఈ 424 ఎకరాల అడవి ఎంతగానో దోహదపడుతుందని పర్యావరణ నిపుణులు భావిస్తున్నారు.

## విజయవంతమైన బహిరంగ సభ

పర్యావరణ పరిరక్షణ నినాదంతో సాగిన ఈ వనమహోత్సవ సభకు రంగారెడ్డి జిల్లా ఇన్-చార్జ్ మంత్రి శ్రీధర్ బాబు, అటవీ-పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, ఇబ్రహీంపట్నం శాసనసభ్యుడు మల్లారెడ్డి రంగారెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ప్రజలు, వివిధ శ్రేణుల ప్రతినిధులు భారీ సంఖ్యలో తరలివచ్చి ఈ బహిరంగ సభను విజయవంతం చేశారు. తమ ప్రాంత సమగ్ర అభివృద్ధికి పునాది వేసినందుకు స్థానిక ప్రజలు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## రైతు భరోసా నిధుల విడుదలకు

# డేట్ ఫిక్స్..

కేంద్రం తక్కువ ధాన్యం సేకరించడం సరికాదని అన్నారు.. ఎరువుల కోటా, రామగుండం యూరియాలో రాష్ట్రానికి సింహభాగం కేటాయింపు, హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 అనుమతులు, ఐఆర్ఎఫ్ సీ రుణాల విడుదలపై త్వరలోనే మంత్రుల బృందం ఢిల్లీ వెళ్లనుందని చెప్పారు. రాష్ట్రాభివృద్ధి కోసం బీజేపీ ఎంపీలు కూడా కలిసి రావాలని పిలుపునిచ్చారు. జూన్ 21న జరిగే నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కేబినెట్ నిర్ణయించిందని చెప్పారు. ఇకపై అంతా డిజిటల్ కేబినెట్ నిర్వహిస్తామన్నారు.

# సంపాదకీయం

భారత శక్తి

## ప్రాంతీయ పార్టీల పని అయిపోయిందా

అప్పట్లో బెంగాల్ ముఖ్యమంత్రిగా మమతా బెనర్జీ ఉన్నప్పుడు చికెన్ నెక్ రహదారి విషయంలో అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టింది. కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. వ్యక్తిగతంగా అమిత్ షా రిక్వెస్ట్ చేసినప్పటికీ మమత కరగలేదు. పైగా కేంద్ర దర్యాప్తు సంస్థల అధికారుల మీద ఉల్టా కేసులు పెట్టింది. బెంగాల్లో అడుగుపెట్టిన వారి మీద దాడి చేసింది.ఢిల్లీలో అప్పట్లో రైతు చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమం జరిగింది. గణతంత్ర దినోత్సవం రోజు ప్రధానమంత్రి జండా ఎగరవేసిన తర్వాత.. ఎర్రకోట మీద ఖలిస్తాన్ వేర్పాటు వాదులు జెండా ఎగరవేశారు. అప్పట్లో ఈ చర్యను ఆప్ ప్రభుత్వం సమర్థించింది. అదే కాదు పంజాబ్ నుంచి.. హర్యానా నుంచి కొంతమంది ప్రతీప శక్తులు ఢిల్లీ రావడానికి కారణమైందిమహారాష్ట్రలో శివసేన అధికారంలో ఉన్నప్పుడు బీజేపీ నాయకుల మీద విపరీతంగా కేసులు పెట్టారు. కొన్ని సందర్భాలలో వేరే శక్తులకు అవకాశం కల్పించారు. తద్వారా భారత ప్రభుత్వానికి ఇబ్బందికరమైన వాతావరణం ఏర్పడింది. అంతేకాదు, మాఫియా శక్తులు బలపడేందుకు శివసేన కారణమైందని అప్పట్లో ఆరోపణలు వినిపించాయి.ఇవన్నీ కూడా మోడీకి.. అమిత్ షా కు చికాకు కలిగించాయి. అందువల్లే ఈ దారుణాలకు ప్రాంతీయ పార్టీలు కారణమని వారు బలంగా నమ్మారు. పైగా దేశంలో జరుగుతున్న ఘోరాలకు.. అవాంఛనీయ సంఘటనలకు ప్రాంతీయ పార్టీలు దోహదం చేస్తున్నాయని వారిలో ఒక నమ్మకం ఏర్పడింది. ఇక అప్పటినుంచి వారు ఆపరేషన్ లోటస్ మొదలుపెట్టారు.కొన్ని సంవత్సరాల క్రితమే మహారాష్ట్రలో శివసేన పార్టీని నిలువునా చీల్చి పడేశారు మోడీ, షా. ఇప్పుడు ఏకంగా ఉద్ధవ్ వర్గంలో ఉన్న 9 మంది ఎమ్మెల్యేలలో ఆరుగురిని ఆకర్షించారు. కాకపోతే వారు నేరుగా బిజెపిలో చేరకుండా.. ఇతర పార్టీలో చేరబోతున్నారు. ఆ తర్వాత బీజేపీలోకి చేరడానికి ఆస్కారం కల్పిస్తున్నారు. మహారాష్ట్రలో ఇప్పటికే బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉంది. 2024 ఎన్నికల్లో మహారాష్ట్రలో చెప్పుకునే స్థాయిలో బిజెపి పార్లమెంటు స్థానాలను గెలుచుకోలేకపోయింది. అందువల్లే తమకు ప్రతిబంధకంగా ఉన్న శివసేనను మరొకసారి చీల్చి పడేసే పనిని భుజాలకు ఎత్తుకున్నారు మోడీ, షా.పశ్చిమ బెంగాల్లో టిఎంసి పార్టీకి 28 మంది ఎంపీలు ఉన్నారు. వారిలో ఇప్పుడు 20 మంది బయటకు వచ్చారు. వారంతా నేరుగా బిజెపిలో చేరలేదు. ఎన్ సి పి ఐ పార్టీలో చేరారు. వీరంతా దశలవారీగా మళ్లీ బిజెపి తీర్థం పుచ్చుకుంటారు. కేవలం ఎంపీలు మాత్రమే కాదు ఎమ్మెల్యేలు కూడా దాదాపు 58 మంది వేరే కుంపటి పెట్టారు. ప్రతిపక్షంగా తమనే గుర్తించాలని ఇప్పటికే స్పీకర్ కు లెటర్ రాశారు.మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ కంటే ముందుగానే ఆమ్ ఆద్మీ పార్టీలో కొంతమంది రాజ్యసభ సభ్యులు బిజెపిలో చేరారు. దీంతో ఎగువ సభలో బిజెపికి బలం పెరిగింది. రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలను చీల్చివేయడం.. రాజ్యసభ సభ్యులను.. పార్లమెంట్ సభ్యులను చేర్చుకోవడం ద్వారా బిజెపి గెట్టి ప్లాన్ వేసింది. ఇదంతా కూడా పార్లమెంట్లో 2/3 మెజారిటీ కోసం.. ఎందుకంటే ప్రస్తుత ఎన్డీఏ భుత్వం టిడిపి, నితీష్ కుమార్ సపోర్ట్ తో నడుస్తోంది. ఆల్రెడీ బీహార్ లో నితీష్ కుమార్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో బిజెపి అభ్యర్థి ముఖ్యమంత్రి కొనసాగుతున్నారు.. ఆంధ్రప్రదేశ్లో కూటమి ప్రభుత్వం బలంగా ఉంది.. ఇన్ని సానుకూలతలు కనిపిస్తున్న నేపథ్యంలో బిజెపి పెద్దలు వేసిన స్కెచ్ భారీగానే ఉంది.పార్లమెంట్లో బలం పెంచుకోవడం.. అప్పర్ హౌస్ లో మరింత స్ట్రాంగ్ గా ఉండడంతో కీలకమైన బిల్లులు ఆమోదింప చేసుకోవాలని మోడీ, షా భావిస్తున్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు.. డిలిమిటేషన్.. ఇంకా చాలా బిల్లులు ఈ టర్మ్‌లోనే పూర్తి చేసుకొని.. 2027 లేదా 2028 ఎన్నికలకు సంపూర్ణ ఆత్మవిశ్వాసంతో వెళ్లాలని మోడీ, షా భావిస్తున్నారు.. బీహార్ లో జేడీయు.. ఆంధ్రప్రదేశ్లో టిడిపి ఎన్డీఏ ప్రభుత్వానికి సపోర్ట్ ఇస్తున్నాయి. అలాంటప్పుడు ఆ పార్టీల కోరికలు తీర్చాల్సిన అవసరం లేకుండానే.. బిజెపి ఇలా రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలను టార్గెట్ చేసి.. ఓడిస్తోందని.. ఆ పార్టీల ఎంపీలను కలిపేసుకుంటున్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఏది ఏమైనప్పటికీ ఆపరేషన్ లోటస్ రాకెట్ వేగంతో దూసుకుపోతోంది. దీనిని ఆపే ప్రయత్నం గాని.. ఆపే సాహసం గాని ఎవరూ చేయడం లేదు. మరో వైపు ప్రాంతీయ పార్టీలకు ఒకే కుటుంబం ఆధిపత్యం వహిస్తుంది. పార్టీని వృద్ధిలోకి తీసుకురావడానికి ఎంతో కష్టపడిన సీనియర్ నాయకులను పక్కకు తప్పిస్తారు. ఇదే పార్టీలో అంతర్గత ఘర్షణలకు కారణమవుతుంది. చీలికలకు కారణమవుతుంది. పార్టీలోని యువతరం దీనిని సరిపెట్టుకోలేకపోతోంది. వంశపారంపర్య రాజకీయాలను యువతరం వ్యతిరేకిస్తోంది.అవినీతి ఆరోపణలు: ప్రాంతీయ పార్టీల్లో ప్రధానంగా కనిపించేది అవినీతి ఆరోపణలు. పార్టీ నాయకులు ఆరోపణలను ఎదుర్కోవడం, జైలుకు వెళ్లడం ఉమ్మడిగా కనిపించే అంశం. ఈ పార్టీల్లో అవినీతి తీవ్రమైన అంశమని చాలా మంది చెబుతూ ఉంటారు.నాయకత్వం అహంకారం: ప్రాంతీయ పార్టీల నాయకులు అహంకారాన్ని ప్రదర్శిస్తూ ఉంటారు. సెలబ్రిటీలు అహంకారంతో నెట్టుకొస్తారు. కానీ రాజకీయవేత్తలు ప్రజాబలంతో అధికారంలో కొనసాగుతారు. మద్దతుదారులకు దూరం అయినవారు అధికారానికి దూరం అవుతూ ఉంటారు. జరుగుతున్నది ఇదే.పరిపాలనలో పేలవత్వం: అనువంశిక పాలన మాత్రమే కాకుండా అవినీతి ఆరోపణలు ప్రాంతీయ పార్టీలను దెబ్బతీస్తున్నాయి.

అంతేకాకుండా సరైన పాలన లేకపోవడం కూడా ఒక కారణం. ఆర్థిక పరమైన బలహీన పరిస్థితి, కులాలు, ఇతర వర్గాలపై అతిగా ఆధారపడటం, మతపరమైన కారణాలు మొదలైన వాటివల్ల ప్రాంతీయ పార్టీలు క్షీణిస్తున్నాయి.నేర్చుకోవలసిన పాఠాలు: ఒడిశాకు 24 ఏళ్ల పాటు సీఎంగా పని చేసిన నవీన్ పట్నాయక్ చక్కని ఉదాహరణ. రాజకీయ అనువంశికంపై ఆయన ఆధారపడలేదు. ఆయన పాలనలో అవినీతి ఆరోపణలు ఎక్కువ రాలేదు. రాష్ట్రాన్ని ఆయన మంచిగా పరిపాలించారు. ప్రాంతీయ పార్టీల పతనానికి అవే కారణాలు. ఇతరులను నిందించడం ఎందుకు?ప్రాంతీయ పార్టీలను బీజేపీ మింగేస్తోందన్న ఆరోపణలు మీడియా చర్చల్లో తరచూ వస్తున్నాయి. కాంగ్రెస్ ఇతర పార్టీలను తమ పార్టీలో కలుపుకోవాలని చూస్తోందన్న అభిప్రాయం కూడా ఉంది.

రాజకీయాల్లో పోటీ తత్వం పెరిగింది. ఓడిన వారి పట్ల సానుభూతి చూపరు. కొన్ని దేశాల్లో ఓడిన నాయకులు జైళ్లలో మగ్గడమో, నికృష్టమైన జీవనం గడపడమో చూస్తున్నాం. ప్రాంతీయ పార్టీల పతనానికి అవినీతి, బంధుప్రీతి, ఆశ్రీత పక్షపాతం ప్రధాన కారణాలు. ప్రాంతీయ పార్టీలు మారుతున్న వాస్తవాలను దృష్టిలో ఉంచుకుంటే అవి నిలదొక్కుకోగలుగుతాయి. అలా చేయలేకపోతే అవి రాజకీయ యవనికపై నుంచి తెరమరుగు అవుతాయి. ఇతరులను నిందించడం ఎందుకు? మార్పులను ఆహ్వానించవల్సిందే, లేదా కాలగర్భంలో కలిసిపోవల్సిందే.ఎందుకంటే మోడీ, షా తలుచుకుంటే ఏం చేస్తారో వారికి తెలుసు.

# భోజనం చేసిన వెంటనే యోగా చేస్తే..!

యోగికి ఎటువంటి వ్యాధి లేనట్లుగా, యోగా చేసేవారి ఆరోగ్యానికి ఏ ఢోకా ఉండదని చెబుతున్నారు నిపుణులు. యోగాతో పాటు, ఆహారానికి కూడా మంచి ప్రాముఖ్యత ఇవ్వాలి. ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారం ఎలా ఉండాలి? ఆహారం తినడానికి, యోగా చేయడానికి మధ్య ఎంత సమయం ఉండాలి? ఆరోగ్యంగా ఉండాలంటే రోజువారీ కార్యకలాపాల్లో శారీరక వ్యాయామాన్ని భాగం చేసుకోవడం చాలా అవసరం. ముఖ్యంగా చిన్నపాటి యోగాసనాలు ఆరోగ్యానికి చెప్పలేనంత మేలు చేస్తాయి. యోగా శరీర వశ్యతను పెంచడంలో సహాయపడటమే కాకుండా, మొత్తం ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. యోగికి ఎటువంటి వ్యాధి లేనట్లుగా, యోగా చేసేవారి ఆరోగ్యానికి ఏ ఢోకా ఉండదని చెబుతున్నారు నిపుణులు. యోగాతో పాటు, ఆహారానికి కూడా మంచి ప్రాముఖ్యత ఇవ్వాలి. ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారం ఎలా ఉండాలి? ఆహారం తినడానికి, యోగా చేయడానికి మధ్య ఎంత సమయం ఉండాలి? అనే విషయాల గురించి సీనియర్ డైటీషియన్, డయాబెటిస్ నిపుణుడు డాక్టర్ నిషా జైన్ మాట్లాడుతూ.. యోగా చేయడానికి ముందు మీ కడుపు సాధ్యమైనంత వరకు ఖాళీగా ఉండాలని అన్నారు. భోజనానికి, యోగాకు మధ్య కనీసం 8 నుంచి 10 గంటల గ్యాప్ నిర్వహించడం మంచిదని సూచించారు. సాయంత్రం త్వరగా భోజనం తినవచ్చు. ఆ తర్వాత ఆ మరుసటి రోజు ఉదయం పూట యోగా క్షేమంగా చేయవచ్చు. అయితే పగటిపూట యోగా చేస్తుంటే మాత్రం తినడానికి, యోగాకి మధ్య కనీసం 1 గంట గ్యాప్ అవసరమని చెప్పారు. అంటే భోజనం తిన్న 1 గంటలోపు యోగా చేయకుండా ఉండాలని అంటున్నారు. యోగా చేసే ముందు తేలికైన ఆహారాలు తినవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. యోగా చేసే ముందు గ్రీన్ టీ, బ్లాక్ కాఫీ, అరటిపండ్లు, ఆపిల్స్ తినవచ్చు. నట్స్, డ్రైఫ్రూట్స్ వంటి ఆహారాలు తినవచ్చు. ఈ ఆహారాలు శరీరంలో నెమ్మదిగా శక్తిని విడుదల చేస్తాయి. ఇది యోగా సమయంలో శరీరాన్ని చురుగ్గా ఉంచుతుంది కూడా. ముఖ్యంగా యోగా చేసే ముందు వేయించిన లేదా కారంగా ఉండే ఆహారాన్ని పూర్తిగా మానేయడం మంచిది. ఇది కడుపు ఉబ్బరం,



కడుపులో భారమైన అనుభూతి, వికారం వంటి లక్షణాలను కలిగిస్తుంది. యోగా చేసిన 30 నిమిషాల తర్వాత పుష్కలంగా నీరు తాగాలి. ఇది శరీరాన్ని తిరిగి హైడ్రేట్ చేస్తుంది. దీనితో పాటు, కొబ్బరి నీరు లేదా నిమ్మకాయ నీరు కూడా తాగవచ్చు. అలాగే యోగా తర్వాత ప్రోటీన్ ఆహారాలు కూడా తీసుకోవచ్చు. ఇందుకోసం ఉడికించిన గుడ్లు తినవచ్చు.

## ఈ అలవాట్లు ఉంటే పాతిక ఏళ్లకే వృద్ధాప్యం..



కొంత మంది పాతికేళ్లకే నలభై ఏళ్ల మాదిరి కనిపిస్తుంటారు. ముఖ్యంగా అబ్బాయిల్లో ఈ లక్షణాలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. నిజానికి.. మన రోజువారీ ఆహార అలవాట్లు ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయని నిపుణులు అంటున్నారు. అంతేకాదు వృద్ధాప్యానికి కూడా ఈ అలవాట్లే కారణమవుతాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మన రోజువారీ ఆహార అలవాట్లు ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. అంతేకాదు వృద్ధాప్యానికి కారణమవుతాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఏమి తింటారు అనే దాని నుంచి స్ట్రెస్‌ని ఎలా ఎదుర్కొంటారు అనే దాని వరకు.. అన్ని అంశాలు మీ వయస్సు ఎంత వేగంగా క్షీణిస్తుందో నిర్ణయించగలవట. అలాగే ఈ అలవాట్లు దీర్ఘకాలిక ఆరోగ్యంపై కూడా పెద్ద ప్రభావాన్ని చూపుతుందని చెబుతున్నారు.ధూమపానం: వృద్ధాప్య ప్రక్రియను వేగవంతం చేసే విషయంలో ధూమపానం అత్యంత హానికరమైన అలవాట్లలో ఒకటి. ఇది చర్మం స్థితిస్థాపకతను దెబ్బతీస్తుంది. ఇది రక్త ప్రవాహాన్ని తగ్గిస్తుంది. ముడతలు, నిస్తేజమైన చర్మానికి దారితీస్తుంది. ఇది కాలేయంతో సహా మొత్తం శరీర ఆరోగ్యంపై చెడు ప్రభావాన్ని చూపుతుంది.మద్యం సేవించడం: అధికంగా మద్యం సేవించడం వల్ల వృద్ధాప్య సంకేతాలు కనిపిస్తాయి. మద్యం చర్మాన్ని డీహైడ్రేట్ చేస్తుంది. వాపుకు కారణమవుతుంది. అధికంగా మద్యం సేవించడం వల్ల కాలక్రమేణా కాలేయ పనితీరు దెబ్బతింటుంది. అధిక వేడి: విటమిన్ డి కోసం సూర్యరశ్మి చాలా అవసరం. అయినప్పటికీ.. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య సూర్యరశ్మిని నివారించడం మంచిది. ఎందుకంటే ఇది చర్మం వృద్ధాప్యాన్ని వేగవంతం చేస్తుంది. సన్ స్క్రీన్ ఉపయోగించకపోతే, చర్మాన్ని సూర్య రశ్మి నుంచి కాపాడుకోవడానికి రక్షణ దుస్తులు ధరించకపోతే సూర్యరశ్మి వల్ల మచ్చలు, సన్నని గీతలు, ముడతలు చర్మంపై ఏర్పడి వృద్ధాప్య ప్రక్రియను వేగవంతం చేస్తాయి.దీర్ఘకాలిక నిర్జలీకరణం: సరైన హైడ్రేషన్.. అంటే తగినంత నీరు తాగకపోతే డీహైడ్రేషన్ సమస్యలు వస్తాయి. తగినంత నీరు త్రాగకపోవడం వల్ల చర్మం పొడిబారి, పొలుసులుగా మారి నిర్జీవంగా కనిపిస్తుంది.ప్రాసెస్ చేసిన ఆహారాలు, చక్కెర తీసుకోవడం: చక్కెర, ప్రాసెస్ చేసిన ఆహారాలు జీవక్రియను ప్రభావితం చేయడమే కాకుండా చర్మ సమస్యలు, వాపుకు కూడా కారణమవుతాయి.

ఇది చర్మం జీవం కోల్పోవడం, ముడతలు వంటి వృద్ధాప్య అకాల సంకేతాలకు దారితీస్తుంది. ఒత్తిడి: వృద్ధాప్యానికి ఒత్తిడి ప్రధాన కారణం. దీర్ఘకాలిక ఒత్తిడి హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీస్తుంది. నిద్రను ప్రభావితం చేస్తుంది. ముఖంపై మచ్చలు లేదా కళ్ళ కింద నల్లటి వలయాలకు దారితీస్తుంది. ఒత్తిడిని నిర్వహించడానికి, మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి "భ్రమరి ప్రాణాయామం" చేయడం మంచి మార్గం.

## ఉదయాన్నే ఈ తెల్లటి రసం తాగి చూడండి..




ప్రతి రోజు ఉదయం ఒక గ్లాసు తెల్ల గుమ్మడికాయ రసం తాగడం ఆరోగ్యానికి చాలా మంచిది. చాలా మంది ఉదయాన్నే కాఫీ, టీ తాగుతారు. వాటికి బదులు ఈ సహజ రసం తీసుకుంటే శరీరానికి మేలు చేస్తుంది. మనసుకు ప్రశాంతతను ఇస్తుంది. తెల్ల గుమ్మడికాయలో చాలా పోషకాలు ఉంటాయి. ఇవి నరాలకు శక్తిని ఇస్తాయి. మెదడును ప్రశాంతంగా ఉంచడంలో సహాయపడుతాయి. దాంతో ఉదయాన్నే ఈ రసం తాగితే ఒత్తిడి తగ్గుతుంది. ఆందోళన లేకుండా రోజంతా ఉత్సాహంగా ఉంటారు. ఈ రసం మూత్రపిండాలకు ఎంతో మేలు చేస్తుంది. మూత్రంలో వచ్చే ఇన్ ఫెక్షన్లు, మూత్రంలో రక్తం రావడం, పైల్స్ వల్ల రక్తం పోవడం లాంటి సమస్యలను తగ్గిస్తుంది. తెల్ల గుమ్మడికాయ రసం చల్లగా ఉంటుంది. శరీరాన్ని ప్రశాంతంగా ఉంచుతుంది.అల్సర్ తో బాధపడేవారు తెల్ల గుమ్మడికాయ రసాన్ని తేనెతో కలిపి ఉదయం తాగితే కడుపు లోపల గాయాలు త్వరగా తగ్గుతాయి. కడుపులోని పురుగులను బయటకు పంపిస్తుంది. కొత్త ఇన్ ఫెక్షన్లు రాకుండా ఆపుతుంది.బరువు తగ్గాలని అనుకునే వారికి ఇది బాగా ఉపయోగపడుతుంది. రోజూ ఉదయం ఈ రసం తాగడం వల్ల శరీరంలోని అదనపు నీరు బయటకు పోతుంది. ఇది బరువు తగ్గించడమే కాకుండా.. శరీరాన్ని తేలికగా, శక్తివంతంగా ఉంచుతుంది. శరీరంలో వేడి ఎక్కువగా ఉన్నవారికి కూడా ఇది చాలా మంచిది.

ఈ రసం తాగితే శరీరం చల్లబడుతుంది. తేమగా మారుతుంది. వేసవిలో వేడి సమస్యలతో బాధపడే వారికి ఇది మంచి పరిష్కారం.తెల్ల గుమ్మడికాయ రసాన్ని తేనెతో కలిపి ఉదయం, సాయంత్రం తాగితే రక్తం శుభ్రపడుతుంది. ఇది శరీరం లోపల అవయవాలకు సాయపడుతుంది. రక్తం కారడాన్ని నియంత్రించడంలో కూడా తోడ్పడుతుంది. ఈ గుమ్మడికాయలో విటమిన్ బి, సి, కాల్షియం, పొటాషియం, ఫాస్ఫరస్, ఫైబర్, ఐరన్, నీరు ఎక్కువగా ఉంటాయి. ఇవన్నీ ఆరోగ్యానికి అవసరమైన ముఖ్యమైన పదార్థాలు. ప్రతి ఉదయం ఒక గ్లాసు తెల్ల గుమ్మడికాయ జ్యూస్ తాగడం మన శరీరానికి, మనసుకు చాలా మంచిది. ఇది ఒక చిన్న అలవాటు. కానీ దీని వల్ల చాలా గొప్ప ఫలితాలు ఉంటాయి.

# జ్వరానికి అసలు కారణం ఏంటి..?

మన శరీరానికి చాలా రకాల ఇన్ ఫెక్షన్లు వస్తాయి. వాటిలో ముఖ్యంగా వైరస్ లు, బ్యాక్టీరియా వల్ల వచ్చేవి ఎక్కువగా ఉంటాయి. ఒక వ్యక్తిని పరీక్ష చేసిన తర్వాత డాక్టర్ ఇది వైరల్ ఫీవర్ అని చెప్పడం మనం తరచూ వింటాం. కానీ అది వైరస్ వల్ల వచ్చిందని ఎలా అర్థం చేసుకోవాలి..? బ్యాక్టీరియా వల్ల వచ్చిందా లేదా వైరస్ వల్ల వచ్చిందా అని ఎలా తెలుసుకోవాలి..? ఈ రెండింటి మధ్య తేడాలు తెలుసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా అవసరం. వైరస్ లు, బ్యాక్టీరియా ఇన్ ఫెక్షన్లు ఈ రెండు జబ్బులు సూక్ష్మజీవుల వల్ల వస్తాయి. కానీ అవి శరీరంపై పని చేసే విధానం వేరుగా ఉంటుంది. బ్యాక్టీరియా అనేది సొంతంగా బతకగల ఒకే కణం జీవి. కొన్ని రకాల బ్యాక్టీరియా శరీరానికి హానికరం కావు. కానీ కొన్ని రకాల బ్యాక్టీరియా జబ్బులు కలిగిస్తాయి. ఉదాహరణకు టీబీ (ట్యూబర్క్యులోసిస్), యూరినరీ ట్రాక్ట్ ఇన్ ఫెక్షన్లు, గొంతు నొప్పి లాంటివి ఈ రకానికి చెందుతాయి. ఇవి యాంటీబయోటిక్ మందులతో నయం అవుతాయి. వైరస్ లు చాలా చిన్న జీవులు. ఇవి శరీరంలోకి వెళ్ళిన తర్వాత మంచి కణాలను ఆక్రమించి పెరుగుతాయి. వాటి వల్ల జలుబు, దగ్గు, జ్వరం, కోవిడ్ లాంటి జబ్బులు వస్తాయి. వైరల్ ఇన్ ఫెక్షన్ కు యాంటీబయోటిక్స్ పని చేయవు.వైరల్, బ్యాక్టీరియా ఇన్ ఫెక్షన్లకు కొన్ని లక్షణాలు ఒకేలా కనిపించవచ్చు. ఉదాహరణకు జ్వరం, గొంతు నొప్పి, అలసట, ఒళ్ళు నొప్పులు రెండింటిలోనూ రావచ్చు. కానీ వైరల్ ఇన్ ఫెక్షన్లు సాధారణంగా నెమ్మదిగా వస్తూ 5 నుంచి 10 రోజుల్లో తగ్గిపోతాయి. అయితే బ్యాక్టీరియల్ ఇన్ ఫెక్షన్లు రోజురోజుకూ తీవ్రంగా మారతాయి. వాటిని వదిలేస్తే ఇతర శరీర భాగాలకు వ్యాపించే ప్రమాదం ఉంటుంది.చాలా సార్లు డాక్టర్లు లక్షణాలను చూసి చెబుతారు. అయితే కచ్చితంగా తెలుసుకోవాలంటే రక్త పరీక్ష, మూత్ర పరీక్ష లాంటివి అవసరం. కొన్నిసార్లు గొంతు స్రావాన్ని కూడా చూడాలి. కొన్ని వైరల్ జబ్బులు పొక్కులు లాగా కనిపిస్తాయి.. ఉదాహరణకు ఆటలమ్మ, అమ్మవారు లాంటివి. కానీ కొన్నింటిని గుర్తించడానికి టెస్టులు అవసరం.. ఉదాహరణకు కోవిడ్, హెపటైటిస్.



చికిత్స పూర్తిగా జబ్బుకు కారణాన్ని బట్టి నిర్ణయించాలి. వైరస్ వల్ల వచ్చిన ఇన్ ఫెక్షన్ లకు ఎక్కువగా విశ్రాంతి, ద్రవ పదార్థాలు తీసుకోవడం, కొన్ని ఉపశమనం ఇచ్చే మందులు వాడటమే చేస్తారు. బ్యాక్టీరియల్ ఇన్ ఫెక్షన్లు అయితే డాక్టర్ సూచన మేరకు యాంటీబయోటిక్స్ తీసుకోవాలి. కానీ వాటిని అనవసరంగా వాడకూడదు. అది రోగనిరోధక శక్తిని తగ్గిస్తుంది. అలాగే జాగ్రత్తలు తీసుకోవడం వల్ల జబ్బులు రాకుండా చూసుకోవచ్చు. ఈ రెండు రకాల జబ్బులను కొన్ని సాధారణ జాగ్రత్తలతో ఆపవచ్చు. జబ్బుతో ఉన్నవారికి దూరంగా ఉండడం.గోరువెచ్చని నీళ్లు తాగడం.చేతులు కడగకుండా ముఖాన్ని తాకకూడదు. మాస్క్ వాడటం, శుభ్రత పాటించడం ముఖ్యమైనవి. వైరల్, బ్యాక్టీరియా ఇన్ ఫెక్షన్ల లక్షణాలు కొంతవరకు ఒకేలా కనిపించినా.. చికిత్స పూర్తిగా వేరుగా ఉంటుంది. సరైన పరీక్షల ద్వారానే సరైన వైద్యం అందుతుంది. అందుకే మనం జాగ్రత్తగా ఉండి.. ఏ లక్షణాలు కనిపించినా డాక్టర్లను కలిసి కారణాన్ని కచ్చితంగా తెలుసుకొని చికిత్స తీసుకోవాలి.

## 80 కేజీల గంజాయిని పట్టుకున్న పోలీసులు




మణుగూరు, జూన్ 18 (భారతశక్తి): 80 కేజీల నిషేధిత గంజాయిని పోలీసులు పట్టుకున్నట్లు డిఎస్పీ రవీందర్ రెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. డిఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం మణుగూరు పోలీసులు తోగ్గూడెం సమ్మక్క-సారక్క దేవాలయం సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తున్నామన్నారు. భద్రాచలం నుండి మణుగూరు వైపుకు వస్తున్న ఫార్చూనర్ కారులో కొందరు వ్యక్తులు గంజాయిని తరలిస్తున్నారని నమ్మదగిన సమాచారం మేరకు సమ్మక్క-సారలమ్మ గుడి వద్ద ఉదయం సుమారు 11:30 గంటల సమయంలో 1) సురేంద్ర సింగ్ తండ్రి ఖంచంద్, హోసన్న గ్రామం, గుడి గూర్చి మండలం, 2) ధర్మేంద్ర కుమార్ తండ్రి రామచందర్ గ్రామం, నీముకి దామి బామ్లాస్, జూన్ జూన్ జిల్లా, రాజస్థాన్ కు చెందిన అను వారిద్దరూ వాళ్ళ స్నేహితుడు అయినా కపిల్ దేవ్ గంజాయి వ్యాపారం చేస్తాడని తెలిపారు. వీరికి రూ.50 వేలు ఇస్తానని చెప్పి వీరిద్దరిని ఒరిస్సా కలిమెళ్ళకు రమ్మనట్టు చెప్పారన్నారు. వీరిద్దరూ బుధవారం రాత్రి 10 గంటలకు కలిమెళ్ళకి వెళ్ళి ఫార్చునర్ ఆర్.జె 3 యుఏ 4386 నెంబర్ గల కారు డిక్కీ లో గంజాయి ప్యాకెట్లను పెట్టి భద్రాచలం మీదుగా మణుగూరు వైపు వస్తుండగా మణుగూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కార్లో ఉన్న 80 కేజీల గంజాయి విలువ సుమారు రూ. 40లక్షలు, ఫార్చునర్ కారు స్వాధీనం చేసుకొన్నామన్నారు. గంజాయిని తరలిస్తున్న సురేందర సింగ్, ధర్మేంద్ర కుమార్, కపిల్ దేవ్ లపై కేసు నమోదు చేశామన్నారు. నిషేధిత గంజాయిని పట్టుకున్న మణుగూరు పోలీస్ స్టేషన్ సిబ్బందిని డిఎస్పీ అభినందించినారు.

# నిఘా నీడలో ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామం.

**-డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అందరి సహకారం అవసరం.**

**-రోడ్డు భద్రతా నియమాలు పాటించి సురక్షిత ప్రయాణం చేయాలి: జిల్లా ఎస్పీ.**

భారత శక్తి న్యూస్,రాజన్న సిరిసిల్ల, జూన్ 18: ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామంలో "నేను సైతం"కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన 11 సీసీ కెమెరాల ప్రారంభోత్సవనికి జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా గ్రామ ప్రజలతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ప్రజలకు సీసీ కెమెరాల ప్రాముఖ్యత, డ్రగ్స్,గంజాయి వంటి మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు,రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి ప్రజలతో కలిసి ప్రతిజ్ఞ చేశారు.

### ఈసందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ

"నేను సైతం" కార్యక్రమంలో భాగంగా ప్రజల సహకారంతో జిల్లాలో కొత్త సీసీ కెమెరాల ఏర్పాటు కొనసాగుతోందని తెలిపారు. ప్రజలు, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు.నేరాల నియంత్రణ, నిందితుల గుర్తింపు, శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, ఆధునిక సాంకేతికతతో నేరాలను అరికట్టి నిందితులపై త్వరితగతిన చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

### డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ కృషి.

జిల్లాలో డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు చేపడుతూ, యువతను మత్తు పదార్థాల దుష్ప్రభావాల నుంచి రక్షించి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణమే జిల్లా పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. డ్రగ్స్ రహిత జిల్లాగా రాజన్న సిరిసిల్లను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ లేదా గంజాయి విక్రయాలు, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

### రోడ్డు భద్రతా నియమాలు పాటించి సురక్షిత ప్రయాణం చేయాలి.

ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని ప్రజలకు సూచించారు.అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా రోడ్డు




భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిచమన్నారు. కోరుట్లపేట గ్రామంలో ఒక రోడ్డు ప్రమాదం జరగకపోవడం కోరుట్లపేట గ్రామ ప్రజల అవగాహనకు నిదర్శనంగా నిలిచిందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, పరిమితి కి మించిన వేగంతో వాహనాలు నడపవద్దని ,రాంగ్ రూట్‌లో ప్రయాణించవద్దన్నారు.

ఈ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ వెంకటేష్, ఎస్.ఐ రాహుల్ రెడ్డి, గ్రామ సర్పంచ్ జ్యోతి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో బీసీ సంఘాలు భాగస్వాములు కావాలి: పొలాస నరేందర్



భారత శక్తి న్యూస్,రాజన్న సిరిసిల్ల, జూన్ 18: తెలంగాణ రాష్ట్రంలో జూన్ 25 నుండి జూలై 24 వరకు జరగనున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ - స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో బీసీ సంఘాలు క్రియాశీలకంగా పాల్గొని పారదర్శకతకై కృషి చేయాలని బీసీ సాధికారిత సంఘం ఉత్తర తెలంగాణ జిల్లాల ఇంచార్జ్ పొలాస నరేందర్ పిలుపునిచ్చారు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో జరుగుతున్న జనాభా లెక్కల ప్రక్రియ సిబ్బందితోనే, బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఈ "సర్" ప్రక్రియను సమాంతరంగా నిర్వహించేలా కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ఖరారు చేసిందని ఆయన గుర్తుచేశారు. ఈ ప్రక్రియలో అర్హులైన ఓటర్లకు భరోసా కల్పిస్తూ, కేవలం అర్హత గల వారి పేర్లను మాత్రమే జాబితాలో ఉంచేలా మరియు అనర్హుల పేర్లను తొలగించేలా క్షేత్రస్థాయిలో నిరంతరం క్షుణ్ణంగా పరిశీలించాలని ఆయన కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైనదని, కీలకమైన వజ్రాయుధం లాంటిదని పేర్కొన్న పొలాస నరేందర్.. అర్హులైన ఏ ఒక్కరి పేరు కూడా జాబితా నుండి తొలగిపోకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. "సర్" ప్రక్రియ పూర్తి పారదర్శకత కోసం ప్రభుత్వ పరంగా బూత్ లెవెల్ అధికారులతో పాటు, అన్ని రాజకీయ పార్టీల తరఫున బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలని ఎన్నికల సంఘం కోరిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఎలాంటి పొరపాట్లు, అవకతవకలు జరగకుండా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఉత్తర తెలంగాణ జిల్లాల బీసీ సాధికారిత సంఘాల నేతలు, సభ్యులు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. మన ప్రజాస్వామ్య దేశంలో ప్రజలు ఓటు హక్కు ద్వారానే ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకుంటున్నారని, నేటి యువతరానికి ఓటు విలువను తెలియజేస్తూ, అర్హత గల ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు లభించేలా బీసీ సంఘాలు శ్రమించాలని నరేందర్ పిలుపునిచ్చారు.

## వన మహోత్సవాన్ని జయప్రదం చేద్దాం

**- పచ్చని తెలంగాణను నిర్మిద్దాం: కలెక్టర్ కుమార్ దీపక్**




మంచిర్యాల ప్రతినిధి, జూన్ 18(భారత శక్తి): వన మహోత్సవాన్ని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని భీమారం మండలంలోని అటవీ ప్రాంతంలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, డి.సి.పి. ఎ. భాస్కర్, జైపూర్ ఎ.సి.పి. వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, తహసిల్దార్ సదానందం, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మధుసూదన్, అటవీ డివిజనల్ అధికారి సర్వేశ్వర్, సర్పంచ్ విజయలక్ష్మి లతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని తెలిపారు. శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో కృషి చేసి మొక్కలు నాటి సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు. 2026 వనమహోత్సవంలో జిల్లాకు కేటాయించిన 41 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో సాధించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా నర్సరీలలోని మొక్కల వివరాలను, ప్లాంటేషన్ చేసే సైట్ల రిజిస్ట్రేషన్, సంబంధిత వివరాలను కేటాయించబడిన ఆన్లైన్ పోర్టల్ లో నమోదు చేయాలని తెలిపారు. మొక్కలు నాటిన తర్వాత జియో ట్యాగింగ్ పూర్తి చేసి, రోజువారీగా వివరాలను నవీకరించాలని తెలిపారు. రహదారులకు ఇరుప్రక్కల పెద్ద చెట్లు నాటాలని, నాటిన ప్రతి ఒక్క మొక్క ఎదిగేలా సంరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల ఆవరణలో పూలు, పండ్ల మొక్కలు నాటాలని, జిల్లాలో గనులు దృష్ట్యా ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయని, ఖాళీ ప్రదేశాలలో మొక్కలు నాటడం ద్వారా ఉష్ణోగ్రతలు అదుపులో ఉంటాయని తెలిపారు.

## మహిళలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా నిర్భయంగా ఫిర్యాదు చేయాలి.

**మహిళ భద్రతపై పని ప్రదేశాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు : జిల్లా షీ టీమ్**




భారత శక్తి న్యూస్,రాజన్న సిరిసిల్ల, జూన్ 18: జిల్లాలో మహిళల భద్రతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో మహిళలు పని చేసే ప్రదేశాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో మహిళలపై జరిగే లైంగిక వేధింపుల నివారణ, పని ప్రదేశాల్లో భద్రతా చర్యలు, మహిళలకు సంబంధించిన చట్టాలు మరియు వారి హక్కులపై సమగ్ర అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం గంబిరావుపేట మండలంలోని ముచ్చెర్ల, లింగన్నపేట గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు హాజరయ్యే మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.మహిళలు ఎలాంటి వేధింపులకు గురైనా నిర్భయంగా జిల్లా షీ టీమ్ హెల్ప్‌లైన్ నంబర్ 87126 56425కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు అందిన వెంటనే నిందితులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని, ఫిర్యాదుదారుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని షీ టీమ్ అధికారులు తెలిపారు. అలాగే సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో సంభాషణలు చేయకుండా జాగ్రత్త వహించాలని, వ్యక్తిగత సమాచారం, ఫొటోలు లేదా ఇతర వివరాలను గుర్తు తెలియని వ్యక్తులతో పంచుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఏఎస్ఐలు ప్రమీల, రవి, సిబ్బంది శ్రీనివాస్, ప్రియాంక, శ్రీలత పాల్గొన్నారు.

## రామన్నపేటలో ప్రభుత్వ భూముల కబ్జాపై విచారణ జరపాలి.

**కాంగ్రెస్ లీగల్ సెల్ కన్వీనర్ బిగుల్ల బాబు డిమాండ్.**



భారత శక్తి న్యూస్,రాజన్న సిరిసిల్ల, జూన్ 18: కోనరావుపేట మండలం రామన్నపేట గ్రామంలో ప్రభుత్వ భూముల అక్రమ కబ్జాలపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, సమగ్ర విచారణ జరపాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ కన్వీనర్ బిగుల్ల బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం కోనరావుపేట మండల తాసిల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. గ్రామంలోని సర్వే నంబర్ 12లో ఉన్న ప్రభుత్వ గుట్ట భూమి, స్థానిక వరి కొనుగోలు కేంద్రానికి సమీపంలో ఉందన్నారు. గతంలో వార్డు మెంబర్, ఉపసర్పంచ్‌గా పనిచేసిన కొలనూరి మహిపాల్ రెడ్డి (తండ్రి కిష్టారెడ్డి) ఆ భూమిని అక్రమంగా కబ్జా చేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కబ్జా కారణంగా వరి కొనుగోలు కేంద్రం అభివృద్ధి పనులకు తీవ్ర ఆటంకం కలుగుతోందని, దీనివల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా గ్రామ శివారులోని మల్లారెడ్డి కుంట కట్ట కింద భాగంలో గల సర్వే నంబర్ 122లో 14 గుంటల భూమిని అక్రమంగా పట్టా చేయించుకోవడమే కాకుండా, దానికి ఆనుకుని ఉన్న మరికొంత ప్రభుత్వ భూమిని కూడా ఆక్రమించినట్లు ఆరోపణలు ఉన్నాయని వివరించారు. రెవెన్యూ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, అక్రమంగా పొందిన పట్టాలను రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పోలీసుల ఉక్కుపాదం.. 69 మందికి రూ.1.77 లక్షల జరిమానా.



భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 18: సిరిసిల్ల పట్టణ పోలీసుల డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 69 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు.వారిని బుధవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి మొత్తం రూ. 1,77,000 జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా తప్పదని పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ హెచ్చరించారు.హెల్మెట్ ధరించి, ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించాలని సూచించారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన జిల్లా కలెక్టర్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 18: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన గృహాల నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం గర్గుల్ గ్రామంలో భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా పూరి గుడిసెల్లో నివసిస్తున్న లబ్ధిదారులు శ్రీమతి రావుల పెద్ద ఎల్లమ్మ, శ్రీ భిక్షపతి, శ్రీమతి దానబోయిన జ్యోతికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు కలెక్టర్ శంకుస్థాపన చేశారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడి ప్రభుత్వం కల్పిస్తున్న గృహ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకొని నాణ్యతతో ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి లబ్ధిదారులు త్వరగా గృహ ప్రవేశం చేసుకునేలా అధికారులు అవసరమైన సహకారం అందించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ, తమకు జిల్లాలో మొదటిసారిగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా పూరి గుడిసెల్లో నివసిస్తున్న తమకు సొంత ఇంటి కల నెరవేరిందని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వానికి , జిల్లా పరిపాలనకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో హిమబిందు, డీఎల్ పీఓ శ్రీనివాస్, సర్పంచ్ దివ్య, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ప్రభుత్వ ప్లీడర్ బొట్ల సుధాకర్



రేగొండ, జూన్ 18 (భారత శక్తి): మృతుని కుటుంబాన్ని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టు ప్రభుత్వ ప్లీడర్ బొట్ల సుధాకర్ గురువారం పరామర్శించారు. మండలంలోని బీమ్ నగర్ తండా కు చెందిన బానోతు రామ్ దాన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని బొట్ల సుధాకర్ పరామర్శించి ఓదార్చారు. మృతుని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన వెంట అడ్వకేట్ దుప్పేటి ప్రవీణ్, గ్రామ సర్పంచ్ గుగులోతు ప్రవళిక వీరు నాయక్, గ్రామస్తులు బానోతు రవీందర్, బద్రి నాయక్, రోంటాల వెంకటస్వామి, అల్లే నాగరాజు, దుప్పటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్




కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 18: గురువారం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాల అమలు స్థితిని కలెక్టర్ ఆరా తీశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో చేపడుతున్న మరమ్మతు పనులు, స్వయం సహాయక సంఘాల (ఎస్ ఎచ్ జి) ఫెడరేషన్ భవనాల నిర్మాణం, పాఠశాల మరుగుదొడ్ల నిర్వహణ, ఆహార ధాన్యాల నిల్వ గిడ్డంగి భవనాల నిర్మాణ పురోగతి, అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ పనులపై శాఖల వారీగా సమీక్షించారు.అలాగే జిల్లా ఖనిజ ఫౌండేషన్ ట్రస్ట్ (డీ ఎమ్ ఎఫ్ టీ), ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్ డీఎఫ్), కమ్యూనిటీ బెనిఫిట్ ఫండ్ (సీబిఎఫ్) కింద చేపడుతున్న పనుల పురోగతిని పరిశీలించి, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్ సిఎస్), ఉప ఆరోగ్య కేంద్రాల భవనాల నిర్మాణం , మరమ్మతు పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ, పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు కృషి చేయాలని సూచించారుపనులలో నిర్లక్ష్యం వహించిన వారి పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో ఏసిఎల్ బీ, డీపిఓ, డీఆర్డీఓ, డీఈఓ, సీపిఓ, డీడబ్ల్యూఓ, డీఐఈఓ, డీఎమ్ఎచ్ఓ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ విద్యార్థులు స్కాలర్‌షిప్‌ల రెన్యువల్ చేసుకోవాలి



నిర్మల్, జిల్లా ప్రతినిధి, జూన్ 18:(భారత శక్తి ) జిల్లాలోని బీసీ విద్యార్థులు ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల రెన్యువల్ ప్రక్రియను వెంటనే పూర్తి చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి డి. శ్రీనివాస్ సూచించారు. రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఉపకార వేతనాల రెన్యువల్ ప్రక్రియ ప్రారంభమైనట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు విద్యాసంస్థల్లో పదో తరగతి చదువుతున్న అర్హులైన బీసీ విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు పూర్తిచేసిన అనంతరం సంబంధిత పత్రాల జిరాక్స్ ప్రతులను జిల్లా బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు.దరఖాస్తు కోసం బీసీ కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, నివాస ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కు అనుసంధానమైన బ్యాంకు ఖాతా వివరాలు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన పూర్తి వివరాల కోసం జిల్లా బీసీ సంక్షేమ శాఖ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, సందేహాల నివృత్తి కోసం 9849290043 నంబరుకు ఫోన్ చేయవచ్చని డి. శ్రీనివాస్ తెలిపారు. అర్హులైన బీసీ విద్యార్థులు ఆలస్యం చేయకుండా ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల రెన్యువల్ దరఖాస్తులు పూర్తి చేయాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖ విజ్ఞప్తి చేశారు.

## భవిత భవనం ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు




మణుగూరు, జూన్ 18 (భారతశక్తి): మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో రూ.3 లక్షల వ్యయంతో పునర్నిర్మించిన భవిత భవనంను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గురువారం అట్టహాసంగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు, వారి కుటుంబాలకు మెరుగైన సేవలు అందించేందుకు భవిత కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు అవసరమైన సౌకర్యాలను మరింత మెరుగుపరచేందుకు కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. భవిత భవనం పునర్నిర్మాణం ద్వారా సేవల నాణ్యత పెరగడంతో పాటు లబ్ధిదారులకు మరింత అనుకూల వాతావరణం కల్పించబడుతుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఉప సర్పంచులు, తహసీల్దార్ అద్దంకి నరేష్, ఎంపిడిఓ వెంకటేశ్వరరావు, ఎంఈఓ స్వర్ణజ్యోతి, ఐఈఆర్ పి నాగశ్రీ, వీరు నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, పట్టణ అధ్యక్షులు శివసైదులు, వార్డు సభ్యులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యా సంస్థలలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల ప్రతినిధి, జూన్ 18 (భారత శక్తి): ప్రభుత్వ విద్యా సంస్థలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని కాసిపేట మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి భోజనశాల, అదనప తరగతి గదుల నిర్మాణ పనులు, వంటశాల, స్టోర్ రూమ్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలో త్రాగునీరు, విద్యుత్, విద్యార్థినీ విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు, ప్రహరీ గోడ, అదనపు గదులతో పాటు సకల సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో ప్రభుత్వ విద్యాసంస్థలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పోషకాలతో కూడిన నాణ్యమైన ఆహారం అందించాలని, ఆహారం తయారీలో శుభ్రత నిబంధనలు పాటించాలని, నిత్యవసర సామాగ్రిని క్రమ పద్ధతిలో నిలువ చేయాలని తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ-ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి అదనపు తరగతి గదుల పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న మరమ్మత్తు పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.బెల్లంపల్లి మండల కేంద్రంలో కొనసాగుతున్న అమృత్ 2.0 నీటి ట్యాంకులు, పైప్ లైన్ నిర్మాణ పనులను బెల్లంపల్లి మండల తహసిల్దార్ కృష్ణ, మున్సిపల్ కమిషనర్ రమేష్, చైర్ పర్సన్ దావ స్వాతి ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రజలకు నిరంతరం త్రాగునీటిని అందించేందుకు చేపట్టిన అమృత 2.0 పథకంలో పనులను వేగవంతం చేయాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలో పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని, ప్రతిరోజు ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తలను సేకరించాలని తెలిపారు. ఈ క్రమంలో మున్సిపల్ పరిధిలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు కొరకు స్థల పరిశీలన చేశారు. అనంతరం రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నిరుపేదల కొరకు చేపట్టిన రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# వరద ప్రభావిత, ముంపు ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్

**- నక్ష సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలన,**

**- నిర్ణీత గడువులో సర్వే, నమోదు ప్రక్రియలు పూర్తి చేయాలని ఆదేశం.**



భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 18 (భారతశక్తి) : భూముల రీ-సర్వే, పట్టణ భూముల హద్దుల గుర్తింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నక్ష సర్వే కార్యక్రమంలో భాగంగా మణుగూరు మున్సిపాలిటీలో కొనసాగుతున్న ఆర్.ఓ.ఆర్. (రికార్డ్ ఆఫ్ రైట్స్) నమోదు ప్రక్రియను జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం వర్షాకాల సన్నద్ధతలో భాగంగా గోదావరి వరదల ప్రభావానికి గురయ్యే ప్రాంతాలు, ముంపు ప్రాంతాలను సందర్శించి పరిస్థితులను సమీక్షించారు. మణుగూరు మండలం కొమ్ముగూడెం గ్రామంలో మున్సిపల్ సిబ్బంది నిర్వహిస్తున్న ఆర్.ఓ.ఆర్. నమోదు ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, ప్రతి ఎంట్రీ నమోదు చేయడానికి పడుతున్న సమయం, నమోదు చేస్తున్న వివరాల స్వరూపం, ప్రజల నుంచి సేకరిస్తున్న సమాచారంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూములకు సంబంధించిన వివరాలను అత్యంత ఖచ్చితత్వంతో నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. నక్ష సర్వే పైలట్ ప్రాజెక్టు ద్వారా భూ రికార్డుల సమగ్రత, పారదర్శకత పెరగడంతో పాటు ప్రజలకు భూములకు సంబంధించిన సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. సర్వే, నమోదు ప్రక్రియలను నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి మణుగూరు మండలం అన్నారం, కమలాపురం గ్రామాల్లో గోదావరి వరదల ప్రభావానికి గురయ్యే కోడిపుంజుల వాగు బ్రిడ్జి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. గోదావరి నీటిమట్టం పెరిగిన సమయంలో కోడిపుంజుల వాగు ద్వారా ఎదురు నీరు ప్రవహించడం వల్ల ఏర్పడే ముంపు పరిస్థితులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరదల సమయంలో చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, ప్రజల తరలింపు ఏర్పాట్లు, పునరావాస కేంద్రాల ఏర్పాటు, త్రాగునీరు, విద్యుత్, వైద్య సేవలు, ఇతర అత్యవసర సదుపాయాల కల్పనపై అధికారులని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మణుగూరు సింగరేణి పి కే ఓ సి ఓపెన్ కాస్ట్ గనుల ప్రాంతం నుంచి విడుదలయ్యే నీటి ప్రభావంతో ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. గాంధీనగర్‌లోని ఓపెన్ కాస్ట్ గనుల నుండి నీరు విడుదల చేసే ప్రదేశం నుంచి సుందరయ్య నగర్, కాళీమాత ఆలయ పరిసర ప్రాంతాలు, వినాయకనగర్ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ పనితీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. డ్రైనేజీల్లో పూడిక, చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని, వర్షపు నీరు వేగంగా వెళ్లే విధంగా కాలువలను సిద్ధం చేయాలని ఆదేశించారు. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వరదల ప్రభావం అధికంగా ఉండే ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన చర్యలు సిద్ధంగా ఉంచాలని, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వాతావరణ హెచ్చరికలు, నీటిమట్టాల వివరాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తూ అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటన లో కలెక్టర్ వెంట మణుగూరు మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, తహసీల్దార్ అద్దంకి నరేష్, ఎంపీడీవో పల్నాటి వెంకటేశ్వరరావు, మున్సిపల్ శాఖ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆగిన ప్రాణం.. ఆగని పింఛన్!

**మృతుల ఖాతాల్లోనూ కొనసాగుతున్న చేయూత జమలు**

**ముఖ గుర్తింపు సర్వేతో బయటపడిన వేలాది అక్రమాలు**






ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, జూన్ 18 (భారత శక్తి): రాష్ట్ర ప్రభుత్వం పేద, వృద్ధ, వితంతు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, దివ్యాంగులకు అందిస్తున్న సామాజిక భద్రతా పింఛన్లలో భారీ అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో చేపట్టిన లైవ్ ఫేస్ అథెంటికేషన్ (ముఖ గుర్తింపు) సర్వేలో చనిపోయిన వారి పేర్లపై కూడా పింఛన్ సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్న విషయం బయటపడింది.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని మున్సిపాలిటీల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ధ్రువీకరణ ప్రక్రియలో ఇప్పటివరకు 1,761 మంది మృతి చెందిన లబ్ధిదారుల పేర్లపై పింఛన్లు కొనసాగుతున్నట్లు అధికారులు గుర్తించారు. లబ్ధిదారుల మరణ వివరాలు అధికారికంగా నమోదు కాకపోవడంతో వారి ఖాతాల్లో ప్రతి నెలా పింఛన్ జమవుతుండగా, కొన్నిచోట్ల కుటుంబ సభ్యులే ఆ డబ్బులను వినియోగిస్తున్నట్లు సమాచారం.

### మరణం నమోదైతేనే నిలిచే పింఛన్

గ్రామీణ ప్రాంతాల్లో పింఛన్లను బయోమెట్రిక్ ధ్రువీకరణ ద్వారా పంపిణీ చేస్తున్నప్పటికీ, పట్టణ ప్రాంతాల్లో నేరుగా బ్యాంకు ఖాతాల్లోనే జమ చేస్తున్నారు. దీంతో లబ్ధిదారుడు మరణించినా సంబంధిత కుటుంబ సభ్యులు మున్సిపాలిటీలో మరణ ధ్రువీకరణ నమోదు చేయనంత వరకు పింఛన్ నిలిపివేయడం జరగడం లేదు. ఈ పరిస్థితి కారణంగానే పెద్ద సంఖ్యలో మృతుల ఖాతాల్లోనూ పింఛన్ కొనసాగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

### సర్వేతో బయటపడిన వాస్తవాలు

గత నెల 15 నుంచి మున్సిపాలిటీల్లో చేపట్టిన ముఖ గుర్తింపు సర్వేలో పలు అవకతవకలు బయటపడ్డాయి. కొందరు లబ్ధిదారుల ఆధార్ వివరాలు సరిపోకపోవడం, మరికొందరి వేలిముద్రలు, ముఖ గుర్తింపు నమోదు కాకపోవడం, తప్పుడు ఆధార్ నంబర్లు ఉండటం వంటి అంశాలు గుర్తించారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి సంఖ్య కూడా గణనీయంగా ఉంది.

మంచిర్యాల జిల్లాలోనే అత్యధికంగా 2,040 మంది లబ్ధిదారులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు అధికారులు గుర్తించారు. మృతి చెందినవారు, అనర్హులు, ధ్రువీకరణలో విఫలమైన వారిని జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు చేపట్టారు.

ఈ నెల 22 వరకు గడువు

ఈ నెల 22వ తేదీలోగా ముఖ గుర్తింపు ధ్రువీకరణ పూర్తి చేసుకున్న లబ్ధిదారులకే పింఛన్ జమ కానుంది. ధ్రువీకరణ పూర్తిచేయని వారి పింఛన్లు వచ్చే నెల నుంచి నిలిచిపోయే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

### జిల్లాల వారీగా ధ్రువీకరణ వివరాలు

ఆదిలాబాద్ మున్సిపాలిటీ
మొత్తం లబ్ధిదారులు : 14,133
విజయవంతమైన ధ్రువీకరణలు : 10,521
విఫలమైనవి : 119
మృతి చెందినవారు : 47
ధ్రువీకరణ పెండింగ్ : 3,446

కుమురం భీం జిల్లా (2 మున్సిపాలిటీలు)
మొత్తం లబ్ధిదారులు : 7,998
విజయవంతమైన ధ్రువీకరణలు : 5,050
విఫలమైనవి : 90
మృతి చెందినవారు : 7
పెండింగ్ : 2,851

నిర్మల్ జిల్లా (3 మున్సిపాలిటీలు)
మొత్తం లబ్ధిదారులు : 21,663
విజయవంతమైన ధ్రువీకరణలు : 17,002
విఫలమైనవి : 179
మృతి చెందినవారు : 42
పెండింగ్ : 4,440

మంచిర్యాల జిల్లా (6 మున్సిపాలిటీలు)
మొత్తం లబ్ధిదారులు : 22,641
విజయవంతమైన ధ్రువీకరణలు : 18,081
విఫలమైనవి : 2,694
మృతి చెందినవారు : 1,665
పెండింగ్ : 201

"ఆగిన ప్రాణాలు... కానీ ఆగని పింఛన్లు! ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1,761 మంది మృతుల ఖాతాల్లో కొనసాగిన చేయూత జమలు ముఖ గుర్తింపు సర్వేతో వెలుగులోకి వచ్చాయి."

## బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**విద్యతోనే విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదితీ**





కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జూన్ 18: జిల్లాలోని గర్గుల్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూకేజీ తరగతిని ప్రారంభించి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.అనంతరం సంచారజాతుల పిల్లలను పాఠశాలలో చేర్పించి వారికి అక్షరాభ్యాసం నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో రెండు మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. హైస్కూల్ , ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. గర్గుల్ పాఠశాలకు చెందిన నలుగురు జాతీయ స్థాయి హాకీ క్రీడాకారులు, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న 12 మంది క్రీడాకారులను జిల్లా కలెక్టర్ సన్మానించి అభినందించారు. క్రీడల్లో ప్రతిభ కనబరుస్తూనే విద్యలో కూడా రాణించాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ సర్పంచ్ శ్రీమతి దివ్య రవితేజ గౌడ్ గ్రామంలో విద్యాభివృద్ధికి ప్రత్యేక బాధ్యత తీసుకుని చదువుకు ప్రాధాన్యత ఇస్తుండటం అభినందనీయమని అన్నారు. విద్యార్థుల ప్రగతి కోసం గ్రామస్తులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. ప్రతి చిన్నారి విద్యను అభ్యసించేలా అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్, ఎంఈఓ ఎల్లయ్య, ఎంపీడీవో, సర్పంచ్ దివ్య రవితేజ గౌడ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు పి.డి. మధుసూదన్, సీఆర్పీ రాములు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 18(భారత శక్తి )బాసరలో జరగనున్న గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం బాసర పుష్కరాల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వచ్చే సంవత్సరంలో నిర్వహించే గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా పాత పుష్కర ఘాట్లకు అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు, అవసరమైన చోట కొత్త ఘాట్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పుష్కర ఘాట్లను భక్తులకు కనువిందుగా ఉండేలా సుందరీకరించాలని, కళ్యాణ కట్ట, పిండ ప్రదాన వేదికలు, దుస్తులు మార్చుకునే గదులను తక్షణమే నిర్మించాలని సూచించారు. చేపట్టే ప్రతి నిర్మాణ పనిలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ఘాట్ల సమీపంలో భక్తులకు తాగునీటి కొరత లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.అలాగే, ఆయా శాఖల అధికారులు తమకు కేటాయించిన పనులకు సంబంధించిన పూర్తి స్థాయి ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. ఈ సందర్భంగా బాసర ఆలయ మాస్టర్ ప్లాన్‌పై కూడా చర్చించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, బాసర ఆలయ ఈవో అంజనా దేవి, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ సందీప్, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భారీగా కల్తీ పన్నీర్ పట్టివేత

**హైదరాబాద్** హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ హెచ్ ఫాస్ట్ పోలీసులు ఆకస్మిక దాడులు జరిపారు. మార్కెట్లో కల్తీ పనీర్ తయారు చేస్తున్న యూనిట్ పై దాడులు జరిపారు. టాస్క్ ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ మాట్లాడుతూ ఇప్పటికే వ్యాపారస్తులకు యూనిట్ నిర్వహకులకు హెచ్చరిక జారీ చేసాం. చీజ్ అనలాగ్ను పనీర్గా విక్రయిస్తున్నట్లు గుర్తించావ. ఇది వినియోగదారులను మోసం చేసే చర్య. ధిక డబ్బుకు ఆశపడి కల్తీ పన్నీరు మార్కెట్లో చాలామంది చేస్తున్నారు వ్యాపారాలు. చీజ్ అనలాగ్లో పాలేతర కొవ్వులు, కూరగాయల కొవ్వులు మిక్స్ చేసి తయారు చేస్తున్నారు. "మలై పనీర్", "మిల్క్ పనీర్" పేర్లతో కూడా అమ్ముతున్నారు. కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్ నుండి సరఫరా జరుగుతోంది. "లో ఫ్యాట్ పనీర్" వంటి తప్పుదారి పట్టించే లేబుళ్లు ఉపయోగిస్తున్నారు. కొన్ని ఉత్పత్తులపై తయారీ వివరాలు లేవు. బ్యాచ్ నంబర్లు లేకుండా విక్రయిస్తున్నట్లు తెలిసింది గడువు తేదీలు లేకుండా కూడా అమ్మకాలు జరుగుతున్నాయి. పనీర్ ఆర్డర్ చేస్తే చీజ్ అనలాగ్ సరఫరా చేస్తున్న కేసులు ఉన్నాయని అన్నారు. తయారీదారులు ఉత్పత్తిని "చీజ్ అనలాగ్"గా ప్రకటిస్తున్నారు. రిటైల్ స్థాయిలో మాత్రం పనీర్గా విక్రయిస్తున్నారు. అధిక లాభాల కోసం తప్పుడు బ్రాండింగ్ చేస్తున్నారు. కొన్ని తయారీదారులకు చెల్లుబాటు అయ్యే ఈూాంఎ లైసెన్స్ లేదు. కొన్ని దుకాణాలు లైసెన్స్ లేకుండానే వ్యాపారం చేస్తున్నాయి. చీజ్ అనలాగ్ను "ప్రీమియం పనీర్" పేరుతో రీప్యాక్ చేస్తున్నారు. ఉత్పత్తుల ట్రేసబిలిటీ లేకపోవడం గుర్తించారు. పిండిపదార్థాలు కలిపిన కల్తీ పనీర్ సైతం వెలుగులోకి వచ్చాయి. అధిక నీరు కలిపి నాణ్యతను తగ్గిస్తున్నారు. పాలేతర కొవ్వులు ఉపయోగిస్తున్నట్లు తనిఖీల్లో తేలింది. నాణ్యతలేని కృత్రిమ పాలు ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. అపరిశుభ్రమైన నిల్వ పద్ధతులు బయటపడ్డాయి. దాడుల్లో 45 అవుట్లెట్లు, 8 తయారీ యూనిట్లు తనిఖీ చేశామన్నారు.సుమారు 825 కిలోల కల్తీ తప్పుడు బ్రాండింగ్ ఉత్పత్తులు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. లైసెన్స్ ఉన్న విక్రేతల నుంచే పనీర్ కొనాలి, లేబుల్ మరియు గడువు తేదీ తప్పనిసరిగా తనిఖీ చేయాలి, లేబుల్ లేని ఉత్పత్తులను నివారించాలని అన్నారు.

## బీసీ సంఘాల సెక్రటేరియట్ ముట్టడి..ఉద్రిక్తత

**హైదరాబాద్** తెలంగాణ రాష్ట్ర సచివాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఫీజు రియంబర్స్మెంట్ కోసం సచివాలయం బీసీ సంఘాలు ముట్టడించాయి. నాలుగు దఫాలుగా సచివాలయం ముట్టడికి ప్రయత్నించారు బీసీ నేతలు . పోలీసులు ముట్టడిని అడ్డుకొని బీసీ సంఘాల నేతలను అరెస్టు చేసారు. అరెస్ట్ చేసిన బీసీ నేతలను వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. పాత పద్ధతిలోనే ఫీజు రియంబర్స్మెంట్ అమలు చేయాలి. ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తివేయాలని కుట్ర చేస్తుంది. గత నాలుగు ఏళ్లుగా ఫీజుల బకాయిలు ఇవ్వకుండా ప్రభుత్వం బీసీ విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తుందని వారు ఆరోపించారు.
తక్షణమే ఫీజుల బకాయిలు విడుదల చేయకపోతే సీఎం, మంత్రుల పర్యటనలను అడ్డుకుంటాం . సచివాలయం ముట్టడిలో మీడియాతో బీసీ నేతలు కుల్కచర్ల శ్రీనివాస్, విక్రమ్ గౌడ్, కనకల శ్యామ్ ల వెల్లడించారు.

## సాయికృష్ణ ఘటనకు జనసేన కు సంబంధం లేదు

**విజయవాడ** కృష్ణలంకకు చెందిన గాదే సాయికృష్ణ విషయములో జరిగిన సంఘటనకు జనసేన పార్టీకి ఎటువంటి సంబంధమూ లేదని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి విజయవాడ తూర్పు నియోజకవర్గం మరియు విజయవాడ పార్లమెంట్ సమన్వయకర్త అమ్మిశెట్టి వాసు స్పష్టం చేసారు. ఈ విషయంపై వైఎస్ఆర్సిపి కావాలనే రాజకీయం చేస్తుంది. రాష్ట్రంలో ఏది జరిగిన అది పవన్ కళ్యాణ్ గారికి మరియు జనసేన పార్టీకి ఆపాదించి మాట్లాడటం మరియు కులం పేరుతో నీచ రాజకీయాలు చేయడం వైసిపి మానుకోవాలి.

## పిల్లాడ్ని సర్కార్ స్కూల్‌లో చేర్పించిన కలెక్టర్

**విజయనగరం,** లక్షలాది రూపాయల ఫీజులు చెల్లించి పిల్లలను కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలో చదివించేందుకు తల్లిదండ్రులు తహతహలాడుతున్న రోజులివి. చివరికి ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు సైతం తమ పిల్లలను ప్రైవేట్ విద్యాసంస్థలకే పంపుతున్న తరుణంలో.. ఒక జిల్లా అత్యున్నత అధికారే ఆదర్శంగా నిలిచి అందరినీ ఆశ్చర్యపరిచారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకరరెడ్డి తన కుమారుడు క్రిష్ ధరణ్‌రెడ్డిని స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి, ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ఉన్న నమ్మకాన్ని చేతల్లో నిరూపించారు.కలెక్టర్ ప్రభాకరరెడ్డికి ఇది కొత్తేమీ కాదు. గతంలో ఆయన ఎక్కడ పనిచేసినా తన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించారు.

గతంలో నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఉన్నప్పుడు, ఆ తర్వాత విజయవాడలో శాప్ ఎండీగా పనిచేసిన కాలంలోనూ ఆయన ఇద్దరు పిల్లలను విజయవాడ పటమటలోని జెడ్పీ హైస్కూల్‌లోనే చదివించారు. అక్కడ క్రిష్ ధరణ్‌రెడ్డి తొమ్మిదో తరగతి పూర్తి చేయగా, ప్రస్తుతం ప్రభాకరరెడ్డి పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌గా బదిలీ కావడంతో.. కుమారుడిని పార్వతీపురంలోని ప్రతిష్ఠాత్మక 'డాక్టర్ దిండిగల్ వెంకట్రావు మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్'లో పదో తరగతిలో చేర్పించారు. సాధారణ ప్రైవేట్ స్కూల్ విద్యార్థిలాగే క్యూలైన్‌లో నిలబడి అడ్మిషన్ ప్రక్రియ పూర్తి చేశారు. ఈ ఏడాది విడుదలైన ఆంధ్రప్రదేశ్ పదో తరగతి ఫలితాలు ప్రభుత్వ పాఠశాలల సత్తాను చాటాయి. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలకు గట్టి పోటీ ఇస్తూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 590 కి పైగా మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. మరీ ముఖ్యంగా, కలెక్టర్ ప్రభాకరరెడ్డి నేతృత్వంలోని పార్వతీపురం మన్యం జిల్లా 96.07 శాతం ఉత్తీర్ణతతో వరుసగా నాలుగో ఏడాది కూడా రాష్ట్రంలోనే నెం.1 స్థానాన్ని కైవసం చేసుకుంది. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యాబోధన అందుతుందనడానికి ఈ రికార్డు స్థాయి ఫలితాలే నిదర్శనం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా కలెక్టర్ సదస్సులో ప్రభాకరరెడ్డి విద్యా విధానాలను, ఆయన ప్రవేశపెట్టిన ముస్తాబు విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత, క్రమశిక్షణ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

### రెట్టింపైన ఉపాధ్యాయుల బాధ్యత

ఒక జిల్లా మెజిస్ట్రేట్ కుమారుడు తమ పాఠశాలలో చేరడంతో స్కూల్ సిబ్బంది, తోటి విద్యార్థుల తల్లిదండ్రులలో ఒక కొత్త ఉత్సాహం, నమ్మకం నెలకొన్నాయి. కలెక్టర్ కుమారుడు తమ స్కూల్‌లో చేరడం వల్ల విద్యార్థులకు మరింత మెరుగైన వసతులు, పర్యవేక్షణ లభిస్తాయని, బోధనలో తమ బాధ్యత కూడా మరింత పెరిగిందని ప్రధానోపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. గతంలో ఇదే పాఠశాలలో ఐటీడీఏ పీవోగా పనిచేసిన కుర్మనాథ్ కూడా తన కుమారుడిని చదివించారు.
అధికార గర్వం ప్రదర్శించకుండా, ప్రభుత్వ బడుల బలోపేతానికి స్వయంగా కలెక్టరే ఇలాంటి నిర్ణయం తీసుకోవడం సమాజానికి ఒక గొప్ప సందేశాన్నిచ్చింది. పెద్ద పెద్ద పదవుల్లో ఉన్న అధికారులు, ప్రజాప్రతినిధులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించినప్పుడే సామాన్యులకు కూడా ఆ వ్యవస్థపై నమ్మకం పెరుగుతుంది. కార్పొరేట్ పాఠశాలల ఫీజుల భారాన్ని మోయలేక సతమతమవుతున్న మధ్యతరగతి తల్లిదండ్రులకు కలెక్టర్ ప్రభాకరరెడ్డి తీసుకున్న నిర్ణయం ఒక గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

## జూన్ 20 తర్వాత వానలు

**హైదరాబాద్,** తెలంగాణ రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ, ఎండల తీవ్రత నుంచి ప్రజలకు ఇప్పుడిప్పుడే ఉపశమనం లభించే సూచనలు కనిపించడం లేదు. జూన్ 20వ తేదీ వరకు రాష్ట్రంలోని మెజారిటీ ప్రాంతాల్లో పొడి వాతావరణమే నెలకొంటుందని, రానున్న మూడు రోజుల పాటు ఉత్తర, తూర్పు జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

భారత వాతావరణ శాఖ విడుదల చేసిన తాజా నివేదికల ఆధారంగా ఈ హెచ్చరికలు జారీ అయ్యాయి. ఆదిలాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో వడగాల్పులు నమోదయ్యాయి. ఈ క్రమంలో జూన్ 17, 18, 19 తేదీల్లో ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ ప్రకటించింది. గడిచిన 24 గంటల్లో సూర్యాపేట జిల్లా మోతేలో అత్యధికంగా 43.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, ఖమ్మం జిల్లా ఏదులాపాలెంలో 43.5 డిగ్రీలు, కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్‌లో 43.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అటు హైదరాబాద్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉంది.ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు హైదరాబాద్, భద్రాచలం మీదుగా ప్రయాణిస్తున్నాయి. రానున్న 4–5 రోజుల్లో ఇవి రాష్ట్రంలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు సానుకూల పరిస్థితులు ఉన్నాయని అధికారులు తెలిపారు. అయితే, ఉత్తర, మధ్య, తూర్పు జిల్లాల్లో రుతుపవనాలు పూర్తిస్థాయిలో విస్తరించడానికి జూన్ 20–21 వరకు సమయం పట్టవచ్చు. ఈ లోగా పలుచోట్ల సాయంత్రం లేదా రాత్రి సమయాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ సమయంలో గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. రాబోయే రెండు రోజుల పాటు ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండదని, ఆ తర్వాత 2–3 డిగ్రీల మేర తగ్గుముఖం పట్టవచ్చని అంచనా వేస్తున్నారు.

# తిరుమలలో మా ఇంటి బంగారం టీమ్

**తిరుమల,** స్టార్ హీరోయిన్ సమంత నటించిన 'మా ఇంటి బంగారం' సినిమా విడుదలకు సిద్ధమైన వేళ, చిత్ర బృందం తిరుమల శ్రీవారి ఆశీస్సులు తీసుకుంది. గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో చిత్ర యూనిట్ సభ్యులు శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు.నటి సమంత, ఆమె భర్త, చిత్ర నిర్మాత అయిన రాజ్ నిడిమోరు, దర్శకురాలు నందిని రెడ్డి, నటి-యాంకర్ శ్రీముఖి తదితరులు స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న చిత్ర బృందానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వారికి వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.నందిని రెడ్డి దర్శకత్వంలో ఫ్యామిలీ యాక్షన్ కామెడీ డ్రామాగా తెరకెక్కిన 'మా ఇంటి బంగారం' చిత్రం జూన్ 19న (శుక్రవారం) ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. సినిమా విడుదలకు ఒక్కరోజు ముందు చిత్ర విజయం కోసం స్వామివారిని ప్రార్థించినట్లు చిత్ర బృందం తెలిపింది. ఇప్పటికే ఈ సినిమా ట్రైలర్, ప్రమోషన్లకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించడంతో సినిమాపై అంచనాలు పెరిగాయి.

## రూ.750కే 15 లక్షల ప్రమాద బీమా

**రాజమండ్రి,** పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థిక భరోసా కోసం కేంద్ర ప్రభుత్వం పోస్టల్ శాఖ ద్వారా అందిస్తున్న పలు సంక్షేమ పథకాలపై బీజేపీ ఏపీ శ్రేణులు స్పెషల్ డ్రైవ్ చేపట్టాయి. ఇందులో భాగంగా ఈరోజు తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో పర్యటించిన బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్... పోస్టల్ శాఖ ద్వారా కేంద్రం ప్రవేశపెట్టిన పథకాల ప్రత్యేక నమోదు స్టాల్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ... పేద, మధ్యతరగతి వర్గాల సంక్షేమం కోసం ప్రపంచంలో మరెక్కడా లేని విధంగా ప్రధానమంత్రి మోదీ అనేక వినూత్న పథకాలను ప్రవేశపెట్టారని కొనియాడారు. చౌకగా, అతి తక్కువ ప్రీమియంతో సామాన్యులకు కూడా అందుబాటులో ఉండేలా లైఫ్ ఇన్సూరెన్స్ (జీవిత బీమా) పథకాలను కేంద్రం అమలు చేస్తోందన్నారు. కేవలం రూ. 750 చెల్లిస్తే చాలు.. ఏకంగా రూ. 15 లక్షల ప్రమాద బీమా సదుపాయం లభిస్తుందని వివరించారు. అలాగే పోస్టల్ ఆఫీసుల ద్వారా మరెక్కడా లేనంత అత్యధిక వడ్డీ ఇచ్చే పలు పొదుపు పథకాలను మోదీ ప్రభుత్వం సమర్థంగా చేపడుతోందని చెప్పారు.కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ లబ్ధిని ప్రజల ముంగిటకే తీసుకెళ్లేందుకు తాము ప్లాన్ చేస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు తెలిపారు. ఈ స్కీమ్స్‌లో ప్రజలు సులభంగా చేరేందుకు వీలుగా అన్ని నగరాల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యాన్ని సాధించడమే మోదీ ప్రభుత్వ ధ్యేయమని, ఈ దేశాభివృద్ధి యజ్ఞంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మాధవ్ పిలుపునిచ్చారు.

## ఇంటర్ రిజల్ట్స్ రిలీజ్

**విజయవాడ** ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ ఎగ్జామినేషన్స్ (ఐపీఏఎస్ఈ)–2026 ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. విద్యార్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌తో పాటు వాట్సాప్ మనమిత్ర సేవ ద్వారా కూడా తెలుసుకోవచ్చని ప్రభుత్వం తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇంటర్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులతో పాటు ఇంప్రూవ్ మెంట్ పరీక్షల ద్వారా తమ ఫలితాలను మెరుగుపరుచుకున్న వారిని అభినందించారు. వారి పట్టుదల, కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు.మొదటి సంవత్సరం ఫలితాల్లో 2,29,034 మంది విద్యార్థుల్లో 1,35,435 మంది (59 శాతం) తమ స్కోర్‌ను మెరుగుపరుచుకున్నారు. అలాగే 1,09,003 మంది అభ్యర్థుల్లో 42,379 మంది (39 శాతం) ఉత్తీర్ణత సాధించి ఫలితాలను మెరుగుపరుచుకున్నారు. రెండో సంవత్సరం ఫలితాల్లో 91,303 మంది విద్యార్థుల్లో 48,149 మంది (53 శాతం) మెరుగైన ఫలితాలు సాధించారు. మరోవైపు 1,02,018 మంది అభ్యర్థుల్లో 57,327 మంది (56 శాతం) ఉత్తీర్ణత సాధించి తమ ఫలితాలను మెరుగుపరుచుకున్నారు.ప్రభుత్వం కల్పించిన అవకాశంతో మొత్తం 1.83 లక్షల మందికి పైగా విద్యార్థులు తమ మార్కులను పెంచుకోగలిగారు. అలాగే సాధారణ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయిన దాదాపు లక్ష మంది విద్యార్థులకు మరో అవకాశం లభించడంతో వారు ఉన్నత విద్య వైపు అడుగులు వేయడానికి మార్గం సుగమమైంది. విద్యార్థులంతా ఆత్మవిశ్వాసంతో ఉన్నత విద్యను కొనసాగించి మరిన్ని విజయాలు సాధించాలని లోకేశ్ ఆకాంక్షించారు.

## రైతు భీమా ఎగ్గొటేందుకు కుట్ర

**హైదరాబాద్** తెలంగాణలో రైతు సమస్యలను అధికార కాంగ్రెస్ పార్టీ పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో రైతు బీమా పథకాన్ని ఎగ్గొట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను కనుమరుగు చేయాలని చూస్తే... ప్రజలు ఈ కాంగ్రెస్ నాయకులనే కనుమరుగు చేస్తారని అన్నారు.రాష్ట్రంలో వివిధ కారణాలతో దాదాపు 7,600 మంది రైతులు మరణిస్తే... వారికి అందాల్సిన రైతు బీమా డబ్బులు ఇప్పటివరకు రాలేదని జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎల్ఐసీకి ఇన్సూరెన్స్ ప్రీమియం సకాలంలో చెల్లించకపోవడం వల్లే ఈ క్లెయిమ్స్ ఆగిపోయాయనే వార్తలు వస్తున్నాయన్నారు. ఇది కేసీఆర్ తీసుకొచ్చిన పథకం కాబట్టే... దీనిని ఎలాగైనా మూలనపడేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర చేస్తోందని మండిపడ్డారు. చేతనైతే కొత్త పథకాలు తేవాలి తప్ప, ఉన్న పథకాలను చెడగొట్టవద్దని హితవు పలికారు.మొత్తం 33 రకాల వడ్లు ఉంటే.. ప్రభుత్వం కేవలం 7 రకాల వడ్లను మాత్రమే బోనస్‌కు గుర్తిస్తోందన్నారు. అయితే ఈ 7 రకాల వడ్లు సాగు చేస్తే ఎకరానికి కేవలం 20 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తుందని, అదే మిగతా 26 రకాల వడ్లు వేస్తే ఎకరానికి ఏకంగా 30 క్వింటాళ్ల పంట పండుతుందని చెప్పారు. ప్రభుత్వం చెప్పిన ఆ 7 రకాల వడ్లు పండించడం వల్ల రైతులు ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి నష్టపోతారని... అంటే ఒక్కో రైతు ఎకరానికి దాదాపు రూ. 24 వేల ఆదాయం కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు.

### అవినీతిపై సమాధానం చెప్పలేరా

తెలంగాణ రాజకీయాల్లో, ముఖ్యంగా జగిత్యాల–ధర్మపురి పొలిటికల్ సర్కిల్స్‌లో హీట్ ఒక్కసారిగా పెరిగింది. కాంగ్రెస్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను టార్గెట్ చేస్తూ బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తమపై వస్తున్న అవినీతి ఆరోపణలకు సమాధానం చెప్పలేక, లక్ష్మణ్ వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారంటూ మండిపడ్డారు.ధర్మపురి నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్లు, ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల టెండర్లలో భారీ ఎత్తున అవినీతి జరిగిందని కొప్పుల ఈశ్వర్ నేరుగా ఆరోపించారు. వీటితో పాటు నియోజకవర్గ పరిధిలోని ఇసుక రీచ్‌లు మాయమైపోతున్నాయన్నది పచ్చి నిజం కాదా అంటూ ఆయన నిలదీశారు. ప్రజా సమస్యలను, ఈ అవినీతి లెక్కలను పక్కదారి పట్టించడానికి మంత్రి లక్ష్మణ్ కుల రాజకీయం చేస్తున్నారని కొప్పుల మండిపడ్డారు. బీఆర్ఎస్ కీలక నేత హరీశ్‌రావును ఉద్దేశించి 'దొర' అంటూ కులాన్ని ప్రస్తావిస్తూ మాట్లాడటం ఏ రకమైన రాజకీయ సంస్కృతి? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు నిజంగానే అవినీతిపై మాట్లాడే ధైర్యం, చిత్తశుద్ధి ఉంటే తక్షణమే తన మంత్రి పదవికి రాజీనామా చేసి ప్రజల ముందుకు రావాలని కొప్పుల ఈశ్వర్ ఓపెన్ ఛాలెంజ్ విసిరారు. అయితే మంత్రి పదవిని వదులుకోవడం అంత సులభం కాదని.. ఎన్నో కష్టాలు పడి, ఎన్నో ప్రయత్నాల తర్వాత ఈసారి ఎమ్మెల్యేగా గెలిచిన లక్ష్మణ్‌కు రాజీనామా చేసేంత ధైర్యం అస్సలు లేదంటూ ఎద్దేవా చేశారు.

## కుళ్లిపోయిన మాంసంతో ప్రాణాలకే ముప్పు...

**తిరుపతి** సమాజంలో ప్రతి ఒక్కరూ తమ కుటుంబానికి ఎంతో కీలకమైన వారని, అలాంటి వారు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని స్థానిక హక్కుల పోరాట సమితి నేత డి.ఎమ్.సి. భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి పరిసర ప్రాంతాల్లోని ప్రజలను ఉద్దేశించి ఆయన ఒక ముఖ్యమైన ప్రకటన విడుదల చేశారు.అక్కచెల్లెళ్లు, అన్నదమ్ములు ప్రతి ఒక్కరిపైనా వారి కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని, పిల్లలకు మంచి భవిష్యత్తును అందించాల్సిన పెద్ద బాధ్యత వారిపై ఉందని భాస్కర్ గుర్తుచేశారు.ద

ఈ బాధ్యతలను సక్రమంగా నెరవేర్చాలంటే మొదటగా మనిషి ఆరోగ్యవంతుడిగా ఉండటం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు.ప్రస్తుతం కొన్ని హోటళ్లలో విచ్చలవిడిగా అమ్ముతున్న కుళ్లిపోయిన మాంసం వల్ల ప్రజల ప్రాణాలకు తీవ్రమైన ముప్పు పొంచి ఉందని ఆయన హెచ్చరించారు. కేవలం లాభాల కోసమే చూసే కొంతమంది వ్యాపారులు, నాణ్యత లేని వంటకాలతో ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు. ఇటువంటి కుళ్లిపోయిన, నిల్వ ఉంచిన మాంసాన్ని వండి పెడుతున్న హోటళ్ల నిర్వాహకుల వల్ల ఎంతోమంది అనారోగ్యం బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు."దయచేసి ప్లీజ్ ప్లీజ్.. బయట లభించే ఆహారాన్ని తినకండి" అని డి.ఎమ్.సి. భాస్కర్ ప్రజలను చేతులు జోడించి వేడుకున్నారు. మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవాలని హితవు పలికారు. అమ్మ చేతి వంట, భార్య చేతి వంట మన ప్రాణాన్ని నిలబెడితే.. బయట వ్యక్తులు వండే కలుషితమైన వంటలు మన ప్రాణాలను తీస్తాయని ఆయన స్పష్టం చేశారు.కాబట్టి, ప్రతి ఒక్కరూ హోటల్ తిండ్లకు, ఫాస్ట్ ఫుడ్‌కు దూరంగా ఉంటూ.. ఇంట్లో వండిన స్వచ్ఛమైన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని, తద్వారా ఆయురారోగ్యాలతో ఉంటూ కుటుంబాలను రక్షించుకోవాలని హక్కుల పోరాట సమితి తరపున డి.ఎమ్.సి. భాస్కర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ నుండి స్వర్ణముఖి నది ప్రమాద బాధిత కుటుంబాలకు పరిహారం చెక్కుల పంపిణీ

**తిరుపతి** స్వర్ణముఖి నది ప్రమాద బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహా య నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) నుండి మంజూరైన పూర్తి పరిహారం చెక్కులను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానితో కలిసి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ గురువారం కలెక్టరేట్‌లో పంపిణీ చేశారు.?2025 అక్టోబర్ 24న మొంతా తుపాన్ ప్రభావంతో తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం సమీపంలోని స్వర్ణముఖి నదిలో గల్లంతై నలుగురు బాలురు (ఎన్. తేజ, ఎన్. బాలు, ఎం. ప్రకాష్, టి. మునిచంద్ర) మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ విషాద ఘటనపై స్పందించిన ముఖ్యమంత్రి, బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ప్రకటించారు.?ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి రూ. 2 లక్షల చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించింది. గతంలో ముగ్గురు బాధితుల కుటుంబాలకు రూ. 1.50 లక్షల చొప్పున అందించగా, మిగిలిన రూ. 50 వేల చొప్పున (మొత్తం రూ. 1.50 లక్షలు) మరియు ఎన్. బాలు కుటుంబానికి పూర్తి మొత్తమైన రూ. 2 లక్షల చెక్కును కలిపి, నేడు మొత్తం రూ. 3.50 లక్షల విలువైన పరిహార చెక్కులను బాధితులకు అందజేశారు. దీనితో ప్రభుత్వం ప్రకటించిన పూర్తి పరిహారం అందినట్లయింది.?ఈ సందర్భంగా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ, పిల్లలను కోల్పోయిన కుటుంబాల బాధ పూడ్చలేనిదని, కష్టకాలంలో ప్రభుత్వం వారికి తోడుగా నిలిచిందని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాద బాధితులకు తక్షణ సహాయం అందించడంలో ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వెంటనే స్పందించి ఆర్థిక సహాయం అందించడం ప్రభుత్వ మానవతా దృక్పథానికి నిదర్శనమన్నారు. అనంతరం అధికారులు, ఎమ్మెల్యే బాధిత కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో తిరుపతి రూరల్ తహశిల్దార్ జనార్ధన్ మరియు బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

## తీర ప్రాంతాల్లో హరిత వలయాలు

**విజయవాడ,** ఏపీ అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం సరికొత్త వ్యూహాలతో స్పీడ్ పెంచింది. రాజధాని అమరావతి నిర్మాణంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సహజ వనరులను వాడుకుంటూ అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ నిరంతరం కసరత్తులు చేస్తున్నారు. ఇందులో భాగంగా... ఏపీకి ఉన్న సుదీర్ఘ తీర ప్రాంతాన్ని అటు టూరిజం పరంగా, ఇటు పర్యావరణ పరంగా అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఒక ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళుతోందిఏపీ కోస్తా తీరాన్ని శరవేగంగా అభివృద్ధి చేయడమే కాకుండా, పర్యావరణ రక్షణ కోసం 'కోస్తా గ్రీన్ బెల్ట్'ను విస్తరించేందుకు డిప్యూటీ పవన్ కల్యాణ్ నడుం బిగించారు. ఇందులో భాగంగా ఈరోజు సచివాలయంలో అటవీ, పర్యావరణ శాఖ ఉన్నతాధికారులతో ఆయన ఒక కీలక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.తీర ప్రాంతాల్లో భారీగా మొక్కలు నాటి, హరిత వలయాలను (గ్రీన్ జోన్స్) ఏర్పాటు చేయడం ద్వారా సముద్రపు కోతను అడ్డుకోవచ్చని, తుపానుల తీవ్రతను తగ్గించవచ్చని పవన్ కల్యాణ్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. దీనికోసం తక్షణమే ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ గ్రీన్ బెల్ట్ ప్రాజెక్ట్‌లో కేవలం ప్రభుత్వానిదే కాకుండా స్థానిక ప్రజలను కూడా భాగస్వామ్యం చేయాలని పవన్ కల్యాణ్ సూచించారు. తీర ప్రాంత గ్రామాల్లో సామాజిక అడవుల . పెంపకానికి ప్రత్యేక డ్రైవ్స్ నిర్వహించాలని, తద్వారా పర్యావరణానికి మేలు జరగడమే కాకుండా స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని అధికారులకు స్పష్టం చేశారు.

## టీటీడీ ఎంప్లాయిస్ క్రెడిట్ సొసైటీ జనరల్ బాడీ సమావేశాన్ని వాయిదా వేయాలి...

**- టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చీర్ల కిరణ్ డిమాండ్**



**తిరుపతి** జూన్ 30వ తేదీన నిర్వహించ తలపెట్టిన టీటీడీ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ జనరల్ బాడీ సమావేశాన్ని మరో అనుకూలమైన తేదీకి వాయిదా వేయాలని ఆ సొసైటీ డైరెక్టర్, టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చీర్ల కిరణ్ డిమాండ్ చేశారు. ఉద్యోగుల ప్రయోజనాలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ సమావేశాన్ని ఒక బాధ్యతగల డైరెక్టర్‌గా తాను బహిష్కరిస్తున్నట్లు ఆయన ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 30వ తేదీన దాదాపు 130 మంది టీటీడీ ఉద్యోగులు పదవీ విరమణ పొందుతున్నారని తెలిపారు. శ్రీవారి సేవలో దశాబ్దాల పాటు విశిష్ట సేవలు అందించిన ఆ ఉద్యోగులను ఘనంగా సన్మానించి, వారికి గౌరవప్రదంగా వీడ్కోలు పలకాల్సిన ముఖ్యమైన రోజున ఈ సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేయడం సరికాదన్నారు. దీనివల్ల పదవీ విరమణ పొందుతున్న సభ్యులు, ఇతర ఉద్యోగులు సమావేశానికి పూర్తిస్థాయిలో హాజరుకాలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.ఉద్యోగుల మనోభావాలను, వారి సేవలను దృష్టిలో ఉంచుకుని సమావేశాన్ని వాయిదా వేయాలని పాలకవర్గాన్ని ఇప్పటికే కోరినప్పటికీ, ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం విచారకరమన్నారు. ఈ సమావేశానికి అనుమతి మంజూరు చేసిన టీటీడీ యాజమాన్యం కూడా పునరాలోచన చేయాలని, ఇచ్చిన అనుమతిని ఉపసంహరించుకుని సమావేశం వాయిదా పడేలా తగిన ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగుల సన్మాన కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వడం మన అందరి బాధ్యతని, ఉద్యోగుల ఐక్యత, సంక్షేమం, గౌరవమే తమ ప్రధాన లక్ష్యమని చీర్ల కిరణ్ స్పష్టం చేశారు

## రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోంది.

**- స్టేషన్కు వెళ్లిన యువకులను చంపి తగలబెట్టి బూడిద చేయడం దుర్మార్గం :**

**- మాజీ మంత్రి అంబటి రాంబాబు**

**గుంటూరు** గాదె సాయికృష్ణ అనే యువకుడును కృష్ణలంక పోలీసులు చంపి, బూడిద చేశారని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. గుంటూరులో ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గాదె సాయికృష్ణ మేనమామ, వంగవీటి నరేంద్రతో కలిసి అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడారు. గాదె సాయికృష్ణ తప్పు చేస్తే చట్ట ప్రకారం శిక్షించాలి కానీ, లాకప్ డెత్ చేసి, బూడిద చేసే హక్కు పోలీసులకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. హృదయ విదారకమైన సంఘటనలాకప్ డెత్ లు చూసాము, డెడ్ బాడీని సంబంధిత వ్యక్తులకు అప్పగించడం చూసాము. హైకోర్టులో హెబియఎస్ కార్పస్ పిటిషన్ వేస్తే పోలీసులు వెతుకుతున్నామని సమాధానం చెప్పారు. సాయి కృష్ణ ఎక్కడున్నాడు చంపింది పోలీసులే ట్రీట్మెంట్ ఇప్పించింది పోలీస్ లే, దహనం చేసింది పోలీసులే. ఇవన్నీ ప్రజలు చూశారు. పవన్ కళ్యాణ్ దీనిపై తక్షణమే స్పందించి, ఎంక్వయిరీ వేసి, బాధితులకు న్యాయం చేయాలని ప్రాధేయపడ్డారు. దీనిలో పాత్ర ఉన్న ప్రతి ఒక్కరికి ఉరిశిక్ష వేయాలి అని డిమాండ్ చేశారు. సిట్ లేదా సిబిఐ వేయడం వలన ఎలాంటి ప్రయోజనాలు లేదని అన్నారు. చంపి బూడిద చేసి అది కూడా ఇవ్వకుండా లక్షలు, కోట్లు ఇస్తామని బేరం చేయటం ఏమిటని నిలదీశారు

## బీచ్ షాక్స్ వద్దు సముద్ర తీరాల్లో యువతరాన్ని నాశనం చేయవద్దు

**- ప్రముఖ సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు**

**కాకినాడ:** మద్యం షాపులు, బార్లు, అనధికార బెల్ట్ షాపులు, గంజాయి, గుట్కా, సారా వంటి మహమ్మరిలన్నీ కాకినాడ యువతను భ్రష్టు పట్టిస్తుంటే ఇప్పుడు పర్యాటకం పేరిట ప్రభుత్వం తీసుకువస్తున్న బీచ్ షాక్స్ ను వెంటనే ఉపశమహరించుకోవాలని లేదా ప్రజావ్యతిరేకతను మూటకట్టు కోవాల్సి వస్తుందని ప్రముఖ సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు హెచ్చరించారు. బీచ్ షాక్స్ వలన యువత భవిష్యత్ ప్రగతికి కరెంట్ షాక్ తరహాగా ఉందని ప్రముఖసామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు నిరసన వ్యక్తం చేశారు. ఎన్ టి ఆర్ బీచ్ లో గురువారం ఉదయం బీచ్ షాక్స్ వద్దు సముద్ర తీరాల్లో యువతరాన్ని నాశనం చేయవద్దని పేర్కొంటూ ప్లకార్డ్ తో ప్రదర్శన చేశారు.

# సమాజ శ్రేయస్సు కోసం జీవించేవారే ధన్యులు

**- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి.**

**- ఇంజాపూర్ జెడ్‌పీహెచ్‌ఎస్‌లో సరస్వతి దేవి విగ్రహావిష్కరణ**

**- ప్రభుత్వానికి ప్రత్యామ్నాయంగా భూపాల్ రెడ్డి సేవా కార్యక్రమాలు అభినందనీయం**



ఇబ్రహీంపట్నం: జూన్ 18 భారత శక్తి, సమాజ శ్రేయస్సు కోసం జీవించేవారే నిజమైన ధన్యజీవులని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ఇంజాపూర్‌కు చెందిన బొక్క భూపాల్ రెడ్డి తన 83వ జన్మదినాన్ని పురస్కరించుకుని, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్‌పీహెచ్‌ఎస్)లో సరస్వతీదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే.. భూపాల్ రెడ్డి పాఠశాల విద్యార్థులకు అందించిన యూనిఫాంలు, పుస్తకాలు, ప్లేట్లు, ఇతర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భూపాల్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మల్‌రెడ్డి.. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించి, మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు. పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వానికి ప్రత్యామ్నాయంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. "తమకున్న దానిలో కొంత భాగాన్ని ఇతరులకు పంచినప్పుడే ఉన్నతమైన సమాజం నిర్మితమవుతుంది. సమాజంలో సేవా దృక్పథం మరింత పెరగాల్సిన అవసరం ఉంది."

**మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే**

### విద్యాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే తెలిపారు. సరికొత్త విధానాలతో విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నట్లు చెప్పారు. భూపాల్ రెడ్డిని ఆదర్శంగా తీసుకుని మరికొంత మంది దాతలు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు ముద్దగోని రామ్మోహన్ గౌడ్, రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బద్దూరు వెంకట్ రెడ్డి, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నిరుద్యోగుల పోరాటాన్ని అణచలేరు

**బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు దత్తాత్రేయ రావు**

**తాండూరులో బీఆర్ఎస్వీ నేతల అరెస్టు.. పోలీస్ స్టేషన్‌కు తరలింపు**



వికారాబాద్ జూన్ 18 భారత శక్తి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో విఫలమై అక్రమ నిర్బంధాలు, ముందస్తు అరెస్టులతో కాలం వెళ్లదీస్తోందని బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు దత్తాత్రేయ రావు ఆరోపించారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగులు, విద్యార్థులకు ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో నిరుద్యోగులు, విద్యార్థి సంఘాలు చేపట్టిన 'అసెంబ్లీ ముట్టడి' కార్యక్రమం నేపథ్యంలో పోలీసులు గురువారం తెల్లవారుజాము నుంచే ముందస్తు అరెస్టులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా తాండూరులోని తమ నివాసాల్లో ఉన్న బీఆర్ఎస్వీ జిల్లా నాయకులు దత్తాత్రేయ రావు, వినోద్ కుమార్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని తాండూరు పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ రావు మాట్లాడుతూ, నిరుద్యోగులు తమ న్యాయమైన హక్కులు, ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం శాంతియుతంగా పోరాడుతుంటే అక్రమ అరెస్టులతో వారిని అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా, అక్రమంగా నిర్బంధించినా నిరుద్యోగుల ఉద్యమాన్ని ఆపలేరని హెచ్చరించారు. విద్యార్థులు, నిరుద్యోగులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు పూర్తిగా అమలు అయ్యే వరకు బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.

# తెలంగాణలో మూడు రోజులు రిజిస్ట్రేషన్ల నిలిపివేత

**- ఈ నెల 26 నుంచి 28 వరకు తాత్కాలిక విరామం**

**; 29 నుంచి సేవలు పునఃప్రారంభం**







హైదరాబాద్, జూన్ 18: భారత శక్తి, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్‌సైట్‌తో పాటు అనుబంధ ఆన్‌లైన్ సేవలకు ఈ నెల 26 నుంచి 28 వరకు తాత్కాలిక విరామం కలగనుంది. షెడ్యూల్డ్ సర్వర్ నిర్వహణ పనుల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు.

**- ఐదేళ్ల తర్వాత ఆధునీకరణ**

దాదాపు ఐదేళ్ల తర్వాత ఈ సర్వర్ నిర్వహణ పనులు చేపడుతున్నారు. సర్వర్ వ్యవస్థలు మరింత సజావుగా పనిచేయడానికి, భద్రతా ప్రమాణాలను బలోపేతం చేయడానికి, సేవల నాణ్యతను మెరుగుపరచడానికి ఈ తాత్కాలిక విరామం అవసరమని అధికారులు పేర్కొన్నారు.

**- ప్రజలకు కనీస అసౌకర్యం**

ఈ షెడ్యూల్‌ను ప్రజలకు కనీస అసౌకర్యం కలిగేలా రూపొందించారు.
- జూన్ 26: మొహరమ్ ప్రభుత్వ సెలవు దినం
- జూన్ 27: ప్రభుత్వ పని దినం (ఈ ఒక్కరోజు మాత్రమే సేవలకు అంతరాయం)
- జూన్ 28:ఆదివారం సాధారణ సెలవు దినం

మధ్యలో ఉన్న జూన్ 27న ఒక్కరోజు మాత్రమే పని దినం కావడంతో సాధారణ ప్రజలపై దీని ప్రభావం చాలా తక్కువగా ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు.

**ముందస్తు ప్రణాళిక అవసరం**

జూన్ 29వ తేదీ నుంచి అన్ని రిజిస్ట్రేషన్ సేవలు యథావిధిగా పునఃప్రారంభమవుతాయి. కాబట్టి ప్రజలు తమ రిజిస్ట్రేషన్ సంబంధిత పనులను ముందస్తుగా ప్రణాళిక చేసుకోవాలని, శాఖ నిర్వహణ పనులకు సహకరించాలని ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు కోరారు.

# సొంత నిధులతో దేవాలయాలు..

**నియోజకవర్గ వ్యాప్తంగా భక్తి భావం పెంపొందిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..**

**పటాన్‌చెరు సింఫనీ కాలనీలో రామాలయం, శివాలయం, అమ్మవారి దేవాలయం, బండల మల్లన్న దేవాలయం ఆవరణలో చౌడమ్మ దేవాలయం, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలకు శంకుస్థాపన.. సొంత నిధుల కేటాయింపు..**





పటాన్‌చెరు జూన్ 18 భారత శక్తి పటాన్‌చెరు నియోజకవర్గంలో ఒక వైపు అభివృద్ధి మరో వైపు సొంత నిధులతో దేవాలయాలు, మసీదులు, చర్చిలు నిర్మిస్తూ ప్రజల్లో ఆధ్యాత్మిక భావం పెంపొందిస్తున్నారు పటాన్‌చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి . అభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక విలువల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ఆలయాల నిర్మాణం, పునర్నిర్మాణ కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తున్నారు. తాజాగా జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని సింఫనీ కాలనీలో గురువారం ఉదయం శివాలయం, రామాలయం, అమ్మవారి దేవాలయాల నిర్మాణాలకు భూమి పూజ నిర్వహించారు. అనంతరం బండల మల్లన్న దేవాలయం ఆవరణలో చౌడమ్మ దేవాలయం నిర్మాణానికి భూమి పూజ నిర్వహించి.. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. నూతన దేవాలయాలు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు సొంత నిధులు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలలో ఆధ్యాత్మిక భావం పెంపొందించడంలో భాగంగా పటాన్‌చెరు నియోజకవర్గం వ్యాప్తంగా కుల మతాలకు అతీతంగా దేవాలయాలు, మసీదులు, చర్చిలు నిర్మిస్తూ పరమత సహనాన్ని పెంపొందిస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు పృథ్వీరాజ్, చంద్రశేఖర్, మల్లేష్ యాదవ్, సుధాకర్, విజయ్, వెంకటేష్, ధనరాజ్ గౌడ్, రాజు, నాగమల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఒడిశా-హైదరాబాద్ గంజాయి సరఫరా ముఠా గుట్టురట్టు

**- ముగ్గురు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్ట్, 51.8 కేజీల గంజాయి స్వాధీనం**

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 18: భారత శక్తి, ఒడిశా నుంచి హైదరాబాద్‌కు యథేచ్ఛగా సాగుతున్న అంతర్రాష్ట్ర గంజాయి సరఫరా నెట్‌వర్క్‌ను రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఎల్బీనగర్ జోన్ ఎస్ఓటీ (ాా), అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు ఉమ్మడి ఆపరేషన్‌లో విజయవంతంగా ఛేదించారు. ఈ దాడిలో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ. 25.90 లక్షల విలువైన 51.800 కిలోల గంజాయిని, రవాణాకు ఉపయోగించిన మహీంద్రా బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

**నిందితుల వివరాలు**

పోలీసులకు చిక్కిన అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్లు అందరూ ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరి జిల్లాకు చెందినవారే. వారి వివరాలు ఇలా ఉన్నాయి:

1. కాములు పాంగి (37): వృత్తిరీత్యా రైతు, ఖైర్‌పుట్ మండలం, బందాదుర్రై గ్రామం.
2. బాబిని హంతాల్ (31): మెకానిక్/రైతు, చిత్రకొండ మండలం, ఈలంపాక గ్రామం.
3. కృష్ణ హంతాల్ (29): వృత్తిరీత్యా డ్రైవర్, ఖైర్‌పుట్ మండలం, ఆంధ్రాహెల్ గ్రామం.

**- కేసు నేపథ్యం.. పక్కా ప్లాన్**

పోలీసుల కథనం ప్రకారం.. కాములు పాంగి, బాబిని హంతాల్ గత ఆరు నెలలుగా ఒడిశాలోని అటవీ ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో గతంలో మల్కన్‌గిరి జైలులో పరిచయమైన 'సాగర్' అనే వ్యక్తితో వీరు డీల్ కుదుర్చుకున్నారు. హైదరాబాద్‌లో గంజాయి సప్లై చేస్తే భారీగా డబ్బు ఇస్తానని సాగర్ ఆశ చూపించడంతో, వీరు ఘట్‌కేసర్ వద్ద డెలివరీ ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నారు. ఈ ప్లాన్ ప్రకారం.. ఈ నెల 15న ఒడిశాలోని ఈలంపాక గ్రామం నుంచి మహీంద్రా బొలెరో వాహనం (=వస్త్ర. చీశీ. ాణ-10-జ-5377) వెనుక సీటు కింద గంజాయి ప్యాకెట్లను అత్యంత చాకచక్యంగా దాచి హైదరాబాద్‌కు బయలుదేరారు. హైదరాబాద్ చేరుకున్నాక రామోజీ ఫిల్మ్ సిటీ పరిసరాల్లో వేచి చూశారు. నిన్న (జూన్ 17న) సాయంత్రం సాగర్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు గంజాయిని ఘట్‌కేసర్ వైపు తరలించడం ప్రారంభించారు.

**- ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు వద్ద పట్టుబడ్డారు**

నమ్మదగిన సమాచారం అందుకున్న ఎల్బీనగర్ జోన్ ఎస్ఓటీ బృందం, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులతో కలిసి నిఘా పెట్టింది. బుధవారం సాయంత్రం 6:25 గంటల ప్రాంతంలో అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని తారా కన్వెన్షన్ సమీపంలో, ఓఆర్ఆర్ (ా==) సర్వీస్ రోడ్డుపై అనుమానాస్పదంగా వెళ్తున్న బొలెరో వాహనాన్ని పోలీసులు అడ్డుకున్నారు. వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయగా వెనుక సీటు కింద దాచిన 51.800 కేజీల గంజాయి బయటపడింది.

**-స్వాధీనం చేసుకున్న సొత్తు:**

- 51.800 కేజీల గంజాయి (విలువ రూ. 25,90,000/-)
- మహీంద్రా బొలెరో వాహనం (ాణ-10-జ-5377)
- రూ. 2,290/- నగదు -3 మొబైల్ ఫోన్లు

**పరారీలో ప్రధాన నిందితుడు**

ఈ కేసులో గంజాయిని రిసీవ్ చేసుకోవాల్సిన సాగర్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. అబ్దుల్లాపూర్‌మెట్ పిఎస్ లో క్రైమ్ నెం. 507/2026, ఉ/సె 8(ఛ) తీ/ష 20(ఖ), 20(ఎ)(అఅ)(జ) చీణూూ చట్టం-1985 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న నిందితుడితో పాటు ఈ అంతర్రాష్ట్ర డ్రగ్ నెట్‌వర్క్‌తో సంబంధమున్న మిగిలిన లింకులను పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో డ్రగ్స్ మహమ్మారిని పూర్తిగా నిర్మూలించడమే తమ టాప్ ప్రయారిటీ అని అధికారులు స్పష్టం చేశారు. డ్రగ్స్ సప్లై చైన్‌ను తుంచివేయడంతో పాటు, పెడ్లర్లు, వినియోగదారులను గుర్తిస్తున్నామని.. ప్రజలు కూడా డ్రగ్స్ కు సంబంధించిన ఎలాంటి సమాచారమైనా పోలీసులతో పంచుకుని సహకరించాలని కోరారు. ఈ విజయవంతమైన ఆపరేషన్ మల్కాజ్‌గిరి కమిషనరేట్ సీపీ శ్రీమతి బి. సుమతి, ఐపీఎస్ ప్రత్యక్ష పర్యవేక్షణలో, ఎల్బీనగర్ జోన్ డీసీపీ శ్రీమతి బి. అనురాధ, ఐపీఎస్, ఎస్ఓటీ డీసీపీ శ్రీ కె. మనోహర్, అడిషనల్ డీసీపీ శ్రీ ఎండీ. షాకిర్ హుస్సేన్ ల మార్గదర్శకత్వంలో ఎస్ఓటీ ఎల్బీనగర్ టీమ్, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ సిబ్బంది సంయుక్తంగా నిర్వహించారు.




# జలధారతో అన్నమయ్య జిల్లాకు జలవిజయం



**రాయచోటి(భారత శక్తి)** అన్నమయ్య జిల్లాలో అమలవుతున్న జలధార కార్యక్రమం పక్కా ప్రణాళిక, సమర్థవంతమైన అమలు, సమన్వయంతో రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా. గురువారం మదనపల్లి జిల్లా కేంద్రం ఆర్ఆర్ గార్డెన్స్ ఫంక్షన్ హాల్ లో.. "2 ఏళ్ల నమ్మకం - సుపరిపాలన - అభివృద్ధి సంక్షేమం" పై పండుగ వాతావరణం లో అత్యంత ఘనంగా జిల్లా స్థాయి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలలో రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖామాత్యులు మరియు జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు బీసీ జనార్దన్ రెడ్డి, రాష్ట్ర రవాణా క్రీడ యువజన శాఖ మాత్యులు మరియు జిల్లా మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, శాసనసభ్యులు షాజహాన్ భాష, కిషోర్ కుమార్ రెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, మాజీ శాసనసభ్యులు, పార్లమెంట్, నియోజకవర్గ కూటమి పార్టీ ఇంచార్జిలు, కార్యకర్తలు, జిల్లా అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రులు మాట్లాడుతూ... జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ నాయకత్వంలో అమలవుతున్న ఈ కార్యక్రమం నీటి సంరక్షణ, చెరువుల అనుసంధానం, భూగర్భ జలాల పెంపు దిశగా విశేష ఫలితాలను అందించిందన్నారు. ముఖ్యంగా కరువు ప్రభావిత ప్రాంతాల్లో నీటి లభ్యత పెరగడంతో వ్యవసాయం, పశుసంవర్ధక రంగాలకు కొత్త ఊపునిచ్చిందని తెలిపారు. జలధార కార్యక్రమం కేవలం ఒక అభివృద్ధి కార్యక్రమం మాత్రమే కాకుండా, భవిష్యత్ తరాలకు నీటి భద్రతను కల్పించే దిశగా రూపొందించిన ప్రజా ఉద్యమంగా మారిందన్నారు. జిల్లా స్థాయిలో ప్రారంభమైన ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే స్థాయికి చేరుకోవడం జిల్లా యంత్రాంగం పనితీరుకు నిదర్శనమని అభినందించారు. జలధార ? జిల్లాకు జీవధారగా మారిందని మంత్రులు పేర్కొన్నారు. ఈ విజయానికి ప్రధాన కారకులైన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను ప్రత్యేకంగా అభినందిస్తూ, ఆయన దూరదృష్టి, కార్యాచరణ, నిరంతర పర్యవేక్షణ వల్లే ఈ కార్యక్రమం విజయవంతమైందని కొనియాడారు. అలాగే కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతం చేసిన జిల్లా యంత్రాంగం, ఎంపీడీవోలు, ఎంపీఓలు, రెవెన్యూ శాఖ, ఇరిగేషన్ శాఖ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. పిలుపునిచ్చారు. చెరువు నీటితో పంటల సాగు మెరుగుపడింది రైతు అక్కులరెడ్డి, చిన్నమండెం మండలం చాకిబండ గ్రామ రైతు×చిన్నమండెం మండలం చాకిబండ గ్రామానికి చెందిన రైతు అక్కుల రెడ్డి మాట్లాడుతూ.., చెరువు కాల్వల పునరుద్ధరణ, అభివృద్ధి పనుల వల్ల తమ ప్రాంతంలో నీటి లభ్యత గణనీయంగా పెరిగిందని తెలిపారు. గతంలో చెరువులో నీటి నిల్వలు లేక ఇబ్బందులు ఎదుర్కొనేవాళ్లమని, ప్రస్తుతం చేపట్టిన పనుల వల్ల చాకిబండ చెరువులో నీరు నిల్వ ఉండటంతో భూగర్భ జలాలు పెరిగి బోర్లలో కూడా నీటి మట్టం మెరుగుపడిందన్నారు. దీంతో మామిడి, టమాటా, పూల సాగు వంటి పంటలను సాగు చేస్తున్నామని తెలిపారు. నీటి లభ్యత పెరగడంతో వ్యవసాయంపై నమ్మకం పెరిగి రైతులకు ఉపయోగకరంగా మారిందన్నారు. ఈ మార్పుకు కృషి చేసిన జిల్లా కలెక్టర్ ముఖ్యమంత్రి రైతుగా తన కృతజ్ఞతలు మరియు నమస్కారాలు తెలియజేశారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వ పథకాలతో మహిళా పారిశ్రామికవేత్తగా ఎదిగాను:- మహిళా పారిశ్రామికవేత్త మంజుల×రెండేళ్ల ప్రభుత్వ విజయోత్సవ కార్యక్రమంలో మహిళా పారిశ్రామికవేత్త మంజుల మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, స్వయం ఉపాధి కార్యక్రమాల వల్ల మహిళలకు కొత్త అవకాశాలు లభిస్తున్నాయని అన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. చిన్న స్థాయిలో ఒక ఆవుతో ప్రారంభించిన తన ప్రయాణం ఈరోజు నెలకు సుమారు రూ.30 వేల ఆదాయం వచ్చే స్థాయికి చేరిందని తెలిపారు. ఈ ప్రయాణంలో స్వయం సహాయక సంఘాల ద్వారా, వెలుగు సంస్థ సహకారంతో, స్త్రీనిధి ద్వారా అందిన ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగపడిందన్నారు.

అదేవిధంగా బ్యాంకు రుణ సౌకర్యాల ద్వారా మరింత విస్తరణకు అవకాశం లభించిందని చెప్పారు. ప్రస్తుతం పీఎంఈజీపీ పథకం ద్వారా రూ.10 లక్షల రుణం మంజూరు కావడంతో వ్యాపారాన్ని మరింత విస్తరించి, మరికొంత మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. జలధార కార్యక్రమం ద్వారా నీటి లభ్యత మెరుగుపడటంతో పశుపోషణ రంగానికి మరింత ఊతం లభిస్తోందని పేర్కొన్నారు. నాలాంటి ఎంతో మంది మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలు ఉపయోగపడుతున్నాయని, మహిళల సాధికారతకు తోడ్పడుతున్న అన్ని కార్యక్రమాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవకాశం కల్పించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, సంబంధిత అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

## అంతేరా రెస్టారెంట్, లా పినోజ్ పిజ్జా

## రెస్టారెంట్లపై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడి



**హైదరాబాద్** మియాపూర్లోని మదీనాగూడలో ఉన్న అంతేరా రెస్టారెంట్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చే'ఇఐఎ. ఫంగస్ ఏర్పడిన కాలీఫ్లవర్ ఇతర కూరగాయలు, వంటకు వాడరాని నూనె, లేబుల్స్ లేకుండా కూరగాయల నిల్వలు గుర్తించి ఇంప్రూవ్మెంట్ నోటీసులు జారీ చేసారు. హైటెక్ సిటీ జూబ్లీ ఎంక్లేవ్లోని లా పినోజ్ పిజ్జా రెస్టారెంట్పై దాడులు చేసి ఫ్రిజ్లో పురుగులు, కిచెన్లో బొద్దింకలు, వెజ్ మరియు నాన్ వెజ్ పదార్థాలు ఒకే చోట నిల్వ ఉంచడం, ఆహార పదార్థాలు నిల్వ ఉంచే చోట బల్లి విసర్జనలు ఉన్నట్లు గుర్తిం,ఆరు. నోటీసులు జారీ చేసారు.

## ఆక్వా రైతు కృష్ణంరాజు దారుణ హత్య

**ముమ్మిడివరం,** కొత్త మురమళ్లలో రొయ్యల చెరువు వద్ద ఆక్వా రైతు దాట్ల కృష్ణంరాజు (64)ను దుండగులు కొట్టి చంపి, రాళ్లు కట్టి రొయ్యల చెరువులో పడవేసారు. రాత్రి అయినా కృష్ణంరాజు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. చివరకు చెరువులో రాళ్లతో కట్టిపడేసిన కృష్ణంరాజు మృతదేహం గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు గురైన వ్యక్తి స్థానిక ఎమ్మెల్యే సమీప బంధువని సమాచారం.

## గోడ కూలి కారులో ఉన్న ఇద్దరు మృతి

**మహబూబ్ నగర్** వర్షం కురుస్తున్న సమయంలో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటిపై నుంచి ప్రహరీ గోడ కారుపై అకస్మాత్తుగా కూలిపోయింది. ఘటనలో కారులో ఉన్న సివిల్ ఇంజినీర్ జగన్నాథ్ రెడ్డి, డ్రైవర్ సంతోష్ మృతి చెందారు. మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండల కేంద్రంలో ఘటన జరిగింది.

## మామిడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

**- మామిడి రైతులకు మద్దతుగా వైసీపీ ఆధ్వర్యంలో ఆందోళన**

**చిత్తూరు** జీడి నెల్లూరు జైన్ ఫ్యాక్టరీ ఎదుట మామిడి రైతులతో వైసీపీ నిరసన కు దిగింది. మామిడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేసారు. గత ఏడాది మామిడి పంటకు కిలో 12 రూపాయలు గిట్టు బాటు ధర కల్పించింది ప్రభుత్వం. ఈ ఏడాది మామిడి పంటను జ్యూస్ ఫ్యాక్టరీలు తక్కువ ధరకే కిలో 4 - 5 రూపాయలు మించి కొనుగోలు చేయడంలేదు. తోతాపురి మామిడి పంటకు కిలో 15-20 రూపాయలు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేసారు. తిరుపతి , చిత్తూరు జిల్లాలు వైసీపీ అధ్యక్షుడు భూముల కరుణాకర్ రెడ్డి నేతృత్వంలో జైన్ ఫ్యాక్టరీ ఎదుట ఆందోళన జరిగింది.

## పోలీసుల వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య



**విజయనగరం** సంతకవిటి మండలం రామరాయపురంలో విషాదం నెలకొంది. పోలీసుల పలుమార్లు విచారణకు పిలవడంతో తల్లీకొడుకులు కళావతి, చిరంజీవి రైలు క్రిందపడి ఆత్మహత్యకు ప్రయత్నించారు. ఆఖరి క్షణంలో కొడుకును పక్కకునెట్టి తల్లి ఆత్మహత్య చేసుకుంది.గత నెల 25న ఓ ఇంట్లో 4 తులాల బంగారం, రూ.10 వేల నగదు చోరీ అయ్యాయి. అనుమానంతో వీరినే పదే పదే పోలీస్ స్టేషన్ కు పిలవడంతో మనస్తాపానికి గురయ్యారు.

## రోడ్డు ప్రమాదంలో

## తల్లిదండ్రులు, కొడుకు మృతి

**మెడ్చల్** మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మురహరపల్లి రాజీవ్ రహదారిపై అర్ధ రాత్రి జరిగిన ప్రమాద ఘటన స్థలాన్ని మేడ్చల్ ఏసిపి శంకర్ రెడ్డి పరిశీలించారు.ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మృతి చెందిన విషయం తెలిసిందే.ఈ ప్రమాదంలో కరీంనగర్ కు చెందిన రైల్వే ఉద్యోగి చంద్ర శేఖర్ మరియు అతని భార్య రేఖ మరియు రేఖ చెల్లెలి కుమారుడు నిహాల్ 2 సంవత్సరాలు ఈ ప్రమాదంలో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో కారు అదుపు తప్పి అటుగా వస్తున్న లారీని బలంగా ఢీ కొనడంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురిలో ముగ్గురు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు.ఈ ప్రమాదానికి నిద్ర మత్తె కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు.మృతులను పోస్ట్ మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించామని ఏసీపీ మీడియాకు తెలిపారు..

## రైతులకు రెండు లక్షల

## పంట రుణాలు మాఫీ చేయాలి

**- జూన్ 30 చలో విజయవాడ కార్యక్రమం జయప్రదం చేయండి**

**- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు మందపాటి రమణారెడ్డి**



**పిడుగురాళ్ల** :రైతులకు రెండు లక్షల పంట రుణాలు మాఫీ చేయాలని జూన్ 30వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మందపాటి రమణారెడ్డి అన్నారు. గురువారం పిడుగురాళ్ల ఎస్ టి యూ ఆఫీస్ లో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సమావేశంలో రమణారెడ్డి మాట్లాడుతూ, గత రెండేళ్లుగా రాష్ట్రంలో రైతాంగం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాదిరిగా మన రాష్ట్రంలో రెండు లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేసి ఆత్మహత్యల నుంచి రైతాంగాన్ని కాపాడాలని అన్నారు. గురజాల నియోజకవర్గం కార్యదర్శి కందిమళ్ల సైదారావు మాట్లాడుతూ, డాక్టర్ ఎం ఎస్ స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని కౌలు రైతులకు గుర్తింపు కార్డులను ఇచ్చి, పంట రుణాలను ఇవ్వాలన్నారు. విజయవాడలో జరుగు ధర్నా చౌక్ వద్దకు ఈ నెల 30వ తేదీన గురజాల నియోజకవర్గం నుంచి రైతులు పాల్గొని ముఖ్యమంత్రి కార్యాలయం రాయబారాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు కందిమళ్ళ అంజలి, అక్కెనపల్లి బాలయ్య, షేక్ సైదా, షేక్ నజీర్ పాల్గొన్నారు.

## విజయవాడ లాకప్ డెత్ ఉదంతంపై

## ఎన్హెచ్ఆర్సీ కి మాజీ ఎంపీ కేశినేని నాని ఫిర్యాదు

**విజయవాడ** థర్డ్ డిగ్రీ గాయాలు బయటపడకుండా ఉండేందుకే గాదె సాయికృష్ణ మృతదేహాన్ని పోలీసులు రహస్యంగా దహనం చేశారని మాజీ ఎంపి కేశినేని నాని ఆరోపించారు. ఈ మేరకు అయన జాతీయ మానవ హక్కుల సంఘానికి అయన ఫిర్యాదు చేసారు. ఫోరెన్సిక్, డిఎన్యే ం సాక్ష్యాలు దొరకకుండా ఉండేందుకు, సాయికృష్ణ అస్థికలను కృష్ణానదిలో కలిపేశారని అన్నారు.'కమాండ్ రెస్పాన్సిబిలిటీ' కింద ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ (అఖ) ఎస్.వి. రాజశేఖర బాబును తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేసారు. విజయవాడలో పోలీసులు ఫ్రెండ్లీ పోలీసింగ్ మరిచి, మాఫియాల కొమ్ముకాస్తూ "ప్రైవేట్ సెటిల్మెంట్ సిండికేట్" నడుపుతున్నారని లేఖలో పేర్కొన్నారు. సాయికృష్ణ అక్రమ నిర్బంధం, హత్యపై సెక్షన్ 176(1ం) కింద తక్షణమే స్వతంత్ర జ్యుడీషియల్ విచారణ జరపాలని అయన కోరారు.

## నేడు మండల కేంద్రం తుగ్గలికు

# జిల్లా కలెక్టర్ సిరి రాక

**- తహసిల్దార్ రవి - పిజిఆర్ఎస్ ద్వారా ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరణ**



**తుగ్గలి** నేడు మండల కేంద్రమైన తుగ్గలికు కర్నూలు జిల్లా కలెక్టర్ సిరి,జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ వస్తున్నట్లు తుగ్గలి తహసిల్దార్ రవి తెలియజేశారు.గురువారం రోజున తహసిల్దార్ కార్యాలయం నందు ఆయన మాట్లాడుతూ శుక్రవారం రోజున ఉదయం 9 గంటలకు తుగ్గలిలోని సాధనా విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలియజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కర్నూలు జిల్లా కలెక్టర్ సిరి,జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్,పత్తికొండ శాసనసభ్యులు కే.ఈ శాంబాబులు హాజరై తుగ్గలి మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల ప్రజలకు సంబంధించిన ప్రజా సమస్యల దరఖాస్తులు స్వీకరిస్తారని వారు తెలియజేశారు.కావున శుక్రవారం రోజున జరిగే ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమానికి మండల పరిధిలోని గల అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరుకావాలని ఆయన తెలియజేశారు.కావున ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికను మండల వ్యాప్తంగా గల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ రవి ప్రజలకు తెలియజేశారు.

## కూటమి సమావేశానికి బద్వేల్ నుండి భారీగా వెళ్లిన

## తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు




**బద్వేలు** కడపలో గురువారం జరుగుతున్న కూటమి పార్టీల సమావేశానికి బద్వేలు నియోజకవర్గంలోని ఏడు మండలాల నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు బద్వేల్ లో డిసిసి బ్యాంకు చేర్మన్ సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో వెళ్లారు

## బెల్ స్టార్ గోల్డ్ ఫైనాన్స్ షోరూంను

## సందర్శించిన ఎమ్మెల్యే శ్యాంబాబు



**తుగ్గలి:** తుగ్గలి మండల పరిధిలోని పెండేకల్ ఆర్.ఎస్ గ్రామం నందు బుధవారం రోజున నూతనంగా ప్రారంభమైన బెల్ స్టార్ గోల్డ్ ఫైనాన్స్ షోరూంను పత్తికొండ శాసనసభ్యులు కేఈ శ్యాంబాబు గురువారం రోజున సందర్శించి కంపెనీ ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేశారు.బెల్ స్టార్ గోల్డ్ ఫైనాన్స్ షోరూంకు విచ్చేసిన ఎమ్మెల్యే శ్యాంబాబుకు సంస్థ ప్రతినిధులు ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని ఆయన సంస్థ ప్రతినిధులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు,మాజీ సర్పంచ్ మసాలా శీను,డాక్టర్ చంద్ర,ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు,చాంద్ బాషా, సంస్థ ప్రతినిధులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఉమ్రా యాత్రకు బయలుదేరిన

# ప్రయాణికులు

**హైదరాబాద్** ఇస్లామిక్ నూతన సంవత్సరం ను పురస్కరించుకొని అల్ మిజన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో ఉమ్రా యాత్ర చేసుకోవడానికి శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి 53 మంది ప్రయాణికులు బయలుదేరి వెళ్లారు. శంషాబాద్ ఎయిర్పోర్టులో ప్రయాణికుల కుటుంబ సభ్యులు ఘన వీడ్కోలు పలికారు.. అల్ నిజాం టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజర్ మహమ్మద్ ఫవ్వద్ అలీ మాట్లాడుతూ ఇస్లామిక్ నూతన సంవత్సరంలో ప్రయాణికులు మొదటి ఉమ్రా యాత్ర చేసుకోవడం సంతోషకరం అన్నారు.. అల్ మిజన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ మహమ్మద్ ఫయాజ్ అలీ హజ్ యాత్ర లో ఉన్నారని, హజ్ యాత్ర పూర్తి కాగానే ఈ ప్రయాణికులను జిద్దా ఎయిర్పోర్టులో రిసీవ్ చేసుకుని ఈ ప్రయాణికులతో కలిసి ఉమ్రా కూడా నిర్వహించుకుంటారని తెలిపారు.

## నగునూరు గ్రామంలో ఎరువుల గోదామును

## పరిశీలించిన అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే



**కరీంనగర్** జిల్లాలో ఏయే ఎరువులు ఏ డీలర్లకు పంపిణీ చేశారనే వివరాలను తెలుసుకున్నారు. జిల్లాలోని విత్తన కేంద్రాలు, ఎరువుల విక్రయ కేంద్రాలు మరియు ఇప్పటివరకు జరిగిన అమ్మకాల వివరాలను సమగ్రంగా పరిశీలించారు.అలాగే వరి, మొక్కజొన్న మరియు పత్తి విత్తన నిల్వలను గోదాములలో పరిశీలించారు. అనంతరం నగునూరు గ్రామంలోని అగ్రో రైతు సేవా కేంద్రంలో ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చిన వరి విత్తనాలైన బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-1508 మరియు కేఎన్ఎం-1638 వంటి వంగడాలను పరిశీలించారు.వాటి విత్తన నిల్వ వివరాలను, టీఎస్ సీడ్స్ కార్పొరేషన్ ద్వారా సరఫరా చేసిన పెసర మరియు ఇతర విత్తనాల వివరాలను, అలాగే జీలుగజనుము విత్తనాల నాణ్యతను కూడా పరిశీలించారు.తదుపరి అక్కడ ఉన్న రైతులకు పాయింట్ ఆఫ్ సేల్ పిఓ ఎస్ యంత్రం ద్వారా జరిగే అమ్మకాల విధానాన్ని వివరించారు. రైతుల ఆధార్ నమోదు చేసి ఈ-పాస్ యంత్రం ద్వారా అవసరమైన కాంప్లెక్స్ ఎరువులను విక్రయించే ప్రక్రియను వారి సమక్షంలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సంచాలకులు కె. రణధీర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి సత్యం మరియు ఇతర వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

# సన్మానమా... అవమానమా?

**- ప్రతిభ కనబరిచిన గిరిజన విద్యార్థినులకు తీరని అవమానం.**

**- ఒకే శాలువాతో ఇద్దరికి సన్మానం... - వివక్ష ఆరోపణలు.**




**తుగ్గలి:** ప్రతిభను ప్రోత్సహించాల్సిన విద్యా సంస్థలోనే ఇద్దరు గిరిజన విద్యార్థినులు అవమానానికి గురైన ఘటన తుగ్గలి మండలంలోని రాతన గిరిజన ఆశ్రమ పాఠశాలలో చోటుచేసుకుంది. పదో తరగతి ఫలితాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన ఇద్దరు విద్యార్థినులను సన్మానించే కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుల వ్యవహారశైలి విమర్శలకు తావిచ్చింది.పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఇద్దరు విద్యార్థినులకు వేర్వేరుగా గౌరవం ఇవ్వాల్సిన చోట ఒకే శాలువాను ఇద్దరిపై ఒకేసారి కప్పి సన్మానించడం చర్చనీయాంశంగా మారింది. అంతటితో ఆగకుండా ఒక విద్యార్థినికి స్వీట్ బాక్స్ అందించగా, మరో విద్యార్థినికి కేవలం శాలువా మాత్రమే ఇవ్వడం పలువురి ఆగ్రహానికి కారణమైంది.ప్రతిభకు గుర్తింపుగా నిర్వహించిన కార్యక్రమంలోనే విద్యార్థినుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం పై తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.విద్యార్థుల మధ్య ఎలాంటి తేడా లేకుండా సమాన గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత పాఠశాల యాజమాన్యంపై ఉందని పేర్కొంటున్నారు.ఇద్దరు విద్యార్థినులు సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందినవారే కావడంతో ఈ ఘటనపై వివక్ష కోణంలోనూ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి."విద్యార్థులు సాధించిన విజయాన్ని గౌరవించకుండా ఇలా వ్యవహరించడం ఎంతవరకు సమంజసం?" అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.విద్యా సంస్థలు సమానత్వానికి ప్రతీకలుగా నిలవాల్సిన సమయంలో ఇలాంటి ఘటనలు జరగడం బాధాకరమని సామాజిక సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు.ఈ వ్యవహారంపై గిరిజన సంక్షేమ శాఖ అధికారులు వెంటనే విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని,బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు."విద్యార్థుల ప్రతిభను గౌరవించాల్సిన వేదికపై అవమానకర పరిస్థితులు నెలకొనడం అత్యంత విచారకరం.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి" అని ప్రజలు కోరుతున్నారు.

## కెనరా బ్యాంకులో మధ్య దళారులను

# తొలగించాలి

**- బ్యాంకులో రైతుల అప్పులు మధ్య దళారులతో కట్టిస్తే బ్యాంకు సిబ్బందికి ,మేనేజర్ కు వాటా ఎంత ?**

**- రైతు సంఘం డిమాండ్.!**




**కౌతాళం:** కౌతాళం మండల కేంద్రంలో కెనరా బ్యాంకులో రైతుల వ్యవసాయ రుణాలు రెన్యువల్ డబ్బులు చెల్లించడానికి వెళ్ళితే అక్కడ బ్యాంకులో మధ్య దళారులు వాళ్లతో( రైతు తో )కలిసి నీ అప్పు నేను కడతాను అని చెప్పి ,ఆయన అప్పు మధ్య దళారులు కట్టడం వల్ల ,వడ్డీ, మధ్య దళారుల కమిషన్, ఇతర ఖర్చులు అన్నీ కూడా రైతే భరించవలసి ఉంటుంది. కనుక బ్యాంకులో మధ్య దళారులను తొలగించాలని, బ్యాంకులోకి అనుమతించరాదని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కే మల్లయ్య మేనేజర్ కు వినతి పత్రాన్ని అందించారు.. మండలంలో ఆరు బ్యాంకులు ఉన్నా ఏ బ్యాంకుల్లో కూడా కెనరా బ్యాంకులో ఉన్నటువంటి మధ్య దళారుల వ్యవస్థ లేదు. రైతులే నేరుగా బ్యాంకుకు పోయి మేనేజర్ తో మాట్లాడి స్తోమత ఉన్నవాళ్లు అసలు ,వడ్డీ కలిపి కడతారు. స్తోమత లేని వాళ్ళు వడ్డీ మాత్రమే కట్టి రెన్యువల్ చేయించుకుంటారు అలాంటి పద్ధతి కెనరా బ్యాంకులో లేదు. ఇక్కడ మధ్య దళారులకు ,బ్యాంకు సిబ్బందికి ,మేనేజర్ లోపాయికారిగా ఒప్పందాలు చేసుకొని లావాదేవీలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. రైతు అప్పు మధ్య దళారులు కడితే సంవత్సరానికి, సంవత్సరానికి అప్పు పెరుగుతుంది తప్ప , రైతుకు అప్పు సమస్య తీరదు అని ఆయన అన్నారు .కనుక ఇప్పటి నుంచైనా బ్యాంకు బ్యాంకు సిబ్బంది, మేనేజర్ మేల్కొని బ్యాంకులో మద్దతు దారుల వ్యవస్థను రద్దు చేయాలని లేకపోతే రైతులను సమీకరించి బ్యాంకు ముందు ఆందోళన కార్యక్రమాలను చేపట్టగలమని హెచ్చరించరు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి బి ఈరన్న ,రైతు సంఘం నాయకులు సత్యప్ప ,ఈరన్న, వెంకటేష్ ,నారాయణ, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# యూపీలో ఎన్డీయే సరికొత్త వ్యూహాలు

**లక్నో,** ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో సమాజ్ వాదీ పార్టీ ని లక్ష్యంగా చేసుకుని అధికార ఎన్డీయే కూటమి సరికొత్త వ్యూహాలకు తెరలేపింది. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో పార్టీల ఎంపీలు చీలిపోయి ఎన్డీఏకు మద్దతు ప్రకటించడంతో యూపీలోనూ అదే తరహా రాజకీయాలు జరుగుతాయన్న చర్చ ప్రారంభమయింది. యోగి ఆదిత్యనాథ్ క్యాబినెట్‌లో మంత్రి, సుహెల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ అధినేత ఓం ప్రకాష్ రాజ్‌భర్ చేసిన సంచలన వ్యాఖ్యలు యూపీ రాజకీయాల్లో పెను తుఫానును సృష్టించాయి. సమాజ్ వాదీ పార్టీకి చెందిన దాదాపు 21 మంది లోక్‌సభ ఎంపీలు బీజేపీ వైపు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, త్వరలోనే ఎస్పీలో భారీ చీలిక రాబోతోందని ఆయన ప్రకటించారు. యూపీ మంత్రి ఓం ప్రకాష్ రాజ్‌భర్ తన సోషల్ మీడియా వేదికగా ఎస్పీ అగ్రనేత రామ్ గోపాల్ యాదవ్, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ఒక రహస్య లేఖ సమర్పించారని ఆరోపించారు. యూపీని గతంలో కుదిపేసిన మైనింగ్ కుంభకోణం, గోమతి రివర్ ఫ్రంట్ స్కామ్‌ల మాస్టర్‌మైండ్ ఎవరో అందరికీ తెలుసని.. ఇప్పుడు ఆ కేసుల ఉచ్చు గట్టిగా బిగుస్తుండటంతో ఎస్పీ నేతల్లో ఆందోళన మొదలైందని ఆయన పేర్కొన్నారు. దర్యాప్తు సంస్థల భయంతో , నియోజకవర్గాల నిధుల కోసమే స మొత్తం సమాజ్ వాదీ పార్టీ బీజేపీలో చేరేందుకు లోపాయకారీగా లైన్ క్లియర్ చేసుకుంటోందని, అందులో భాగంగానే 21 మందికి పైగా ఎంపీలు టచ్‌లోకి వచ్చారని రాజ్‌భర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంత్రి రాజ్‌భర్ చేసిన ఈ మైండ్ గేమ్‌పై సమాజ్ వాదీ పార్టీ అధినేత, లోక్‌సభ ఎంపీ అఖిలేష్ యాదవ్ అత్యంత ఘాటుగా స్పందించారు. ఇవన్నీ కేవలం ఓటమి భయంతో బీజేపీ ఆడుతున్న చౌకబారు నాటకాలని కొట్టిపారేశారు. లోక్‌సభ ఎన్నికల్లో యూపీ ప్రజలు బీజేపీకి గట్టి బుద్ధి చెప్పారని, ఆ పరాజయాన్ని జీర్ణించుకోలేక ఇటువంటి మైండ్ గేమ్స్ ఆడుతున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం లోక్‌సభలో 37 స్థానాలతో మూడో అతిపెద్ద పార్టీగా అవతరించిన తమ పార్టీ ఎంతో పటిష్టంగా ఉందని, తమ పార్టీ ఎంపీలు ఎవరూ కూడా ప్రలోభాలకు లొంగే ప్రసక్తే లేదని అఖిలేష్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో చీలిక వస్తుందంటూ జరుగుతున్న ప్రచారాన్ని అఖిలేష్ తిప్పికొడుతూ.. రాబోయే 2027 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో తాము కాంగ్రెస్ పార్టీతో కలిసి ఉమ్మడిగానే పోటీ చేస్తామని స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఏ విధంగానైతే మట్టికరిపించామో, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లోనూ అదే ఫార్ములాతో యోగి ప్రభుత్వాన్ని గద్దె దించుతామని పునరుద్ఘాటించారు. ప్రతిపక్షాల మధ్య విభేదాలు సృష్టించి మైలేజ్ పొందాలని చూస్తున్న బీజేపీ పప్పులు ఉమ్మడి యూపీలో ఉడకవని, అసలైన ప్రజా సమస్యలైన నిరుద్యోగం, ఆరోగ్య రంగా పతనంపై మాట్లాడకుండా అధికార పక్షం ఇలాంటి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని ఆరోపించారు. మహారాష్ట్రలో శివసేన కి చెందిన ఎంపీలు షిండే వర్గంలో విలీనం అయ్యారు. రాజ్‌భర్ చేసిన ఈ వ్యాఖ్యలు యూపీ రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. లోక్‌సభలో మేజిక్ ఫిగర్ దాటినప్పటికీ, విపక్షాల బలాన్ని మరింత కుంగదీయాలనే వ్యూహంతో బీజేపీ ఆపరేషన్ లోటస్ ను దేశవ్యాప్తంగా విస్తరిస్తోందనే అనుమానాలు బలపడుతున్నాయి. అయితే, అఖిలేష్ యాదవ్ తన ఎంపీలు, కేడర్‌ను కాపాడుకుంటూ 2027 పోరుకు ఎలా సిద్ధం కాబోతున్నారనేది రాబోయే రోజుల్లో జాతీయ రాజకీయాల సరళిని శాసించనుంది

# పీఓకేలో గో బ్యాక్ పాక్

**న్యూఢిల్లీ** పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్.. దీన్ని ఆక్రమించిన పాకిస్తాన్ .. దీన్ని 'అజాద్ కశ్మీర్'గా పిలుస్తారు. అక్టోబర్ 24, 1947లో ఏర్పడింది. గిల్గిట్ బాల్టిస్తాన్, అజాద్ కశ్మీర్ ను పాక్ ఆక్రమించింది. ఇది 77 ఏళ్లుగా పాకిస్తాన్ కాలనీగా ఉంది. పేరుకు స్వతంత్ర ప్రాంతం.. కానీ పాకిస్తాన్ పాలనలోనే మగ్గింది. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి. వారు భారత్ లో జమ్మూకశ్మీర్ ఎలా మారుతుందో చూస్తున్నారు. 2019 ఆగస్టు 5న ఆర్టికల్ 370 రద్దు తర్వాత పరిస్థితులు కశ్మీర్ లో పరిస్థితులు మారాయి. ఐఐటీలు, ఐఐఎంలు లాంటి 10 అత్యున్నత సంస్థలు వచ్చాయి. రోడ్లు, మౌళిక వసతులు, బాగా వచ్చాయి. భారత్ ఏమో శత్రుదేశంగా చూస్తే కశ్మీరీలకు భారత్ వల్లే మేలు జరిగింది. పాక్ ఆక్రమిత కశ్మీర్ మాత్రం అక్కడ నష్టం జరిగిందని ఇతర దేశాల్లో ఉన్న కశ్మీరీలు గ్రహించి ఇప్పుడు పీఓకే లో ఆందోళనలు చేపడుతున్నారు. ఒకనాడు కేవలం ఆర్థిక డిమాండ్ల వరకే ఉన్నాయి. గత 10 రోజుల ఆందోళనలో ఈరోజు రాజకీయ డిమాండ్ గా మారింది. మా కశ్మీర్ లో మీరు ఎవరు అంటూ పాక్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేశారు. మీ పాక్ సైన్యం ఇక్కడ ఎందుకు అంటూ నినదిస్తున్నారు. పాక్ ఆర్మీ, పాక్ అధికారులు వెళ్లిపోవాలని నినాదాలు చేస్తున్నాడు. ఆడవారు, వేలాది మంది పబ్లిక్ ర్యాలీలు తీస్తున్నారు. మా దేశం వేరు.. మీది వేరు అంటూ మాట్లాడడం మొదలుపెట్టారు. ఉగ్రవాదానికి ఊతం ఇచ్చి పెంచి పోషించిందే పాక్ ఆక్రమిత కశ్మీర్. కానీ ఇవ్వాల హిందుస్తాన్ తో అయినా కలుస్తాం అని అంటున్నారు.

# హర్మూజ్ జలసంధి తెరుచుకుంది...

**న్యూఢిల్లీ** మిడిలీస్ట్‌ను కుదిపేసిన ఇరాన్-అమెరికా యుద్ధానికి ముగింపు దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ యుద్ధ విరమణకు సంబంధించిన అవగాహన ఒప్పందంపై సంతకాలు చేసినట్లు వైట్ హౌస్ ప్రకటించింది. ఈ ఒప్పందంతో ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకోనుంది. అయితే ఒప్పందాన్ని ఇజ్రాయెల్ పూర్తిగా అమలు చేస్తుందా లేదా అన్నదానిపై ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. ఈ ఒప్పందం తర్వాత ఇరాన్ ఒక ప్రకటన చేసింది. శాంతి ఒప్పందంపై చర్చలు పూర్తయ్యాని పేర్కొంది. ఒప్పంద అములుకు ఇది పరీక్ష సమయం అని తెలిపింది. అయితే ఈ రెండు దేశాల మధ్య దాదాపు 14 అంశాలపై రాజీ కుదిరినట్టు తెలుస్తోంది. ఈ 14 అంశాలకు ఏవి అని కూడా తాజాగా అమెరికా ప్రకటించింది. లెబనాన్‌తో పాటు అన్ని వైపులా సైనిక చర్యల నిలిపివేతకు అమెరికా అంగీకరించింది. ఇరాన్-అమెరికా తుది ఒప్పందానికి 60 రోజుల గడువు ఉంటుంది. పరస్పర అంగీకారంతో ఇరు దేశాలు ఈ గడువును పెంచుకోవచ్చు. 30 రోజుల్లో హర్మూజ్ దిగ్బంధనాన్ని పూర్తిగా ఎత్తివేసి, టోల్ లేకుండా ఇరాన్ నౌకలను అనుమతించాలి.. ఇరాన్ పునర్నిర్మాణ కోసం 300 బిలియన్ డాలర్ల నిధి ఏర్పాటు చేస్తారు. అణ్వాయుధాన్ని ఎప్పటికీ తయారు చేయకూడదని ఇరాన్ అంగీకరించింది. అలాగే ఆంక్షలు ఎత్తివేసే వరకు స్వేచ్ఛగా చమురు అమ్ముకునేందుకు అంగీకరించాలని ఇరాన్ కోరింది. అయితే ఈ మొత్తం 14 అంశాల్లో యురేనియం సంబంధించి ఎక్కడా ప్రస్థావన జరగలేనట్టు కనిపిస్తోంది.

# మహిళ వేషంతో

## గాలం వేసిన పురుష పుంగవుడు

**తిరుపతి,** పొత్తూరి మోహన కృష్ణమ నాయుడు. వయస్సు 30 ఏళ్ళు. మదనపల్లిలోని శివాజీ నగర్ లో నివాసం. ఇంటర్ దాకా చదివిన మోహన కృష్ణమ నాయుడు ఆడవేషం ధరించి అందాలు ఆరబోయడంలో దిట్ట. చీర కట్టులోనే కాదు మోడరన్ డ్రెస్సుల్లోనూ మగాళ్ళను ఆకర్షిస్తూ స్త్రీ వేషధారణలో తిరుగుతూ మోసాలకు పాల్పడటమే వృత్తి. మధుశ్రీ అలియాస్ హనీగా హనీ ట్రాప్ చేస్తున్న మోహన కృష్ణమ నాయుడు నమ్మించి మోసం చేసిన వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. మహిళగా వేషం మార్చి మోసాలు చేయడమే కాదు నమ్మే వాళ్ళ ఇళ్లను గుల్ల చేయడంలోనూ దిట్టగా మధు శ్రీ అలియాస్ హనీ నేరాలకు పాల్పడుతూ వచ్చింది. గుప్త నిధులు ఉన్నాయని, ప్రేతాత్మలు ఉన్నాయని భయపెట్టి మోసం చేయడంలో మధుశ్రీ అలియాస్ హనీ రాణించింది. శాంతి పూజలు చేయాలంటూ నమ్మించి మోసాలకు పాల్పడటమే కాకుండా పెళ్లిళ్ల పేరిట లేడీ గెటప్ లో పలువురికి వలపు వేసి పెళ్లి చేసుకుని మోసాలకు పాల్పడింది. కొందరు యువకులను ట్రాప్ చేసి జీవితం బాగుండాలంటే తనలాంటి ఆడ మగ కాని వాళ్ళను పెళ్లి చేసుకోవాలని మాయమాటలు చెప్పి అయిన కాడికి దండుకున్న మోహన కృష్ణ నాయుడు మధుశ్రీ గా మారి మోసాలకు పాల్పడింది.

యువకులను ఆకర్షించి కొందరి చేత తాళి కూడా కట్టించుకున్న మధు శ్రీ అలియాస్ హనీ మాయ లేడిగా చలామణి అయింది. గత కొంతకాలంగా ఇలాంటి మోసాలకు పాల్పడుతున్న మాయలేడి బాధితులు ఇప్పుడు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. మదనపల్లి లోనే పదుల సంఖ్యలో బాధితులు ఉండగా పక్క రాష్ట్రం కర్ణాటకలోనూ మధు శ్రీ అలియాస్ హనీగా మారిన మోహన కృష్ణమ నాయుడిని మోహించిన వారి సంఖ్య నివ్వెర పరుస్తుంది. కొందరు బాధితులు పోలీసులను ఆశ్రయించగా ఈ యవ్వారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇక పడుచు పిల్లగా సింగారించు కోవడమే కాకుండా పెళ్లిళ్లు జరిగే చోట్లకు వెళ్లి దిష్టి తీస్తూ పలువురి దగ్గర అందిన కాడికి దోచుకోవడం లోనూ పొత్తూరి మోహన్ కృష్ణమ నాయుడు ఏ హనీ రాణించింది. మధుశ్రీగా హనీ గా పోలీసులు, రాజకీయ నాయకులకు బాగా తెలిసిన మోహన కృష్ణమ నాయుడు వారితోనూ సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. గత కొద్ది రోజులుగా పలు ఫిర్యాదులు వచ్చినప్పటికీ పోలీసుల తీరుపై విమర్శలు వస్తున్నాయి. తనను మోహించిన వారిని మోసం చేయడమే కాకుండా గుప్తనిధులున్నాయని, తాంత్రిక పూజలు పేరుతోనూ కొందరికి ట్రాప్ చేసిన మధు శ్రీ అలియాస్ హనీ పై ఇప్పటివరకు ఒక్క కేసు నమోదు కాకపోవడం చర్చగా మారింది. కొందరు పోలీసు అధికారుల అండదండలు ఉండడంతోనే మాయలేడి అవతారంలో మాయల మరాఠీగా మోహనకృష్ణమనాయుడు రాణిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఇప్పటి వరకు ఈ వ్యవహారంపై పోలీసు యంత్రాంగం స్పందించక పోవడం చర్చణీయాంశంగా మారింది.

# నేతలు మించిపోతున్న అవినీతి అనకొండలు

**హైదరాబాద్** తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ వరుసగా జరుపుతున్న మెగా దాడులు, అందులో దొరుకుతున్న అక్రమ ఆస్తుల వివరాలు చూసి సామాన్య పౌరుల మైండ్ బ్లాంక్ అవుతోంది. ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి నివాసాలపై జరిగిన దాడుల్లో మంచాల కింద లభించిన కోట్లాది రూపాయల నోట్ల కట్టలు, కిలోల కొద్దీ బంగారం, లగ్జరీ ఫ్లాట్ల డాక్యుమెంట్లు ఒక ఎత్తయితే.. అంతకు వారం ముందే రోడ్లు, భవనాల శాఖ ఇంజనీర్-ఇన్-చీఫ్ మోహన్ నాయక్ నివాసాల్లో రూ. 200 కోట్ల మార్కెట్ విలువైన అక్రమ ఆస్తులు బయటపడటం మరో ఎత్తు. మే నెలలోనే మేడ్చల్ డిప్యూటీ కలెక్టర్ వంశీ మోహన్ ఇళ్లపై జరిగిన దాడుల్లోనూ వంద కోట్ల విలువైన ల్యాండ్ల పత్రాలు దొరికాయి. ఇవన్నీ చూస్తుంటే తెలంగాణలో అవినీతి అనేది ఏదో ఒకరిద్దరు అధికారులకో, ఒక శాఖకో పరిమితం కాలేదని.. వ్యవస్థల్లో ఏ స్థాయిలో వేళ్లూనురుకుపోయిందో స్పష్టమవుతోంది. రాష్ట్రంలోని రెవెన్యూ, రిజిస్ట్రేషన్, టౌన్ ప్లానింగ్, మైనింగ్, ఎక్సైజ్, గృహ నిర్మాణ శాఖల్లో కింది స్థాయి క్లర్క్ నుండి పైస్థాయి డైరెక్టర్ల వరకు ఒక వ్యవస్థీకృత నెట్‌వర్క్ లాగా అవినీతి సాగుతోందని మీడియా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

జీతం కొన్ని వేలలో ఉండే అధికారుల ఇళ్లలో వందల కోట్ల మార్కెట్ విలువైన బినామీ ఆస్తులు, ఓపెన్ ప్లాట్లు, ఫార్మ్‌హౌస్‌లు బయటపడటం దేనికి సంకేతం? ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు హెచ్చరిస్తున్నా క్షేత్రస్థాయిలో లంచాల పర్వం ఆగకపోగా.. అవినీతి తిమింగలాల ఆస్తుల వేగం మాత్రం జెట్ స్పీడ్ తో దూసుకుపోతోంది. ఏసీబీ కేవలం పక్కా సమాచారం ఉన్న కొద్దిమందిపైనే దాడులు చేస్తుంటేనే ఈ స్థాయి సంపద కుప్పలుగా తేలుతోంది. రాష్ట్రంలో ఒకరిద్దరు అధికారులను కాకుండా.. కీలక శాఖల్లో ఉన్న క్లాస్-1, క్లాస్-2 గ్రేడ్ అధికారులందరిపై ఆపరేషన్ క్లీన్-అప్ తరహాలో ఏకకాలంలో రాష్ట్రవ్యాప్త తనిఖీలు నిర్వహిస్తే ఎలా ఉంటుంది? అనుమానితులైన ప్రతి ఉన్నతాధికారి సంపాదనను, వారి బినామీల నెట్‌వర్క్‌ను జల్లెడ పట్టి ఆస్తులన్నీ లెక్కతేల్చి, వాటిని గనుక ప్రభుత్వం జప్తు చేస్తే.. అక్షరాలా తెలంగాణ రాష్ట్ర వార్షిక బడ్జెట్ కు సమానమైన నిధులు ఒకే ఏడాదిలో సమకూరడం ఖాయమని లెక్కలు వేస్తున్నారు. అంతలా ప్రజాధనం అక్రమార్కుల లాకర్లలో మూలుగుతోంది. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం నిధుల కొరతతో, ప్రాజెక్టుల రుణాల బదిలీల కోసం ఢిల్లీ చుట్టూ తిరుగుతుంటే.. మరోవైపు రాష్ట్రంలోనే కొంతమంది అధికారులు సమాంతర ఆర్థిక వ్యవస్థను నడుపుతున్నారు. ఈ డిజిటల్ యుగంలో బినామీల పేరిట స్థిరాస్తులు కొనడం, హవాలా మార్గాల్లో పెట్టుబడులు పెట్టడం పెరిగిపోయింది. ప్రభుత్వం కేవలం సంప్రదాయ ఏసీబీ దాడులకే పరిమితం కాకుండా.. ఆధునిక టెక్నాలజీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ , ఐటీ శాఖల సమన్వయంతో వ్యవస్థాగత శస్త్రచికిత్స చేయాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ అవినీతి తిమింగలాల గొంతు నొక్కి, అక్రమ ఆస్తులను ప్రజా సంక్షేమానికి మళ్లిస్తేనే.. తెలంగాణ సమాజానికి అసలైన ఆర్థిక స్వాతంత్రం లభిస్తుందని అనుకోవచ్చు.

### రెండు సంవత్సరాలు.. 441 కేసులు..

కేవలం రెండు సంవత్సరాలు.. 441 కేసులు.. ఇదేదో పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ లో నమోదు చేసిన కేసులు కాదు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై నమోదు చేసిన కేసులు కాదు. తెలంగాణలో ఏసీబీ ఆఫీసర్లు కరప్షన్ కు పాల్పడుతున్న అధికారుల మీద నమోదు చేసిన కేసులు. పైగా వీరిలో చాలామంది లంచం తీసుకుంటూ దొరికిపోయారు. అవినీతి నిరోధక శాఖ అధికారులు లంచం తీసుకుంటే ట్రాప్ చేస్తున్నారు. అక్రమంగా ఆస్తులను కూడ పెడితే రైడ్ చేస్తున్నారు. 2024 నుంచి ఇప్పటివరకు ఏకంగా 441 కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇంత స్థాయిలో కేసులు నమోదు చేస్తున్నప్పటికీ అవినీతి అధికారులు తమ ధోరణి మార్చుకోవడం లేదు. ఇటీవల కాలంలో డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న రాము నాయక్ అనే అధికారిని ప్రభుత్వం డిస్మిస్ చేసింది. అతడు ఏకంగా ప్రభుత్వ భూములను ఇతర వ్యక్తులకు అక్రమంగా పట్టా చేయించాడు. దీనికోసం భారీగా లంచం తీసుకున్నాడు. ఇటీవల మోహన్ నాయక్ అనే అధికారి 100 కోట్లకు పైగా ఆస్తులను కూడబెట్టిన నేపథ్యంలో.. అతని మీద కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అవినీతి అధికారుల మీద ఏసీబీ అధికారులు చర్యలు తీసుకుంటున్నప్పటికీ వారి ప్రవర్తన మారడం లేదు. ఇటీవల కాలంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సింహులపేట మండలంలో ఒక ఎంపీడీవో, ఎంపీవో లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పకడ్బందీగా పట్టుకున్నారు. పైగా ఆ మహిళా అధికారి తన కుమారుడిని కూడా వసూళ్లకు ప్రత్యేకంగా నియమించుకోవడం విశేషం. ఏసీబీ అధికారుల తనిఖీలు ఆ ఎంపీడీవో, ఎంపీవో పట్టుబడిన నేపథ్యంలో.. అక్కడి ప్రజలు పటాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. అవినీతి అధికారులు రోజురోజుకు ప్రజల మీద పడి దోచుకుంటున్నారు. ఏదైనా పని ఉందని వెళ్తే.. మొహమాటం లేకుండా ఏమిస్తామని అడుగుతున్నారు. తాజాగా ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి ఇంట్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. అతడికి ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయని అధికారులు గుర్తించారు. పాతబస్తీలోని ఛత్రినాక ప్రాంతంలో అతడి నివాసం.. కార్యాలయం.. బంధువుల గృహాలలో తనిఖీలు చేపట్టారు. నరహరి ఇంట్లో ఏకంగా 1.10 కోట్ల నగదును గుర్తించారు. ఇవే కాక బంగారు ఆభరణాలు.. ఇతర రికార్డులను కూడా స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ నగరంలోని అత్యంత ఖరీదైన ప్రాంతాలలో అతడికి ఓపెన్ ప్లాట్లు ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో వ్యవసాయ భూమి ఉంది. బహిరంగ మార్కెట్లో వీటి విలువ వందల కోట్లు ఉంటుందని తెలుస్తోంది. ఇటీవల కాలంలో పెద్దపెద్ద ఆఫీసర్లను ఏసీబీ అధికారులు ట్రాప్ చేసి పట్టుకుంటున్నప్పటికీ. అవినీతి అధికారులు తమ ధోరణి మార్చుకోవడం లేదు.

# రికార్డు స్థాయి వరి దిగుబడి

## తెలంగాణలో సన్న బియ్యానికి రెక్కలు

**హైదరాబాద్,** దేశంలోనే అత్యధిక ధాన్యం ఉత్పత్తి సాధించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచినప్పటికీ.. మార్కెట్‌లో సన్న బియ్యం ధరలు మాత్రం ఒక్కసారిగా ఆకాశాన్ని తాకాయి. మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులు సన్న బియ్యం నిల్వలను అక్రమంగా దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టించడమే దీనికి ప్రధాన కారణం. గత 10 రోజుల్లోనే కిలోకు రూ. 5 నుంచి రూ. 7 వరకు ధరలు పెరిగాయి.

ముఖ్యంగా డిమాండ్ ఉన్న రెండేళ్ల నాటి పాత బియ్యాన్ని తక్కువ పరిమాణంలో మార్కెట్లోకి వదులుతూ వ్యాపారులు సామాన్య, మధ్యతరగతి వినియోగదా రులను నిలువునా దోచుకుంటున్నారు. దేశంలోనే అత్యధికంగా ధాన్యం పండిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. కానీ ఈ రికార్డు స్థాయి దిగుబడులు స్థానిక వినియోగదారులకు మాత్రం ఎలాంటి ఉపశమనాన్ని ఇవ్వడం లేదు.

ఓ పక్క రాష్ట్రంలో పండించిన సన్న వడ్ల నిల్వలు పుష్కలంగా ఉన్నప్పటికీ.. ఓపెన్ మార్కెట్లో మాత్రం సన్న బియ్యం ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కొంతమంది రైస్ మిల్లర్లు, పెద్ద ఎత్తున వ్యాపారం చేసే హోల్‌సేలర్లు కుమ్మక్కై మార్కెట్లో సన్న బియ్యానికి కృత్రిమ కొరత సృష్టించడమే దీనికి ప్రధాన కారణం. ఈ అక్రమ నిల్వలు, సిండికేట్ దందా కారణంగా సామాన్య, మధ్యతరగతి ప్రజల బడ్జెట్ తలకిందులవుతోంది. ట్రేడర్లు, రిటైల్ వ్యాపారుల చెప్పిన వివరాల ప్రకారం.. గత 10 రోజుల్లోనే వివిధ రకాల సన్న బియ్యం ధరలు కిలోకు రూ. 5 నుంచి రూ. 7 వరకు పెరిగాయి. మధ్యతరగతి ఇళ్లల్లో ఎక్కువగా ఉపయోగించే సాంబ మసూరి రకం ధర నిన్నమొన్నటి వరకు కిలో రూ. 62 ఉండగా..

అది ఇప్పుడు ఏకంగా రూ. 68 కి చేరింది. మార్కెట్లో అత్యధిక డిమాండ్ ఉన్న రెండేళ్ల నాటి పాత బియ్యం నిల్వలను మిల్లర్లు గోడౌన్లలోనే తొక్కిపెట్టారని, వాటిని హోల్‌సేల్ డీలర్లు, రిటైల్ ఏజెంట్ల ద్వారా అత్యధిక ధరలకు విక్రయిస్తూ భారీగా లాభాలు గడిస్తున్నారని తెలుస్తోంది. డిమాండ్ ఎక్కువగా ఉన్న రకాలను మాత్రమే టార్గెట్ చేసి ఈ కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఏటా దాదాపు 60 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యాన్ని ప్రభుత్వం, వివిధ సంస్థలు సేకరిస్తున్నాయి.

దీనికి అదనంగా మరో 10 లక్షల మెట్రిక్ టన్నుల నాణ్యమైన సన్న వడ్లను మిల్లర్లు నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. మొత్తంగా చూస్తే.. రాష్ట్రంలో ప్రతి ఏటా సుమారు 70 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం ఉత్పత్తి అవుతోంది.

ఇంత భారీ స్థాయిలో ఉత్పత్తి జరుగుతున్నప్పటికీ మార్కెట్లో కొరత ఏర్పడటం వెనుక పెద్ద స్కామ్ ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పౌరసరఫరాల శాఖ అధికారులు చెప్పిన వివరాల ప్రకారం.. పేద, దిగువ మధ్యతరగతి వర్గాల నుంచి సంపన్నుల వరకు అందరూ రోజువారీ ఆహార అవసరాల కోసం సన్న బియ్యాన్నే ఇష్టపడుతుండటంతో వీటికి డిమాండ్ విపరీతంగా పెరిగింది.

ముఖ్యంగా కర్నూలు, నిజామాబాద్, బాపట్ల, కరీంనగర్ జిల్లాల సోనామసూరి రకాలకు మార్కెట్లో విపరీతమైన క్రేజ్ ఉంది. సన్న బియ్యం పోషక విలువలతో కూడిన ముఖ్యమైన ఆహారం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం వైట్ రేషన్ కార్డు కలిగిన పేద కుటుంబాలకు రేషన్ దుకాణాల ద్వారా సబ్సిడీ ధరలకే సరఫరా చేస్తుంది. దీంతో బహిరంగ మార్కెట్లో సన్న బియ్యానికి డిమాండ్ మరింత పెరిగింది.

ఈ మార్కెట్ డిమాండ్‌ను కొందరు మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు.

నిల్వలను బ్లాక్ చేసి, మార్కెట్లోకి తగినంత స్టాక్ రాకుండా అడ్డుకుంటున్నారు. బియ్యం ధరల నియంత్రణకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని.. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలతో రైస్ మిల్లులపై దాడులు నిర్వహించాలని వినియోగ దారులు డిమాండ్ చేస్తున్నారు.

## ఎస్సీ బాలికల హాస్టల్‌లో

# నీటి పైపుకు లీకేజీ

**కళ్యాణదుర్గం** కళ్యాణదుర్గం కేంద్రంలోని దొడగట్ట రోడ్ లోని ఎస్సీ బాలికల హాస్టల్. ఈ హాస్టల్ ప్రాంగణంలో సత్యసాయి నీటి సరఫరా పైప్ లైన్ కు లీకేజీ పడింది. పదిరోజులుగా నీటి ప్రవాహం కొనసాగుతుంది. సెలవుల అనంతరం హాస్టల్ కి విద్యార్థినులు వచ్చేశారు. ఈ నీటి ప్రవాహం లోనే విద్యార్థులు నడవాల్సివస్తుంది. నీటి నిల్వ కారణంగా దోమలు ఎక్కువవుతున్నాయి. ఆన్పైప్ లైన్లు మరమ్మతులు చేసినా ఫ్రెజర్ కారణంగా పూర్తి స్థాయిలో ఆగిపోలేదని హాస్టల్ వార్డెన్ అంటున్నారు. సత్యసాయి నీటి సరఫరా ఇంజనీర్లు చొరవ తీసుకొని యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇక్కడి పరిసర ప్రాంతం లోని నివాస గృహాల వారు హాస్టల్ బయట ప్రధాన ద్వారం ముందరే చెత్త కుప్ప వేస్తున్నారు.

దీని మూలంగా విద్యార్థులు అనారోగ్యం బారినపడే అవకాశం ఉంది. మున్సిపాలిటీ అధికారులు చొరవ తీసుకుని చెత్త కుండీ మరో చోటకు మార్చాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# గోశాలలో వృద్ధుడి హత్య

**కృష్ణా జిల్లా** కంకిపాడు మండలం గోశాల గ్రామంలో ఒక స్థలం వివాదంలో మామను అల్లుడు హత్య చేసాడు. అల్లుడు మామ ఛాతి పై దాడి చేసాడు. ఘటనలో గోశాల కు చెందిన ఉప్పల సాంబశివరావు(65) ఘటనా స్థలంలోని మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# గులాబీ ఓవర్ కాన్ఫిడెన్సేనా...

**హైదరాబాద్** తెలంగాణలో బీఆర్ఎస్ తన ఓట్ల శాతాన్ని కాపాడుకునే ప్రయత్నం మొదలు పెట్టింది. గత ఎన్నికల్లో వచ్చిన ఓట్ల శాతం కంటే పెంచుకునేందుకు అవసరమైన వ్యూహాలను రచిస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో పాటు తమకు అనకూల ఓటు పెరుగుతుందని గులాబీ పార్టీ నేతలు భావిస్తున్నారు. ఎవరు అవునన్నా కాదన్నా బీఆర్ఎస్ తెలంగాణలో క్షేత్రస్థాయిలో బలంగా ఉంది. మరొకవైపు బీజేపీ బలపడుతుంది. బీజేపీ తమ ఓటు బ్యాంకును చీల్చకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే కాంగ్రెస్ పై వ్యతిరేక ఓటును తాము రాబట్టుకునే ప్రయత్నంలో కారు పార్టీ ఉంది. పార్టీ అగ్రనేత కేసీఆర్ సూచనల మేరకు కీలక నేతలు ఇప్పటికే ఆ పనిలో నిమగ్నమయ్యారు. సహజంగా ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ ఖచ్చితంగా అంతో ఇంతో వ్యతిరేకత ఉంటుంది. పాజిటివిటీ కంటే నెగిటివిటీ ఓటు ఎక్కువగా ఉంటుంది. అందుకు కాంగ్రెస్ కూడా మినహాయింపు కాదు. ఎందుకంటే గతంలో బీఆర్ఎస్ రెండు దఫాల తర్వాత వచ్చిన వ్యతిరేకతతోనే కాంగ్రెస్ మొన్నటి ఎన్నికల్లో విజయం సాధించింది. అయితే ఎప్పుడూ పదేళ్లు ఒకే పార్టీ ఉంటుందని అనుకోవడం కేవలం గణాంకాల కోసమే. ప్రాక్టికల్ గా కుదరదు. మరొకవైపు అధికారంలో ఉన్న కాంగ్రెస్ కు బీజేపీ నుంచి కూడా ప్రమాదం పొంచి ఉంది. బీజేపీ ఎంత బలపడితే అంత కాంగ్రెస్ కే నష్టమన్న అంచనాలు కూడా బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఎటు వెళుతుందన్నది పక్కన పెడితే మూడు పార్టీలు బలంగా ఓట్లు చీల్చుకుంటే అది తమకే లాభమని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. తమకు ఇప్పటికే క్షేత్రస్థాయిలో వస్తున్న మద్దతు అందుకు ఉదాహరణ అని చెబుతున్నారు. ప్రస్తుతానికి కేటీఆర్, హరీశ్ రావులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఇటు క్యాడర్ తో పాటు ఓటు బ్యాంకును కూడా రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో తమ పాలనకు, ప్రస్తుత పాలనకు బేరీజు వేసుకుంటే తామే ఎక్కువ ఓట్లు సాధిస్తామని గులాబీ పార్టీ నేతలు అంచనాలు వేసుకుంటున్నారు. గత ఎన్నికల్లోనూ అనేక నియోజకవర్గాల్లో స్వల్ప మెజారిటీతో ఓటమి పాలయిన విషయాన్ని వారు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. అందుకే బీఆర్ఎస్ ఈసారి ఎన్నికల్లో తమకు అధికారం గ్యారంటీ అన్న ధీమాతో ఉంది. మరి చివరకు ఓటర్లు ఎలా తీర్పు చెబుతారన్నది చూడాల్సి ఉంది.

## బొమ్మకల్ పంచాయతీ

# వినూత్న తీర్మానం

### - ప్రభుత్వ స్కూల్లో పిల్లలను చేర్పిస్తే ఇంటి పన్ను, నల్లా బిల్లు పూర్తిగా మాఫీ

**కరీంనగర్,** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి, వాటిని బలోపేతం చేసేందుకు కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం బొమ్మకల్ గ్రామ పంచాయతీ ఒక వినూత్న నిర్ణయం తీసుకుంది. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక లేదా ఉన్నత పాఠశాలలో తమ పిల్లలను చేర్పించే తల్లిదండ్రులకు ఇంటి పన్ను, నల్లా బిల్లుల నుంచి పూర్తి మినహాయింపు ఇస్తున్నట్లు ప్రకటించింది. సర్పంచ్ వేముల శ్రీకాంత్ నేతృత్వంలోని పాలకవర్గం ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేసింది.

ఈ ఆఫర్ ప్రస్తుత పాలకవర్గ పదవీకాలం ముగిసే వరకు వర్తిస్తుందని స్పష్టం చేసింది. ప్రభుత్వ పాఠశాలల మనుగడను కాపాడుకునేందుకు, ప్రైవేటు పాఠశాలల మోజులో పడి సర్కారు బడులను నిర్లక్ష్యం చేస్తున్న తల్లిదండ్రుల్లో మార్పు తెచ్చేందుకు ఒక గ్రామ పంచాయతీ దేశంలోనే ఎక్కడా లేని విధంగా విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం బొమ్మకల్ గ్రామ పంచాయతీ పాలకవర్గం ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడమే ఏకైక లక్ష్యంగా ఒక అద్భుతమైన ఆఫర్ ప్రకటించింది. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించే తల్లిదండ్రులకు, ఆయా ఇళ్లకు సంబంధించిన వార్షిక ఇంటి పన్ను, నల్లా బిల్లులను పూర్తిగా మాఫీ చేస్తామని ప్రకటన చేసింది. ప్రస్తుతం బొమ్మకల్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 62 మంది విద్యార్థులుండగా.. ఉన్నత పాఠశాలలో ఆ సంఖ్య కేవలం 23కి పడిపోయింది.

ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఉపాధ్యాయుల కొరతతో పాటు, భవిష్యత్తులో స్కూల్ పూర్తిగా మూతపడే ప్రమాదం ఉందని గ్రామస్తులు, అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ఎలాగైనా హైస్కూల్‌లో విద్యార్థుల సంఖ్యను భారీగా పెంచాలనే ఉద్దేశంతో గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచి వేముల శ్రీకాంత్ అధ్యక్షతన ఆరుగురు వార్డు సభ్యులు అత్యవసర ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించిన అనంతరం.. ప్రభుత్వ బడికి పిల్లలను పంపే కుటుంబాలకు ఆర్థిక ఉపశమనం కలిగిస్తూ పన్నులు మాఫీ చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ ప్రత్యేక రాయితీ ప్రస్తుత పంచాయతీ పాలకవర్గం పదవీ కాలం పూర్తయ్యే వరకు వర్తిస్తుందని సర్పంచ్ వేముల శ్రీకాంత్ స్పష్టం చేశారు.

గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లేదా ఉన్నత పాఠశాల.. ఈ రెండింటిలో ఏ బడిలో పిల్లలను చేర్చినప్పటికీ ఆయా కుటుంబాల ఇంటి పన్ను, నల్లా బిల్లుల రద్దు వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. కేవలం పన్నుల మినహాయింపు మాత్రమే కాకుండా.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కుటుంబాలకు భవిష్యత్తులో గ్రామ పరిధిలో అమలు చేసే వివిధ సంక్షేమ పథకాలలో సైతం మొదటి ప్రాధాన్యత కల్పించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు పాలకవర్గం వెల్లడించింది. గ్రామ పంచాయతీ తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయానికి క్షేత్రస్థాయిలో, సోషల్ మీడియా వేదికగా అద్భుతమైన స్పందన లభిస్తోంది.

ప్రస్తుతం కొనసాగుతున్న బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, పంచాయతీ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి ఈ పన్నుల మాఫీ పథకం గురించి వివరిస్తున్నారు. ఈ వినూత్న ఆఫర్ ప్రకటించిన అతి తక్కువ సమయంలోనే ఇప్పటికే 12 మందికి పైగా విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలో కొత్తగా అడ్మిషన్లు పొందడం విశేషం. మరికొందరు తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను చేర్పించేందుకు ఉత్సాహం చూపుతున్నారు. విద్యా వ్యవస్థను రక్షించుకోవడానికి గ్రామీణ స్థాయిలో తీసుకున్న ఈ వినూత్న నిర్ణయం ప్రస్తుతం కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారడమే కాక.. రాష్ట్రంలోని ఇతర గ్రామాలకు రోల్ మోడల్‌గా నిలుస్తోందని విద్యావేత్తలు ప్రశంసిస్తున్నారు.

# ‘ థాంక్యూ సుబ్బారావు’ మూవీ రిలీజ్!





క్రైమ్ థ్రిల్లర్ జోనర్లో నిర్మితమైన ఒక తెలుగు సినిమా నేరుగా ఓటీటీ ఫ్లాట్ ఫామ్ పైకి వచ్చింది. ఆ సినిమా పేరే ‘ థాంక్యూ సుబ్బారావు’. చంద్రహాస్ కోట్ల – లావణ్య సాహుకార జంటగా నటించిన ఈ సినిమాకి చెందు ముద్దు దర్శకత్వం వహించాడు.’ఓ పిట్టకథ’ సినిమాతో దర్శకుడిగా తన మార్క్ చూపించిన సంగతి తెలిసిందే. దినేశ్ కుర్ర నిర్మించిన ఈ సినిమా, ఈ రోజు (జూన్ 18వ తేదీ) నుంచి ‘ఆహా’ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది.

సుబ్బారావు (చంద్రహాస్) తన తండ్రి చేసిన అప్పులు తీర్చడం కోసం, ఏదైనా పని వెతుక్కోవాలని అనుకుంటాడు. కేరళలో ఉన్న స్నేహితుడు ‘పండు’ రమ్మనడంతో అక్కడికి వెళతాడు. స్నేహితుడితో కలిసి ‘బోట్ హౌస్’లో ఉంటూ, టాక్సీ డ్రైవర్ గా పనిచేస్తుంటాడు. అదే సమయంలో ఒక బిజినెస్ డీల్ పై అమెరికా నుంచి ‘వైష్ణవి’ (లావణ్య) వస్తుంది. నెల రోజుల పాటు తిరగడం కోసం ఆమె సుబ్బారావు టాక్సీని మాట్లాడుకుంటుంది. వైష్ణవితో కలిసి తిరుగుతూ ఉండటంతో సుబ్బారావుకి రోజులు చాలా అందంగా గడిచిపోతున్నట్టుగా అనిపిస్తుంది. ఆమె ఎంతో కలుపుగోలుగా మాట్లాడుతూ ఉండటంతో, తనని ఆమె లవ్ చేస్తుందేమోనని సుబ్బారావు భావిస్తాడు. తానే ప్రపోజ్ చేయడం మంచిదని భావిస్తాడు. అయితే అదే సమయంలో అమెరికా నుంచి ‘రోహిత్’ దిగిపోతాడు. అతను .. వైష్ణవి పెళ్లి చేసుకోబోతున్నారనే విషయం తెలిసి, సుబ్బారావు దిగాలుపడిపోతాడు.ఒక రోజున ట్రైన్ రన్నింగ్ లో ఉండగా, ఓ నలుగురు కుర్రాళ్లు ఒక అమ్మాయిని అందులో నుంచి తోసేయడానికి ప్రయత్నించే దృశ్యం వైష్ణవి సెల్ ఫోన్ కి చిక్కుతుంది. దాంతో ఆమె ఆ అమ్మాయి ఎవరు? ఆ కుర్రాళ్లు ఎవరు? ఆ అమ్మాయిని వాళ్లు ఏం చేసి ఉంటారు? అనేది తెలుసుకోవాలని వైష్ణవి నిర్ణయించుకుంటుంది. అందుకోసం ఆమె ఏం చేస్తుంది? పర్యవసానంగా ఎలాంటి పరిణామాలను ఎందుర్కుంటుంది? అనేది మిగతా కథ.

అమెరికా నుంచి బిజినెస్ పనిపై వచ్చిన వైష్ణవి, రన్నింగ్ ట్రైన్ లో నలుగురు దుర్మార్గుల కారణంగా ఒక యువతి ప్రమాదంలో ఉండటం గమనిస్తుంది. ఆ యువతి ఆచూకీ తెలుసుకుని ఆమెకి న్యాయం జరిగేలా చేయాలనుకుంటుంది. అందుకోసం తన బిజినెస్ పనులను సైతం పక్కన పెడుతుంది. ఈ విషయంలో ఆమెకి ఒక టాక్సీ డ్రైవర్ ఎలా సహాయం చేస్తాడు? ఆమె ప్రయత్నం ఫలిస్తుందా లేదా? అనేదే ఈ కథలోని ప్రధానమైన అంశం. ఈ కథ ‘కేరళ’లో జరుగుతుంటుంది. ఎంగేజ్ మెంట్ జరుపుకున్న వైష్ణవి – రోహిత్, కేరళలో హోటల్ బిజినెస్ చేయడానికి తగిన అనుమతుల కోసం ట్రై చేస్తుండటం .. వాళ్లకి టాక్సీ డ్రైవర్ గా కుదిరిన సుబ్బారావు, వైష్ణవిని ఆరాధిస్తూ ఉండటం .. ప్రమాదంలో పడిన ఒక యువతిని రక్షించడం రంగంలోకి దిగిన వైష్ణవి, రోహిత్ ను – సుబ్బారావును సాయం కోరడం అనే ఈ మూడు కోణాలలో ఈ కథ ముందుకు వెళు తుంటుంది. సుబ్బారావు కేరళ చేరుకోవడం .. అమెరికా నుంచి వైష్ణవి రావడం .. ఇద్దరి మధ్య పరిచయం తాలూకు సన్నివేశాలతో ఈ కథ అలరిస్తూ వెళుతుంది. ఎప్పుడైతే వైష్ణవికి కాబోయే భర్తగా రోహిత్ ఎంట్రీ ఇచ్చాడో అప్పటి నుంచి కథ మరింత ఊపందుకుంటుంది. వైష్ణవి ముందు సుబ్బారావును అవమానించడానికి రోహిత్ ట్రై చేయడం, అతణ్ణి ఉడికించడానికి సుబ్బారావు ప్రయత్నించడం వంటి సన్నివేశాలతో లవ్ కి కాస్త కామెడీ కనెక్ట్ అవుతుంది. ఇక ఎప్పుడైతే ట్రైన్ లో ఒక ఆడపిల్లను వేధిస్తున్న రౌడీ గ్యాంగ్ ను వైష్ణవి చూసిందో .. ఆ విషయాన్ని గురించి ఆరాతీయడానికి రంగంలోకి దిగుతుందో అప్పటి నుంచి కథ మరో మలుపు తీసుకుంటుంది. ట్రైన్ లో వేధింపులకు గురైన ఆ యువతి ఎవరు? ఆమెను వేధించిన పోకిరీలు ఎవరు? అనే కోణంలో చకచకా సన్నివేశాలను మార్చుకుంటూ ఈ కథ పరుగులు తీస్తుంది. లవ్ .. కామెడీ .. క్రైమ్ ను టచ్ చేస్తూ సాగే ఈ కంటెంట్ ఫరవాలేదని పిస్తుంది.మూడు ప్రధానమైన పాత్రల చుట్టూ దర్శకుడు ఈ కథను నడిపించాడు. కథలో పెద్దగా కొత్తదనం లేకపోయినా, ట్రీట్మెంట్ బాగుంటుంది. అయితే లవ్ ట్రాక్ విషయంలో ఆడియన్స్ గెస్ చేసినట్టుగానే కథ వెళ్లడమే ప్రధానమైన లోపంగా అనిపిస్తుంది. కేరళలోని సన్నివేశాలు ఈ కథకు అదనపు ఆకర్షణగా నిలిస్తే, క్లైమాక్స్ లో వచ్చే ట్విస్ట్ ఈ కథకి మరింత బలాన్ని చేకూర్చుతుంది. ప్రధానమైన పాత్రలను పోషించిన ముగ్గురు ఆర్టిస్టులు తమ పాత్రలకి న్యాయం చేశారు. హీరో చంద్రహాస్ ను చూస్తుంటే, చాలావరకూ RX 100’ హీరో కార్తికేయ పోలికలు కనిపిస్తాయి. బాడీ లాంగ్వేజ్ కూడా దాదాపుగా అలాగే అనిపిస్తుంది. పంకజ్ తొత్తాడ ఫొటోగ్రఫీ .. ప్రిన్స్ హెన్రి సంగీతం .. వెంకట్ ప్రభు ఎడిటింగ్ ఫరవాలేదు. చిన్న సినిమానే అయినా, ఒక పెర్ఫెక్ట్ అవుట్ పుట్ తో వచ్చిన కంటెంట్ గా చెప్పుకోవచ్చు.

## దేశ విభజన నేపథ్యంలో
# సన్నీ డియోల్ ‘బట్వారా 1947’




బాలీవుడ్ యాక్షన్ స్టార్ సన్నీ డియోల్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ హిస్టారికల్ డ్రామా ‘బట్వారా 1947’ (దీఫ్ఝుతీఝ 1947) నుంచి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. తాజాగా ఈ సినిమా నుంచి టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. దేశ విభజన నాటి భయానక పరిస్థితులు, ద్వేషం మధ్య ఒక వ్యక్తి చూపించిన అసాధారణ ధైర్యం నేపథ్యంలో సాగే భావోద్వేగభరిత చిత్రంగా ఈ చిత్రం రాబోతున్నట్లు టీజర్‌ను చూస్తే అర్థమవుతుంది. ఇక ఈ చిత్రాన్ని స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా 2026, ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. గతంలో ‘ఘాయల్’, ‘దామిని’, ‘ఘాతక్’ వంటి ఇండస్ట్రీ హిట్లను అందించిన స్టార్ డైరెక్టర్ రాజ్‌కుమార్ సంతోషి, సన్నీ డియోల్ కాంబినేషన్‌లో చాలా ఏళ్ల తర్వాత వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను మిస్టర్ పర్ఫెక్ట్ ఆమిర్ ఖాన్ తన ‘ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్’ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండటం విశేషం. ఈ చిత్రంలో సన్నీ డియోల్ సరసన సీనియర్ స్టార్ హీరోయిన్ ప్రీతి జింతా నటిస్తుండగా, శబానా అజ్మీ, అలీ ఫజల్, కరణ్ డియోల్, కనికా కపూర్, సర్గమ్ సింగ్, ఖుషీ హాజారే కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ గ్రహీత ఎ.ఆర్. రెహమాన్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు.

# లంకా దహనం సీత చేస్తే..



అలియాభట్, శార్వరి వాఘ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఫిమేల్ ఓరియెంటెడ్ స్పైథ్రిల్లర్ ‘ఆల్ఫా’ సినిమా ట్రైలర్‌ను బుధవారం విడుదల చేశారు. యశ్‌రాజ్ ఫిల్మ్ స్పై యూనివర్స్‌లో భాగంగా ఈ సినిమా రానుంది. ఇందులో అలియాభట్ గూఢచారి పాత్రలో కనిపించనుంది. దేశానికి వ్యతిరేకంగా ‘ఆల్ఫా’ పేరుతో ప్రతినాయకుడు నడిపే మిషన్‌ను అడ్డుకోవడమే లక్ష్యంగా అలియాభట్ బృందం చేసిన సాహసాలు ఏమిటన్నదే ఈ సినిమా ఇతివృత్తం. హై ఇంటెన్సిటీ యాక్షన్‌తో ట్రైలర్ ఆద్యంతం థ్రిల్‌ని పంచింది. బాబీడియోల్ క్రూరుడైన విలన్ పాత్రలో కనిపించాడు. ‘సీత లంకాదహనం చేస్తే ఎలా ఉంటుందో చూడాలనుకుంటున్నారా’ అంటూ అలియాభట్ చెప్పిన డైలాగ్ ట్రైలర్‌లో హైలైట్‌గా నిలిచింది. ఆదిత్యచోప్రా నిర్మాణంలో శివ్ రవాలీ దర్శకత్వం వహించిన ఈ సినిమా జూలై 3న ప్రేక్షకుల ముందుకురానుంది.

# ‘దృశ్యం 3’ తెలుగు ఓటీటీ రిలీజ్‌కు బ్రేక్..



మోహన్‌లాల్ నటించిన ‘దృశ్యం 3’ తెలుగు డబ్బింగ్ వెర్షన్‌కు ఓటీటీలో విడుదలకు అడ్డంకులు ఎదురయ్యాయి. తెలుగు హక్కులపై వివాదం తలెత్తడంతో మద్రాస్ హైకోర్టు తాత్కాలికంగా విడుదలను నిలిపివేసింది.తెలుగులో ‘దృశ్యం’ తొలి భాగాన్ని తెరకెక్కించిన దర్శకురాలు శ్రీప్రియ, ఆమె సంస్థ రాజ్‌కుమార్ థియేటర్ ప్రైవేట్ లిమిటెడ్ కోర్టును ఆశ్రయించాయి. ‘దృశ్యం’ ఫ్రాంచైజీ తెలుగు హక్కులు తమ వద్ద ఉన్నాయని, మూడో భాగాన్ని డబ్బింగ్ రూపంలో విడుదల చేయడం సరికాదని పిటిషన్‌లో పేర్కొన్నాయి. ఈ వాదనలను పరిశీలించిన కోర్టు, తదుపరి విచారణ వరకు తెలుగు డబ్బింగ్ వెర్షన్‌ను ఓటీటీలో విడుదల చేయవద్దని ఆదేశించింది. దీంతో జూన్ 18 నుంచి స్ట్రీమ్ రావాల్సిన తెలుగు వెర్షన్‌కు తాత్కాలికంగా బ్రేక్ పడింది.గతంలో ‘దృశ్యం’, ‘దృశ్యం 2’ సినిమాలు వెంకటేశ్ హీరోగా తెలుగులో రీమేక్ అయ్యాయి. అయితే మూడో భాగాన్ని రీమేక్ చేయకుండా నేరుగా డబ్బింగ్ వెర్షన్‌గా తీసుకురావాలని నిర్మాతలు నిర్ణయించారు. ఇదే ఇప్పుడు వివాదానికి కారణమైంది.

# ఓవర్సీస్‌లో సమంత సత్తా..

### రికార్డు స్థాయిలో ‘మా ఇంటి బంగారం’ ప్రీ సేల్స్




స్టార్ హీరోయిన్ సమంత తన స్టార్‌డమ్‌ను మరోసారి ఘనంగా చాటుకున్నారు. ఆమె ప్రధాన పాత్రలో నటించిన ‘మా ఇంటి బంగారం’ చిత్రం విడుదల కాకముందే ఓవర్సీస్‌లో, ముఖ్యంగా నార్త్ అమెరికాలో సంచలనం సృష్టిస్తోంది. ఈ సినిమా ప్రీ సేల్స్ ఇప్పటికే 3 లక్షల డాలర్ల (సుమారు రూ. 2.5 కోట్లు) మార్కును దాటేశాయి. సమంత కెరీర్‌లోనే ప్రీ సేల్స్ ద్వారా ఈ స్థాయిలో వసూళ్లు రావడం ఇదే తొలిసారి. జూన్ 19న ఈ చిత్రం వరల్డ్ వైడ్ గ్రాండ్ గా రిలీజ్ కానుంది. నేడు (జూన్ 18) ఈ చిత్రం ప్రీమియర్స్ ప్రదర్శితం కానుండగా, అడ్వాన్స్ బుకింగ్స్ రూపంలో ఈ స్థాయి వసూళ్లు రావడం ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ప్రత్యంగిర సినిమాస్ ఈ చిత్రాన్ని ఓవర్సీస్‌లో విడుదల చేస్తోంది. బుకింగ్స్ ఇంకా కొనసాగుతున్నాయని, వసూళ్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆ సంస్థ ప్రకటిం చింది. ఈ అద్భుతమైన ప్రారంభం సినిమాపై ఉన్న భారీ అంచనాలకు నిదర్శనంగా నిలుస్తోంది. ‘ది ఫ్యామిలీ మ్యాన్’ వెబ్ సిరీస్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన రాజ్ నిడిమోరు ఈ చిత్రానికి క్రియేటర్‌గా వ్యవహరించారు. సమంతతో గతంలో ‘ఓ బేబీ’ వంటి విజయవంతమైన సినిమా తీసిన నందినీ రెడ్డి దర్శకత్వం వహించారు. వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ట్రలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై నిర్మించిన ఈ చిత్రంలో గుల్షన్ దేవయ్య, గౌతమి, దిగంత్ మంచాలే కీలక పాత్రలు పోషించారు. ఈ రికార్డు స్థాయి ప్రీ సేల్స్, ఓవర్సీస్ మార్కెట్‌లో సమంతకున్న తిరుగులేని క్రేజ్‌ను స్పష్టం

# ‘మైసా’లో నక్సలైట్‌గా?



అగ్ర కథానాయిక రష్మిక మందన్న నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ ‘మైసా’ నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తినిరేకెత్తిస్తున్నది. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాల్లో రష్మిక ఫెరోషియస్ లుక్స్‌తో సర్‌ప్రైజ్ చేసింది. ఈ సినిమాలో ఆమె గోండు తెగకు చెందిన గిరిజన మహిళ పాత్రను పోషిస్తున్నది. కెరీర్‌లో తొలిసారి ఫుల్‌లెంగ్త్ యాక్షన్ రోల్‌చేస్తుండటంతో ఈ సినిమా విషయంలో రష్మిక మందన్న ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలో ఆమె నక్సలైట్ పాత్రలో కనిపించనుందని తెలిసింది. వ్యవస్థపై ధిక్కార స్వరం వినిపించే ధీరోదాత్తురాలైన గిరిజన మహిళగా ఆమె పాత్ర అత్యంత శక్తివంతంగా సాగుతుందని చెబుతున్నారు. అయితే ఆమె పాత్ర తాలూకు అసలైన వివరాలు తెలియాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. రవీంద్ర పుల్లె దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. పాన్ ఇండియా రిలీజ్ కానుంది.

# గుంటూరు మిర్చికి చైనా షాక్



**గుంటూరు (భారత శక్తి)** మనదేశంలో మిరప ఎక్కువగా పండించే రాష్ట్రాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముందు వరుసలో ఉంటాయి. ఇక్కడ పండే మిరపకు అంతర్జాతీయంగా డిమాండ్ ఉంటుంది. ముఖ్యంగా టమాటా మిర్చి.. తేజ రకం మిర్చికి ఈ రెండు రాష్ట్రాలు పెట్టింది పేరు. అందువల్లే చైనా వ్యాపారులు మన తెలుగు రాష్ట్రాల్లో పండిన మిరపకాయలను ఎక్కువగా కొనుగోలు చేస్తూ ఉంటారు. ఎందు మిరపకాయల నుంచి కారం మాత్రమే కాకుండా.. కృత్రిమ రంగులలో ఉపయోగించే రసాయనాలను తయారు చేస్తూ ఉంటారు. ఈ రసాయనాలకు చైనాలో విపరీతమైన డిమాండ్ ఉంటుంది.సాధారణంగా మిర్చిలో రైతులు ఎక్కువగా క్రిమిసంహారకాలు వాడుతుంటారు. మిరప అనేది అత్యంత సున్నితమైన పంట. ఎక్కువ దిగుబడి సాధించడానికి రైతులు విపరీతంగా క్రిమిసంహారకాలు వాడుతూ ఉంటారు. గతంలో క్రిమిసంహారకాలు వాడకం ఒక స్థాయి వరకు ఉండేది. కొంతకాలంగా మిరప మీద తెగుళ్లు విపరీతంగా దాడి చేస్తున్న నేపథ్యంలో దిగుబడి పూర్తిగా తగ్గిపోతుంది. అందువల్ల రైతులు క్రిమిసంహారకాలను ఎక్కువగా వాడాల్సి వస్తోంది. దేశీయంగా పెద్దగా ఇబ్బందులు లేకపోయినప్పటికీ.. ఎగుమతి అయ్యే మిరప విషయంలోనే కష్టాలు ఎదురవుతున్నాయి.మన దగ్గర పండిన మిర్చి ఎక్కువగా చైనా దేశానికి ఎగుమతి అవుతూ ఉంటుంది. అయితే ఇటీవల కాలంలో రెండు కంటైనర్ల మిర్చి మన దేశానికి చైనా తిరిగి పంపించింది. దీనికి ప్రధాన కారణం క్రిమిసంహారకాలు అధికంగా ఉండటమే. ఈ స్థాయిలో క్రిమి సంహారకాలు వాడిన మిరపని పంపిస్తే తీసుకునేది లేదని చైనా స్పష్టం చేసింది. దీంతో మిరప వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. మిరపలో క్రిమిసంహారకాల వాడకాన్ని తగ్గించే విధంగా ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని.. రైతులు సహజ సిద్ధమైన పద్ధతుల్లో మిరపని పండించే విధంగా చూడాలని వ్యాపారులు కోరారు. పదేపదే పురుగుమందుల అవశేషాల ఉల్లంఘన జరుగుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ స్థాయిలో భారత మార్కెట్ విలువ పడిపోతుందని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.చైనాకు ఎగుమతి అవుతున్న మిరపలో మెథా మెడోఫాస్.. మోనోక్రోటోఫాస్.. ప్రొఫెనొఫాస్.. ట్రయాజో ఫాస్.. ఇథియాన్.. క్లోరోపైరిఫాస్.. ఫిప్రోనిల్ వంటి ఆందోళన కలిగించే క్రిమిసంహారకాలు ఉన్నాయని ఆంధ్ర ప్రదేశ్ మిరప వ్యాపారుల సంఘం అధ్యక్షుడు వెలగపూడి సాంబశివరావు.. ప్రధాన కార్యదర్శి తోట రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. చైనా ప్రధానంగా ఈ క్రిమిసంహారకాలను చూపించి ఎగుమతులను తీసుకోవడం లేదని వారు పేర్కొన్నారు.. అంతేకాదు ప్రభుత్వం ఈ విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని.. రైతులకు మేలైన విత్తనాలు.. పంట దిగుబడిలో తీసుకోవాల్సిన సూచనలు.. తెగుళ్ల బారిన పడకుండా మేలైన దిగుబడి అందించే వంగడాలను రూపొందించాల్సిన అవసరం ఉందని వారు చెబుతున్నారు.రైతులకు పురుగుమందులు అమ్మే డీలర్ల మీద కఠినమైన పర్యవేక్షణ కొనసాగించాలని ప్రభుత్వానికి సూచించారు.. గుంటూరు.. పల్నాడు.. ప్రకాశం.. కర్నూలు.. నంద్యాల.. తెలంగాణ.. కర్ణాటక వంటి రాష్ట్రాల్లో మిరప పండించే రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీదా ఉందని మిరప వ్యాపారులు చెబుతున్నారు. సక్రమంగా ఎగుమతులు చేయని పక్షంలో దేశీయంగా రేటు పడిపోతుందని.. అది రైతులకే నష్టం చేకూరుతుందని వ్యాపారులు చెబుతున్నారు.

## కండలేరు లో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

**నెల్లూరు(భారత శక్తి)** బుధవారం రాత్రి కండలేరు పోలీస్ స్టేషన్ పరిధిలోని చెల్లటూరు గ్రామంలోని ఎస్టీ కాలనీలో పోలీసులు విస్తృత స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్ను రాపూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ గారి ఆధ్వర్యంలో కండలేరు ఎస్సై, కలువాయి ఎస్సై, సైదాపురం ఎస్సై మరియు 20 మంది పోలీసు సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందం పాల్గొంది. ఆపరేషన్ సందర్భంగా ప్రాంతంలోని సుమారు 120 ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేయగా, సరైన ఆధార పత్రాలు లేని 23 ద్విచక్ర వాహనాలు మరియు 2 ఆటోలను గుర్తించి స్వాధీనపరచుకుని తదుపరి పరిశీలన నిమిత్తం పోలీసుల ఆధీనంలో ఉంచారు. సంబంధిత వాహన యజమానులు అవసరమైన పత్రాలను సమర్పించాలని సూచించారు.

తరువాత స్థానిక ప్రజలు, యువత మరియు సంఘ పెద్దలకు రోడ్డు భద్రతా నియమాలు, గంజాయి మరియు ఇతర మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, అక్రమ మద్యం నిర్మూలన, మహిళలపై జరిగే నేరాల నివారణ, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, ఆస్తి సంబంధిత నేరాల నియంత్రణ, డయల్-100 మరియు 112 అత్యవసర సేవల వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.అలాగే ప్రజలు తమ ప్రాంతాల్లో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలు, అసాంఘిక చర్యలు లేదా నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ మరింత సమర్థవంతంగా సాధ్యమవుతుందని, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నివారణ కోసం జిల్లాలో ఇటువంటి కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిరంతరం నిర్వహించబడుతున్నాయని పోలీసులు తెలిపారు.

## 200 జిల్లాల్లో నీటి కటకట

**న్యూఢిల్లీ (భారత శక్తి)**మొన్నటికి మొన్న దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు విస్తరించాయని.. అక్కడక్కడ వర్షాలు కురుస్తున్నాయని.. ఎల్ నీనో ప్రభావం అంతగా ఉండదని మీడియాలో వార్తలు వచ్చాయి.. కానీ ఈ మురిపం రెండు మూడు రోజులకే పరిమితమైంది. ఎందుకంటే రుతుపవనాల విస్తరణకు అనుకూలమైన వాతావరణం లేకపోవడంతో దేశవ్యాప్తంగా కొన్ని ప్రాంతాల మినహా మిగతా అన్నిచోట్ల ఎండలు దంచి కొడుతున్నాయి. వర్షపాతం ఏకంగా 36% లోటుకు చేరుకుంది. జూన్ నెలలో వర్షపాతం 36% లోటు పెద్ద ఇబ్బంది కాకపోయినప్పటికీ.. రుతుపవనాల విస్తరణకు ఏమాత్రం అనుకూల వాతావరణ లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.జూన్ 16 నాటికి దేశవ్యాప్తంగా వర్షపాతం లోటు ఏకంగా 35 శాతానికి చేరుకుంది. మహారాష్ట్ర.. కొంకణ్ తీరంలో ఇంతవరకు సైతం నైరుతి రుతుపవనాలు విస్తరించలేదు. ఈ ప్రాంతంలో అనుకూలమైన వాతావరణం ఏర్పడి వర్షాలు కురిస్తేనే గోదావరి నదికి వరద వస్తుంది. రెండు తెలుగు రాష్ట్రాలకు ఆ వరదే జీవనాధారం. పొడి వాతావరణం వల్ల కొన్ని రోజులుగా ఉత్తర దిశగా రుతుపవనాల విస్తరణ పూర్తిగా ఆగిపోయింది.. భారత వాతావరణ శాఖ గణాంకాల ప్రకారం ఈ ఏడాది ఈ సమయానికి వాయవ్య భారతదేశం మాత్రమే సాధారణ వర్షపాతం కంటే ఒక ఐదు శాతం ఎక్కువగా పొందింది. తూర్పు, ఈశాన్యం, మధ్య భారతదేశం, దక్షిణ దీపకల్పంలో లోటు వర్షపాతం కొనసాగుతోంది.ఈశాన్య భారతదేశంలో 43%.. మధ్య భారత దేశంలో 63%.. దక్షిణ ద్వీపకల్పంలో 14 శాతం లోటు వర్షపాతం కొనసాగుతోంది. 2000 నుంచి ఎల్ నీనో సంవత్సరాలను ఒకసారి పరిశీలిస్తే.. జూన్ వర్షపాత వ్యత్యాసాల విశ్లేషణలో 2015 జూన్ నెల నిలిచింది. ఆ సంవత్సరం జూన్ నెలలో సాధారణ కంటే ఎక్కువ వర్షపాతం 14% అధికంగా నమోదయింది. 2002 జూన్.. 2024 జూన్ నెలలో వర్షపాతం సాధారణ స్థాయిగా నమోదయింది.. అనంతరం జూలై నుంచి మిగతా నెలలో వర్షపాతం తక్కువగా నమోదయింది.2009లో జూన్ నెలలో సాధారణం కంటే 47% తక్కువగా వర్షపాతం నమోదయింది. 2014లో సాధారణం కంటే 44 శాతం తక్కువగా వర్షపాతం నమోదయింది. 2023లో సాధారణం కంటే ఎనిమిది శాతం తక్కువ వర్షపాతం నమోదయింది. మధ్య, తూర్పు పసిఫిక్ మహాసముద్రం కాలానుగుణంగా వేడిగా మారడం వల్ల అది భారత దేశంలో రుతు పవనాల గమనాన్ని పూర్తిగా మార్చేస్తోంది. ఎల్ నీనో సాధారణంగా రుతుపవనాల ప్రారంభం.. రుతుపవనాల ముగింపు పై తీవ్రమైన ప్రభావం చూపిస్తోందని.. అందువల్లే ఈ స్థాయిలో వర్షపాతం తక్కువగా నమోదు అవుతుందని అధికారులు చెబుతున్నారు.ఈ ఏడాది కాస్త ఆలస్యంగా జూన్ 4న కేరళలో వృత్తిపవనాలు ప్రవేశించాయి. అయితే అప్పటికే పశ్చిమ తీరం వెంబడి రుతుపవనాల పురోగతి వేగాన్ని కోల్పోయింది. వాతావరణంలో మార్పుల ఆధారంగా రుతుపవనాలు విడతలవారీగా కదులుతూ ఉంటాయి. ముంబై శివారు ప్రాంతానికి చేరుకున్న మొదటి విడత రుతుపవనాలు స్థిరంగా నిలబడలేకపోయాయి. దీనికి బదులుగా ముంబై నగరానికి ఉత్తరాన ప్రతికూల వాతావరణం వల్ల రుతుపవనాలు స్తంభించిపోయాయి.. ఒకవేళ వర్షాలు కురవాలి అంటే కచ్చితంగా బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడాలి.. అప్పుడుగాని ఎల్ నీనో ప్రభావం తగ్గుతుంది.ఇప్పటి అంచనాల ప్రకారం దేశంలో దాదాపు 20 జిల్లాలు డేంజర్ జోన్ లో ఉన్నాయి. ఇక్కడ ఎప్పటికప్పుడు సమీక్షలు జరపాలని.. తక్కువ నీటి అవసరం ఉన్న పంటలు మాత్రమే రైతులు వేసేలా అవగాహన కల్పించాలని కేంద్రం సూచించింది.

# ఏపీలో ఆపరేషన్ ఆకర్ష్...

**విజయవాడ (భారత శక్తి):** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సంచలన మార్పులకు తెరలేవబోతోంది. ఎన్నికల్లో ఘనవిజయం సాధించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ఒక వ్యూహం ప్రకారం వాయిదా వేస్తూ వచ్చిన రాజకీయ చేరికల ప్రక్రియకు ఇప్పుడు గేట్లు ఎత్తడానికి ముహూర్తం ఖరారైనట్లు స్పష్టమవుతోంది. ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కి చెందిన కీలక నేతలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు కూటమి బాట పట్టడానికి సిద్ధంగా ఉన్న తరుణంలో.. ఈ చేరికలను క్రమబద్ధీకరించడానికి కూటమి పార్టీలు ప్రత్యేక వ్యవస్థలను సిద్ధం చేసుకోవడం హాట్ టాపిక్గా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విచ్చలవిడిగా చేరికలను ప్రోత్సహించకుండా ఒక పద్ధతి ప్రకారం ఆలస్యం చేస్తూ వస్తున్నారు. ఎన్నికల ముగిసిన వెంటనే కొంతమందికి మాత్రమే ఎంట్రీ ఇచ్చినప్పటికీ, ఆ తర్వాత చేరికలకు బ్రేకులు వేశారు. దీని వెనుక ప్రభుత్వ స్థిరత్వం, సొంత పార్టీల క్యాడర్లో అసంతృప్తి రాకుండా చూసుకోవాలనే చంద్రబాబు, పవన్ కల్యాణ్ ల సుదీర్ఘ వ్యూహం ఉంది. అయితే, ప్రస్తుతం వైసిపిలో యాక్టివ్ గా లేని, ఇప్పటికే ఆ పార్టీకి రాజీనామా చేసి గోడ మీద పిల్లిలా ఉన్న సీనియర్ల సంఖ్య పెరిగిపోవడంతో, వారిని ఎక్కువ కాలం వెయిటింగ్లో ఉంచడం కంటే పార్టీల్లోకి ఆహ్వానించడమే శ్రేయస్కరమనే భావనకు కూటమి నేతలు వచ్చారు.చేరికలు ఒకరి పార్టీలోకి మరొకరు దూకడం వల్ల కూటమిలో అంతర్గత కలహాలు రాకుండా ఉండేందుకు ప్రత్యేక ఫిల్టరింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేశారు. జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఇతర పార్టీల నుంచి వచ్చే నేతల స్క్రీనింగ్ కోసం, చేరికల ప్రక్రియను పర్యవేక్షించడానికి ఒక ప్రత్యేక కమిటీని రంగంలోకి దించారు. తెలుగుదేశం పార్టీలో చేరికలను సమీక్షించడానికి, స్థానిక నేతల అభ్యంతరాలను పరిష్కరించడానికి ఎప్పటి నుంచో ఒక ప్రత్యేక విభాగం అంతర్గతంగా పనిచేస్తోంది. టీడీపీ-జనసేన-బీజేపీల మధ్య సీట్ల సర్దుబాటు లేదా క్షేత్రస్థాయి సమన్వయం దెబ్బతినకుండా, ఏ నేత ఏ పార్టీలో చేరితే సామాజికంగా, రాజకీయంగా లబ్ధి చేకూరుతుందో తేల్చేందుకు కూటమి తరఫున ఒక కో-ఆర్డినేషన్ కమిటీ తుది నిర్ణయం తీసుకోనుంది.ఇంతకాలం చేరికలపై వెనకడుగు వేయడానికి ప్రధాన కారణం స్థానికంగా ఉన్న లీడర్ల మధ్య టికెట్ల లొల్లి వస్తుందనే భయం. ఒక నియోజకవర్గంలో ఇప్పటికే కూటమి ఎమ్మెల్యే ఉన్నప్పుడు, వైసిపి నుంచి వచ్చే సీనియర్కు వచ్చే ఎన్నికల్లో సీటు ఎలా ఇస్తారు? అనే ప్రశ్న తలెత్తింది. అయితే, కేంద్ర ప్రభుత్వం త్వరలోనే డీలిమిటేషన్ ప్రక్రియను చేపట్టడం ఖాయమనే సంకేతాలు స్పష్టంగా రావడం ఇక్కడ గేమ్ ఛేంజర్గా మారింది. వచ్చే ఎన్నికల నాటికి ఆంధ్రప్రదేశ్లో అసెంబ్లీ స్థానాల సంఖ్య గణనీయంగా పెరుగుతుందనే భరోసా రావడంతో, కొత్తగా వచ్చే నేతలకు కూడా భవిష్యత్తులో సీట్లు సర్దుబాటు చేయవచ్చనే ధీమాతో కూటమి అగ్రనేతలు గేట్లు ఎత్తడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.రాజకీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ విడత చేరికల్లో ఉత్తరాంధ్ర తో పాటు కోస్తా తీరం వెంబడి నెల్లూరు జిల్లా వరకు ఉన్న వైసిపికి చెందిన కనీసం 15 నుండి 20 మంది కీలక నేతలు క్యూ కట్టబోతున్నారు. రాయలసీమలోనూ పట్టున్న కొందరు రెడ్డి సామాజికవర్గ నేతలు కూడా కూటమితో టచ్లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. వైసిపి అధినాయకత్వం వైఖరిపై నమ్మకం కోల్పోవడం, క్షేత్రస్థాయిలో క్యాడర్ మొత్తం కూటమి వైపు షిఫ్ట్ అయిపోవడంతో, తమ రాజకీయ భవిష్యత్తును కాపాడుకోవడానికి వీరంతా లగేజ్ సర్దుకుంటున్నట్లుగా భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సామాజిక సమీకరణాలు అత్యంత కీలకం. గత ఎన్నికల ఫలితాలు నిరూపించింది ఏంటంటే.. టీడీపీ - జనసేన కలిసి ఉన్నంత కాలం వైసిపి గెలవడం అసాధ్యం. ఇదే విషయాన్ని వైసీపీ నేతలు కూడా చెబుతూ వస్తున్నారు. ఈ కూటమి కనీసం మరో రెండు దశాబ్దాల పాటు బలంగా కొనసాగుతుందనే నమ్మకం రాజకీయ నాయకుల్లో ఏర్పడింది. ఎప్పటికీ అధికారంలోకి రాలేని పార్టీలో ఉండి సమయం, డబ్బు వృధా చేసుకోవడం కంటే, పవర్ సెంటర్గా మారిన కూటమిలో భాగమవ్వడమే సరైన మార్గమని వైసిపి నేతలు భావిస్తున్నారు. ఈ చేరికల తుఫాను కేవలం వైసిపిని మరింత బలహీనపరచడానికే కాకుండా.. కూటమిలోని అంతర్గత బలాబలాలను మార్చడానికి కూడా ఉపయోగపడనుంది. పవన్ కల్యాణ్ ఏర్పాటు చేసిన కమిటీ ద్వారా జనసేన గ్రాఫ్ మరింత పెరిగేలా బలమైన సామాజికవర్గ నేతలను ఆకర్షించే అవకాశం ఉంది, తద్వారా రాబోయే రోజుల్లో టీడీపీకి సమానంగా లేదా బలమైన ప్రత్యామ్నాయంగా జనసేన ఎదిగే వ్యూహం ఇందులో కనిపిస్తోంది. మొత్తానికి, ఏపీలో రాబోయే కొన్ని వారాలు సరికొత్త రాజకీయ వలసలకు వేదిక కానున్నాయి.

**జనసేనలో జాయినింగ్ కమిటీ** జనసేన అధినేత పవన్ కల్యాణ్ వచ్చే ఎన్నికలకు ఇప్పటి నుంచే పార్టీని సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. తనకు బలమైన నాయకత్వం కావాలని ఆయన భావిస్తున్నారు. జనసేన ఇప్పటి వరకూ కొన్ని నియోజకవర్గాల్లో మాత్రమే బలంగా ఉంది. రాష్ట్రంలో అధిక శాతం జనసేన విస్తరించాలంటే అందుకు సరైన నాయకత్వం అవసరమని భావిస్తున్నారు. అందుకే పవన్ కల్యాణ్ తాజాగా కీలక నిర్ణయం నిర్ణయం తీసుకున్నారు.జనసేనలో చేరికల సమన్వయానికి జాయినింగ్స్ కమిటీని ఏర్పాటు చేశారు. 14 మంది సభ్యులతో 'ఏపీ జనసేన కమిటీ' ఏర్పాటు చేశారు. త్వరలో ఏపీ తరహాలోనే తెలంగాణలో జాయినింగ్స్ కమిటీని ఏర్పాటు చేస్తామని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ ప్రకటించారు. అంటే చేరికలకు పవన్ కల్యాణ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లే కనిపిస్తుంది.అధికారంలోకి వచ్చిన తొలి నాళ్లలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సామినేని ఉదయభాను, కిలారు రోశయ్య వంటి వారిని పార్టీలోకి తీసుకున్నారు వారంతా వైసీపీ నుంచి వచ్చిన వారే. నియోజకవర్గాల్లో బలమైన నేతలు. ఇక వైసీపీ నుంచి వచ్చే వారికి కూడా పవన్ కల్యాణ్ ఒకరకంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కనపడుతుంది. దీంతో రెండు లక్ష్యాలు నెరవేరుతాయని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. మొదటిది జనసేనకు బలమైన నాయకత్వం ఏర్పాటు కావడం. రెండోది వైసీపీని బలహీనపర్చడం. వైసీపీలో ఉన్న బలమైన నేతలు వస్తామంటే తీసుకునేందుకు పవన్ కల్యాన్ సిద్ధం అని ఈ నిర్ణయం తో స్పష్టం చేసినట్లు తెలిసింది. ఇప్పటి వరకూ జనసేనలో చేరేందుకు కొందరు ప్రయత్నిస్తున్నా పవన్ కల్యాణ్ అనుమతి కోసం ఎదురు చూస్తున్నారు.ఇందుకోసం పద్నాలుగు మందితో ప్రత్యేకంగా కమిటీని నియమించడం వెనక కూడా పవన్ కల్యాణ్ ఒక వ్యూహం ప్రకారం ముందుకు వెళుతున్నారని అనిపిస్తుంది. ఎందుకంటే వైసీపీ, టీడీపీ, బీజేపీ ఏ పార్టీ నుంచి వచ్చినా చేర్చుకోవాలంటే ముందు ఈ కమిటీ ఒకే అంటేనే తర్వాత పవన్ కల్యాణ్ అనుమతి కోసం వెళ్లాల్సి ఉంటుంది. కమిటీ అన్ని రకాలుగా పరిశీలించి నేతల చేరికపై పవన్ కల్యాణ్ కు నివేదిక ఇచ్చిన తర్వాత మాత్రమే జనసేన పార్టీ కండువా కప్పుతారు. కోస్తాంధ్రతో పాటు రాయలసీమ నుంచి కూడా జనసేనలో పెద్దయెత్తున నేతలను అంటే నియోజకవర్గ స్థాయిలో బలమైన లీడర్లను చేర్చుకుంటే వచ్చే ఎన్నికల్లో ఎక్కువ స్థానాల్లో పోటీ చేసి బలమైన పార్టీగా అవతరించాలన్న వ్యూహంతోనే చేరికలకు పవన్ ఈ స్ట్రాటజీని అమలు చేస్తునట్లు అనిపిస్తుంది. మరి ఏ పార్టీ నుంచి చేరతారన్నది చూడాల్సిందే.

# అమరావతికి ట్రాఫిక్ ఫ్రీ జర్నీ..

## నాలుగు లైన్లతో కొత్త ఆర్వోబీ..

**విజయవాడ,(భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి వెళ్లేవారి కష్టాలు తొలగిపోనున్నాయి. మంగళగిరి నుంచి రాజధాని ప్రాంతానికి వెళ్లే మార్గంలో ఇబ్బందిగా మారిన నిడమర్రు రైల్వే లెవెల్ క్రాసింగ్ సమస్యకు పరిష్కారం లభించింది. నిడమర్రు రైల్వే లెవల్ క్రాసింగ్ దగ్గర రైల్వే ఓవర్ బ్రిడ్జికి గ్రీన్సిగ్నల్ రాగా.. ఇవాళ కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారా లోకేష్లు శంకుస్థాపన చేశారు. రూ.142 కోట్లతో ఈ ఆర్వోబీని నిర్మించనున్నారు. మంత్రి నారా లోకేష్ చొరవతో ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం లభించింది.గుంటూరు జిల్లా నిడమర్రు రైల్వే లెవల్ క్రాసింగ్ వల్ల మంగళగిరి నుంచి అమరావతి, తాడికొండ వైపు రాకపోకలు కొనసాగించేవారికి ఇబ్బందులు ఎదురయ్యాయి. వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురయ్యేవి. అక్కడ తరచూ గేటు మూయడంతో వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రద్దీ సమయంలో వాహన రాకపోకలు ఆగిపోవడంతో పాటుగా ప్రయాణ సమయం పెరగడం, అత్యవసర సేవలకు అంతరాయం ఎదురైంది.

అలాగే మంగళగిరి దగ్గర ఉన్న క్రికెట్ స్టేడియానికి వెళ్లవారికి ఇబ్బందులు తప్పలేదు. ఈ విషయం మంత్రి లోకేష్కు తెలియడంతో ఆయన చొరవ తీసుకుని ఆర్వోబీ కోసం రైల్వే అధికారులకు రిక్వెస్ట్ చేయడంతో మంజూరు చేశారు. ఈ ఆర్వోబీ పూర్తయితే అమరావతి, తాడికొండ, మంగళగిరి, నిడమర్రు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తొలగిపోతాయి. మంగళగిరి నుంచి నిడమర్రు, బేతపూడి, నీరుకొండ, కురగల్లు గ్రామాల ప్రజలకు ప్రమాయణ సమయం తగ్గుతుందని చెబుతున్నారు.నిడమర్రు ఆర్వోబీ 10 మీటర్ల ఎత్తు, 767.50 మీటర్లు పొడవు, 28 మీటర్ల వెడల్పుతో నాలుగు లైన్లుగా నిర్మించనున్నారు. రైల్వే లైన్ నుంచి మంగళగిరి వైపు 405.50 మీటర్లు, అమరాతి వైపు 362 మీటర్లు నిర్మాణం చేపట్టనున్నారు.

ఆర్వోబీ నాలుగులైన్లుగా.. ప్రతి లైను 3.75 మీటర్లు.. గ్యారేజ్ వెడల్పు 15 మీటర్లు ఉంటుంది. 0.45 మీటర్లు చొప్పున రెండు వైపులా క్రాస్ బ్యారియర్లు, 0.45 మీటర్లు మధ్య డివైడర్ నిర్మించనున్నారు. సర్వీసు రోడ్డు డ్రైన్లతో కలిపి రెండు వైపులా 11 మీటర్లు(5.5x2) 5.5 మీటర్ల వెడల్పు ఉంటుంది. రోడ్లతో కలిపి మొత్తం వంతెన వెడల్పు 28 మీటర్లు ఉంటుంది. నిడమర్రు ఆర్వోబీకి శంకుస్థాపన చేయడంతో త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు.

# కేడర్ను పట్టించుకోని నేతలు..

## - లోకేష్ సీరియస్ వార్నింగ్!

**గుంటూరు(భారత శక్తి)** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఐదేళ్ల పాలనలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులు పడిన ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. కేవలం ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తూ ఫేస్బుక్, ఎక్స్లలో పోస్టులు పెట్టినందుకే అర్ధరాత్రి వేళల్లో సీఐడీ, స్థానిక పోలీసులు ఇళ్లపై పడి అరెస్టులు చేసిన సంఘటనలు వందలాదిగా ఉన్నాయి. మరీ దారుణంగా, కేవలం రాజకీయంగా అణచివేయాలనే ఏకైక లక్ష్యంతో సోషల్ మీడియా ఐటీ చట్టాల కింద కాకుండా, జీవితాలను నాశనం చేసేలా గంజాయి రవాణా, రేప్ కేసులు, హత్యాయత్నం వంటి తీవ్రమైన నాన్-బెయిలబుల్ అక్రమ కేసులను టీడీపీ కేడర్పై అక్రమంగా బనాయించారు. దీంతో ఎంతోమంది యువకులు, పార్టీ సానుభూతిపరులు కోర్టుల చుట్టూ తిరుగుతూ తీవ్ర మానసిక, ఆర్థిక నష్టాన్ని చవిచూశారు.

టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తమపై ఉన్న అక్రమ కేసులు తక్షణమే రద్దవుతాయని వేలాది మంది కార్యకర్తలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం కూడా ప్రాథమికంగా బాధితుల వివరాలతో కూడిన లిస్టులను సేకరించింది. అయితే, చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం పగ్గాలు చేపట్టి రెండేళ్లు గడుస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇప్పటికీ అందరిపై కేసులు ఎత్తివేసే ప్రక్రియ పూర్తిస్థాయిలో కొలిక్కి రాలేదు. తాజాగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ నియోజకవర్గాల ఇన్ఛార్జులు, ఎమ్మెల్యేలతో జరిపిన అంతర్గత సమీక్షా సమావేశాలలో మాట్లాడిన మాటలను బట్టి క్షేత్రస్థాయిలో కేడర్ ఇప్పటికీ ఈ అక్రమ కేసుల వల్ల ఇబ్బందులు పడుతోందనే చేదు నిజం స్పష్టమయింది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గాల్లో కొంతమంది ఎమ్మెల్యేలు, కీలక నేతలు తమ సొంత పనుల్లో, అధికారిక హోదాల్లో బిజీ అయిపోయి.

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమ కోసం లాఠీ దెబ్బలు తిని, జైలుపాలైన నిఖార్సైన కార్యకర్తలను విస్మరించారనే అసంతృప్తి పార్టీలో వ్యక్తమవుతోంది. ఈ క్షేత్రస్థాయి ఫీడ్బ్యాక్పై నారా లోకేష్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కష్టకాలంలో పార్టీ జెండా మోసిన కార్యకర్తలను కాపాడుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, వెంటనే వారందరికీ న్యాయ సహాయం అందించి కేసుల నుంచి విముక్తి కల్పించే బాధ్యతను స్థానిక నేతలే తీసుకోవాలని ఆయన గట్టిగా హెచ్చరించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది.ఇప్పటికైనా ప్రభుత్వం , టీడీపీ అధిష్టానం కేవలం సాధారణ ఆదేశాలకే పరిమితం కాకుండా, ఒక స్పెషల్ లీగల్ సెల్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ స్టేషన్లు, కోర్టుల పరిధిలో పెండింగ్లో ఉన్న ప్రతి ఒక్క కార్యకర్త కేసుకు సంబంధించిన డేటాను క్రోడీకరించి, చట్టపరమైన లూప్హోల్స్ను తొలగిస్తూ హోంశాఖ ద్వారా జీవోలు జారీ చేసి కేసులను మాఫీ చేయించాలి. ఐదేళ్లపాటు సర్వస్వం కోల్పోయి పోరాడిన కేడర్తో నిరంతరం టచ్లో ఉంటూ, వారిపై ఉన్న అక్రమ కేసుల మరకలను త్వరితగతిన తుడిచివేసినప్పుడే.. భవిష్యత్తులో పార్టీ కోసం పని చేసే కార్యకర్తల్లో నమ్మకం, ధైర్యం నిలుస్తాయి.

## ఉత్తరాంధ్ర టూ ప్రకాశం..

# విచిత్రమైన సైలెన్స్!

**ఒంగోలు (భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు, ఓడిపోయిన సీనియర్ నియోజకవర్గ ఇన్ఛార్జ్ల విచిత్రమైన మౌన వ్రతం ఇప్పుడు అటు పార్టీ కేడర్లోనూ, ఇటు రాజకీయ వర్గాల్లోనూ పెద్ద చర్చకు దారితీసింది. సాధారణంగా ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత ప్రజా సమస్యలపై పోరాడుతూ లైమ్లైట్లో ఉండేందుకు నేతలు ప్రయత్నిస్తుంటారు. కానీ, వైసీపీకి చెందిన అత్యధిక శాతం మంది మాజీ ప్రజాప్రతినిధులు ప్రస్తుతం ఇటు అసెంబ్లీ వ్యవహారాలకు, అటు మీడియా ప్రెస్ మీట్లకు పూర్తిగా దూరంగా ఉంటున్నారు. కనీసం సొంత నియోజకవర్గాల్లో కేసులు, వేధింపులు ఎదుర్కొంటున్న కిందిస్థాయి కార్యకర్తలకు కూడా అందుబాటులో లేకుండా ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకోవడం లేదా బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలకు షిఫ్ట్ అయిపోయారు. రెండేళ్లవుతున్నా మెరుపు తీగల్లా వచ్చి పోతున్నారు.ముఖ్యంగా ఉత్తరాంధ్ర , ప్రకాశం జిల్లాల పరిధిలోని కొందరు బడా మాజీ ఎమ్మెల్యేల ప్రవర్తన ఈ అనుమానాలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది. గత ప్రభుత్వంలో మంత్రులుగా, జిల్లాలు ఏలిన కీలక నేతలుగా వెలిగిన వారు సైతం ఇప్పుడు నియోజకవర్గాల్లో గడప దాటడం లేదు. ప్రకాశం జిల్లాకు చెందిన ఒక సీనియర్ మాజీ కాకతాళీయంగా తన వ్యాపారాలన్నీ బెంగళూరుకు మార్చేసుకుని అక్కడే సెటిల్ అవ్వగా.. ఉత్తరాంధ్రకు చెందిన మరో ఇద్దరు కీలక నేతలు కనీసం స్థానిక పార్టీ ఆఫీసు వైపు కూడా చూడటం లేదు. ఐదేళ్ల పాటు హడావుడి చేసిన ఈ లీడర్లు హఠాత్తుగా ఇంతలా సైలెంట్ అయిపోవడం వెనుక కేవలం భయం మాత్రమే లేదు.. అంతకుమించిన పొలిటికల్ ప్లాన్ ఉందనే చర్చ నడుస్తోంది.పొలిటికల్ సర్కిల్స్ లో వినిపిస్తున్న అంతర్గత సమాచారం ప్రకారం.. ఈ మౌనం వెనుక అసలు కారణం కూటమి పార్టీల్లోకి జంప్ అయ్యేందుకు నడుస్తున్న గ్రౌండ్ వర్క్. గత హయాంలో తాము చేసిన కొన్ని వివాదాస్పద నిర్ణయాలు, ఆర్థిక లావాదేవీలపై ప్రస్తుత ప్రభుత్వం విచారణలు జరుపుతుండటంతో.. లీగల్ చిక్కుల నుండి ఎలాగైనా బయటపడాలని వీరు భావిస్తున్నారు. అందుకే, జగన్ రెడ్డి ఇచ్చే పిలుపులకు గానీ, తాడేపల్లి నుంచి వచ్చే ఆదేశాలకు గానీ స్పందించకుండా.. తాము వైకాపాకు దూరంగా ఉంటున్నామనే సంకేతాలను కూటమి పెద్దలకు పంపిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే లేదా సరైన రాజకీయ ముహూర్తం చూసుకుని అధికార పక్షంలో చేరిపోయేందుకు లోపాయికారీగా రాయబారాలు నడుపుతున్నట్లు తెలుస్తోందినాయకులు ఇలా బెంగళూరు రిసార్టులకో, విదేశీ పర్యటనలకో పరిమితమై 'సేఫ్ గేమ్' ఆడుతుండటంతో.. గ్రామాల్లోని వైకాపా సాధారణ కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి లీడర్లు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. స్థానిక లొల్లీలు ఎదురైనప్పుడు కనీసం ఫోన్ చేసి ధైర్యం చెప్పే నాథుడే కరువవ్వడంతో.. కేడర్ అంతా ఒక్కొక్కరుగా కూటమి పార్టీల వైపు వెళ్లడమో లేదా రాజకీయాలకు దూరంగా ఉండటమో చేస్తున్నారు. లీడర్లేమో అటు అధినేత జగన్కు సమాధానం చెప్పలేక, ఇటు కేసులు భరించలేక కూటమి కండువా కప్పుకోవడానికి రూట్ క్లియర్ చేసుకుంటుంటే.. తమను నమ్ముకున్నందుకు పొలిటికల్ స్క్రీన్ పై తాము ఒంటరి వాళ్లమయ్యామని కిందిస్థాయి కార్యకర్తలు లోలోపల మధనపడుతున్నారు.

# వివాదాల సర్..

**విజయవాడ (భారత శక్తి):** తెలుగు రాష్ట్రాల్లో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర ప్రక్షాళన చేస్తోంది. ఈనెల 15 నుంచి ఇంటింటా సర్వే ప్రారంభం అయింది. అయితే తెలుగు రాష్ట్రాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు భారత రాష్ట్ర సమితిలో ఒక రకమైన ఆందోళన కనిపిస్తోంది . ఓట్ల తొలగింపు కోసం అధికారపక్షాలు అక్రమాలకు పాల్పడుతున్నాయంటూ ఆరోపణలు చేయడం మొదలుపెట్టారు. అయితే గతంలో ఆ రెండు పార్టీలు అధికారంలో ఉండేవి. అందుకే అంతలా కంగారు పడుతున్నాయి అనేది బహిరంగ రహస్యం. ఎందుకంటే ప్రతి గ్రామంలోనూ తమకు అనుకూలమైన ఓట్లు జాబితాలో ఉంచి.. తమకు ప్రతికూలమైన ఓట్లను తొలగించారు. అటువంటి ఓట్లు ఇప్పుడు తొలగిస్తారు అన్న భయం ఆ రెండు పార్టీలకు వెంటాడుతోంది. ఆ కారణంగానే ఆ రెండు పార్టీలు ఇప్పుడు గగ్గోలు పెడుతున్నాయి.ఈనెల 15 నుంచి ఇంటింటికి వెళ్తున్న బూత్ లెవెల్ అధికారులు సమగ్ర సర్వే చేపడుతున్నారు. అత్యంత పారదర్శకంగా, డిజిటల్ టెక్నాలజీ ఆధారంగా సాగుతోంది ఈ ప్రక్రియ. అర్హత ఉన్న ఈ ఓటరును కూడా తొలగించరు. కేవలం చనిపోయిన వారు, ఒకే వ్యక్తికి రెండు మూడు చోట్ల ఓటు ఉంటే అటువంటి వారిని తొలగిస్తున్నారు. డబుల్ ఎంట్రీలు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లను మాత్రమే నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత తొలగిస్తారు. ఇది సాధారణ, చట్టబద్ధమైన ప్రక్రియ కూడా. అయితే గతంలో బెంగాల్లో మమతా బెనర్జీ నానా హడావిడి చేశారు. ఈశాన్య రాష్ట్రాల్లో బంగ్లాదేశ్ చొరబాటుదారులు, అక్రమ ఓటరు గుర్తింపు పొందిన వారు లేనిపోని హడావిడి చేశారు. అయితే తెలుగు రాష్ట్రాల్లో మాత్రం ఆ పరిస్థితి లేదు. అటువంటి చొరబాటుదారులకు ఛాన్స్ లేదు. అయితే గతంలో చాలా రకాల విన్యాసాలు చేశాయి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు భారత రాష్ట్ర సమితి. అందుకే ఇప్పుడు కంగారు పడిపోతున్నాయి.రెండు తెలుగు రాష్ట్రాల్లో అధికారం చేపట్టాయి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, భారత రాష్ట్ర సమితి. అధికారంలో ఉన్నప్పుడు వ్యవస్థలను అడ్డం పెట్టుకుని వేలాదిగా దొంగ ఓట్లు చేర్పించారన్న విమర్శలు ఉన్నాయి. అటువంటి ఓట్లు ఇప్పుడు గల్లంతు కాక తప్పవు. ఈ డిజిటల్ స్క్రూటీనీలో అడ్డంగా బుక్ కావడం ఖాయం. సర్వే ప్రక్రియపై పౌరులు, పార్టీలు అప్రమత్తంగా ఉండి తమ ఓట్లను వెరిఫై చేసుకోవడంలో ఎలాంటి తప్పులేదు. కానీ అసలు ఓట్లు పూర్తిగా తొలగించేస్తున్నారంటూ గగ్గోలు పెట్టడం వెనుక మాత్రం వారి భయం వారికి ఉంది. కేవలం ఎన్నికల సంఘం మార్గదర్శకాలను మాత్రమే బూత్ లెవెల్ అధికారులు అమలు చేస్తారు. దీనిని ఎప్పటికప్పుడు పరిశీలించి తప్పులు జరిగితే అడ్డుకోవచ్చు. కానీ రెండు తెలుగు పార్టీలు మాత్రం ఇప్పటినుంచే ఓటమికి కారణాలు వెతుకుతున్నట్టు స్పష్టమవుతోంది.

# నీట్ పరీక్షకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

**- పరీక్షా కేంద్రాలను పరిశీలించిన సీపీ అంబర్ కిషోర్ ఝా**



మంచిర్యాల ప్రతినిధి, జూన్ 18 ( భారత శక్తి): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్‌లో ఈ నెల 21న నిర్వహించనున్న నీట్ పరీక్ష నేపథ్యంలో మంచిర్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి గురువారం పరిశీలించారు.జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలతో పాటు ఇతర పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.మంచిర్యాలలో మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాల్లో నీట్ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.పరీక్షను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.నాలుగు కేంద్రాల్లో మొత్తం 1,204 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతుండగా, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా,ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో భారతీయ నాగరిక భద్రతా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 ప్రకారం నలుగురికి మించిన గుంపులు గుమికూడకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.సెక్టార్ సూపరింటెండెంట్లతో సమావేశమై అవసరమైన సూచనలు చేసినట్లు తెలిపారు.పరీక్షా కేంద్రాల్లో విధులు నిర్వహించే ఇన్విజిలేటర్లకు కమిటీ ద్వారా ప్రత్యేక సూచనలు జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది పరీక్షా కేంద్రాల వద్ద అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ, తనిఖీలు చేపట్టి అభ్యర్థులను లోపలికి అనుమతిస్తారని తెలిపారు.పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాల్లోకి తీసుకురావద్దని సూచించారు. తల్లిదండ్రులు పరీక్ష ప్రారంభ సమయానికి ముందుగానే విద్యార్థులతో కలిసి కేంద్రాలకు చేరుకుని పోలీసులకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్,మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్, మంచిర్యాల పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఫోక్సో కేసు నిందితుడికి జైలు శిక్ష

**- బాధితురాలికి పది లక్షల నష్టపరిహారం**



ములుగు జిల్లా ప్రతినిధి, జూన్ 18 (భారత శక్తి): పోక్సో కేసు నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్ష, తో పాటు రూ:20 వేలు జరిమానా ములుగు జిల్లా న్యాయస్థానం విధించినట్లు ఎస్పీ కేకన్ సుధీర్ రామనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు జిల్లా పోక్సో ప్రత్యేక న్యాయస్థానం ( ఎఫ్ టి పి ఓ సి ఎస్ ఓ జ కోర్టు) లో గురువారం జరిగిన విచారణలో న్యాయస్థానం అత్యంత కీలక తీర్పును ప్రకటించిందని పేర్కొన్నారు. 2023 మంగపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నంబర్ 35/2023 కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠినకారాగార జైలు శిక్ష, రూ: 20 వేలు జరిమానాతో పాటు బాధితురాలికి రూ:10 లక్షల నష్టపరిహారం అందించాలని తీర్పునిచ్చారు. కేసు వివరాలు: SC.No.19/2023, Cr.No.: 35/2023 యు/సెక్షన్: 366(ఎ), 376ఎబి,376(2)(ఎన్) ఐపిసి సెక్షన్ 3(1)(డబ్ల్యూ)(i)(ii), 3(2)(విఎ) ఎస్సీ/ఎస్టి , యాక్ట్ సెక్షన్9, పి ఓ సి ఎస్ ఓ యాక్ట్.నిందితుడి వివరాలు: ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన కన్నెబోయిన సమ్మయ్యS/o వీరయ్య, వయసు :35 సంవత్సరాలు కులం: గొల్ల/యాదవ్,వృత్తి: కూలి నిందితుడు పోక్సో కేసులో దోషిగా తెలినందున న్యాయమూర్తి ఎస్ వి పి సూర్య చంద్రకళ నిందితునికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష మరియు రూ. 20,000/- జరిమానా విధిస్తూ U/S 235(2) CrPC ప్రకారం తీర్పు ప్రకటించారు.కాగా కేసు విచారణలో దర్యాప్తు అధికారిగా ఉన్న దర్యాప్తు అధికారి సిరిశెట్టి సంకీర్త్ ఐపిఎస్., గారిని, కోర్ట్ మానిటరింగ్ ఆఫీసర్ డి ఎస్ పి కిషోర్ కుమార్, కోర్ట్ లైసనింగ్ అధికారి ఎస్ ఐ నాగరాజు, కోర్ట్ సి డి ఓ మౌనిక గార్లను ఎస్ పి గారు అభినందించారు.మైనర్ పిల్లలపై నేరాలకు పాల్పడితే ఊక్షించేది లేదు. భాధితులకు న్యాయం కల్పించడానికి పోలీసు వ్యవస్థ ఎల్లప్పుడూ ఉంట్టుంది ఇలాంటి నేరాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం ఎస్పీ తెలిపారు.

# ప్రీ ప్రైమరీ పాఠశాలల పోస్టులకు తాత్కాలిక మెరిట్ జాబితా విడుదల

**- జిల్లా విద్యాధికారి డి. భోజన్న**



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 18:(భారత శక్తి) జిల్లాలో ఈ విద్యా సంవత్సరంలో ప్రారంభించనున్న 74 ప్రీ-ప్రైమరీ (పూర్వ ప్రాథమిక) పాఠశాలల్లో ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టుల భర్తీకి సంబంధించిన తాత్కాలిక మెరిట్ జాబితాను జిల్లా విద్యాశాఖ విడుదల చేసింది. అభ్యర్థులు తమ వివరాలను జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్లు, అలాగే జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పరిశీలించుకోవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న తెలిపారు.మెరిట్ జాబితాపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 19వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు సంబంధిత ఆధారాలతో జిల్లా విద్యాశాఖ కార్యాలయం, నిర్మల్ (ఐడీఓసీ కలెక్టరేట్)లో రాతపూర్వకంగా సమర్పించాలని సూచించారు. నిర్ణీత గడువు తర్వాత అందే అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు.అభ్యంతరాల పరిశీలన అనంతరం తుది మెరిట్ జాబితాను ప్రకటించి నియామక ప్రక్రియను కొనసాగిస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి డి. భోజన్న వెల్లడించారు.

# జర్నలిస్టుల పిల్లలకు వంద శాతం ఫీజు రాయితీ



ములుగు జిల్లా ప్రతినిధి, జూన్ 18 (భారత శక్తి): ములుగు జిల్లాలోని జర్నలిస్టుల పిల్లలకు వంద స్కూల్ ఫీజు రాయితీ ములుగు జిల్లా విద్యాశాఖ అధికారి ఏ సిద్ధార్థ రెడ్డి ఆదేశాలు జారీ..ఇటీవలే ములుగు జిల్లా విద్యాశాఖ అధికారి ఏ సిద్ధార్థ రెడ్డి కి వినతి పత్రం అందజేసిన టీయూడబ్ల్యూజే ములుగు జిల్లా అధ్యక్షులు ఎండి.షఫీ అహ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి చిదురాల వాసుదేవ్ యూనియన్ సభ్యులు సీనియర్ జర్నలిస్టులు ములుగు జిల్లాలోని అక్రిడిటెడ్ వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు 2026-2027 విద్యా సంవత్సరానికి ప్రైవేట్ గుర్తింపు పొందిన పాఠశాలల్లో వంద శాతం ఫీజు రాయితీ కల్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) కీలక ఆదేశాలు జారీ చేశారు ఈరోజు జిల్లా విద్యాశాఖ అధికారి ఏ సిద్ధార్థ రెడ్డి ఆర్డర్ కాపీని ఎక్కడ టీయూడబ్ల్యూజే ములుగు జిల్లా అధ్యక్షులు ఎం డి.షఫీ అహ్మద్ కి అందజేశారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూ(జేఐజేయు) స్టేట్ కౌన్సిల్ సభ్యులు ఎనగందుల కొమరయ్య రామ్మూర్తి రాజు వర్ధన్ మైపాల్ రెడ్డి హరినాథ్ వేణు యాదవ్ పొన్నాల స్వామి సతీష్ హరీష్ సతీష్ గౌడ్ తదితరులు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ఎల్.పి.జి. వినియోగదారులు బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**



మంచిర్యాల ప్రతినిధి, జూన్ 18(భారత శక్తి): మంచిర్యాల జిల్లాలోని ఎల్.పి.జి. వినియోగదారులు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రత్యక్ష లబ్ధి బదిలీ (ఐడీయూ-ఫ్రూనావూ) పథకం ద్వారా గ్యాస్ రాయితీని నిరంతరంగా పొందేందుకు తమ బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్.పి.జి. వినియోగదారుల బ్యాంకు ఖాతాలను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలతో (ఎవీజం) అనుసంధానం చేసే ప్రక్రియ కొనసాగుతోందని, ఇప్పటి వరకు బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేయని వినియోగదారులు ఈ నెల 30వ తేదీ లోపు తప్పనిసరిగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. నిర్ణీత గడువులోగా బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేయని వినియోగదారులకు రాయితీ జమ కావడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. ఎల్.పి.జి. రీఫిల్ సేవలు మాత్రం యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేశారు.

**- రేషన్ కార్డుదారులు ఈ - కె వై సి పూర్తి చేయాలి**

జిల్లాలోని రేషన్ కార్డుదారులందరూ తప్పనిసరిగా ఈ - కెవైసి పూర్తి చేయాలని తెలిపారు. జాతీయ ఆహార భద్రతా చట్టం కింద అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు సక్రమంగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ప్రతి రేషన్ కార్డులో ఉన్న సభ్యులందరూ ఈ - కెవైసి పూర్తి చేయడం తప్పనిసరి అని తెలిపారు. రేషన్ కార్డులో ఉన్న సభ్యుల పారదర్శకతను నిర్ధారించడానికి, నకిలీని నిరోధించడానికి, అర్హత కోల్పోయిన వారిని గుర్తించి రికార్డులను నవీకరించేందుకు ఈ - కెవైసి ప్రక్రియ ఉపయోగపడుతుందని తెలిపారు. ఇప్పటివరకు ఈ - కెవైసి చేయించుకోని రేషన్ కార్డుదారులు తమ సమీపంలోని రేషన్ దుకాణాలను సందర్శించి, అక్కడ ఏర్పాటు చేసిన వ-ఫూూ యంత్రం ద్వారా వెంటనే పూర్తి చేయించుకోవాలని తెలిపారు.

# నకిలీ విత్తనాల విక్రయం చట్ట విరుద్ధం

**- మండలంలో అధికారుల మూకుమ్మడి తనిఖీలు**

**- 60- 70 మి.మీ వర్షపాతం నమోదైన తర్వాతనే పత్తి విత్తనాలు విత్తుకోవాలి**

**- మండల వ్యవసాయ అధికారి జి.సారయ్య**



రేగొండ గోరి కొత్తపల్లి, జూన్ 18 (భారత శక్తి) నకిలీ విత్తనాలు విక్రయించి రైతులను మోసం చేసిన ప్రతీ ఒక్కరు చట్ట పరమైన శిక్షను ఎదుర్కోవాల్సి వస్తుందని విత్తన విక్రయ దుకాణయజమానులను గురువారం అధికారులు హెచ్చరించారు. ఈ మేరకు టాస్కోఫ్బర్స్ సభ్యులు తాహాసిల్దార్ ఎన్. హేమ, స్థానిక ఎస్సై ఎస్. త్రిలోకనాథ్ రెడ్డి, భూపాలపల్లి డివిజన్ ఎడిఎ ఎన్. రమేష్, మండల వ్యవసాయ అధికారి జి. సారయ్యలు మూకుమ్మడిగా మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతుసేవా కేంద్రం, పరమేశ్వర ఏజెన్సీస్, పలు విత్తన దుకాణాలను తనిఖీ చేయడం జరిగింది. ఇందులో భాగంగా సరుకు నమోదు పట్టి,రసీదు పుస్తకాలు, విత్తన ఇన్వాయిసులను తనిఖీ చేయడం జరిగింది. విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు విధిగా లాట్ నెంబర్ తో కూడిన వివరాలతో రసీదు ఇవ్వాలని అట్టి రసీదును పంట కాలం అయిపోయే వరకు రైతులు భద్రపరుచుకోవాలని రైతులకు వివరించాలని సూచించారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లో లూజ్ పత్తి విత్తనాలు, బిజీ 3 పత్తి విత్తనాలను వాడకూడదని అట్టి విత్తనాలు గ్రామాలలో సంచరించి అమ్మకాలు జరిపే వ్యక్తుల వివరాలు వెంటనే పోలీసు అధికారులకు కానీ వ్యవసాయ అధికారులకు గాని సమాచారం ఇవ్వాలని కోరారు. రైతులు విత్తనాలను అదీకృత లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. అదేవిధంగా రైతులు పత్తి విత్తనాలను తొందరపడి నాటవద్దని 60- 70 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైన తర్వాతనే పత్తి విత్తనాలు విత్తుకోవాలని మండల వ్యవసాయ అధికారి రైతులకు సూచించారు.

# మినీ జాబ్ మేళా

మంచిర్యాల ప్రతినిధి, వ జూన్ 18 (భారత శక్తి): మంచిర్యాల పట్టణము లోని హై టెక్ సిటీ వద్ద గల ప్రభుత్వ ఐటీఐ కళాశాల నందు ఈ నెల 20 వ తారీకు ఉదయం 10.30 నిమిషాలకు మోడల్ కెరీర్ సెంటర్ ఆధ్వర్యంలో మినీ జాబ్ మేళ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.వివరాలకు ఈ నంబర్ లను 8096857078,9705820030,8333059029 లను సంప్రదించవలసినదిగా కోరారు.

# వెంకటేశ్వర కాలనీ వేల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



ఎల్బీనగర్, జూన్ 18,(భారత శక్తి): సరూర్ నగర్ డివిజన్ లోని అతి పెద్ద కాలనీ అయినటువంటి శ్రీవెంకటేశ్వర కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ (2026 నుండి 2028) నూతన కమిటీ ప్రమాణ స్వీకర మహోత్సవం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. అధ్యక్షునిగా గండు ధనంరెడ్డి, గౌరవ ఆధ్యక్షునిగా బోయిన మహేందర్ యాదవ్, ఉపాధ్యక్షునిగా మునగాల సరేష్, ప్రధాన కార్యదర్శిగా పివిఎస్ ప్రసాద్, జాయింట్ సెక్రెటరీలుగా వడ్డీ సుబ్రమణ్యం, సప్పిడి గోవర్ధన్ రెడ్డి కోశాధికారిగా సోమ వెంకటేశ్వర్లు, సలహాదారునిగా తులసీ క్రిష్ణమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శిగా టి.శ్రీనివాసరావు, ఎక్సిక్యూటీవ్ కమిటీ మెంబర్లుగా టి.శ్రీనివాస్ కార్తీక్, ఎన్.గణేష్ యాదవ్, జి.ప్రవీణ్ కుమార్, ఎం. సుధాకర్, కె.రవి గౌడ్, టి.నాగ అజయ్ గోపి, సోమ ప్రవీణ్ కుమార్, కె. నవీనచంద్ర. ఎన్. ఎస్.ఐ.రవి , సిహెచ్, సురందర్ రావు , చెన్న అనిల్, వి.ఎ. వంశీమోహన్, కె.వి.శ్రీనివాస్, ఎం.లింగరావులు ప్రమాణస్వీకారం చేశారు. ఎలక్షన్ అధికారీ ఎం. శాంతి ప్రసాద్ గెలుపొందిన నూతన కమిటీచే ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పలువురు కాలనీ పెద్దలను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మారోజు శ్రీనివాస్ రావు. కనకారావు, సాయి కిరణ్, రవికుమార్, మురళికొండిన్య, భోగేశ్వర్రావు. మాధవరావులతో పాటు కాలనీ వాసులు కమిటీ కుటుంబ సభ్యులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# తాండూరు మున్సిపల్‌లో డీఈ పోస్టు ఖాళీ..

**- అభివృద్ధి పనులకు బ్రేక్ - బీఆర్ఎస్ నేత సంతోష్ గౌడ్**

**15 రోజులుగా డీఈ లేక ఇంజనీరింగ్ శాఖ పనులు స్తంభించాయి**

**వెంటనే డీఈ అధికారిని నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి**



తాండూరు జూన్ 18 భారత శక్తి తాండూరు మున్సిపాలిటీలో డిప్యూటీ ఇంజనీర్ (డీఈ) లేకపోవడంతో పట్టణ అభివృద్ధి పనులు సాగడం లేదని బీఆర్ఎస్ పార్టీ నాయకుడు సంతోష్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ, ...ప్రభుత్వం చేపట్టిన బదిలీలలో భాగంగా మున్సిపల్ డీఈకి స్థానచలనం కల్పించడంతో.గత 15 రోజులుగా డీఈ పోస్టు ఖాళీగా ఉండటంతో అభివృద్ధి పనులకు సంబంధించిన ఫైళ్ల పరిష్కారం ఆలస్యం అవుతోందని అన్నారు. ఇంజనీరింగ్ శాఖకు సంబంధించిన పరిపాలనా వ్యవహారాలు కూడా సక్రమంగా కొనసాగడం లేదని పేర్కొన్నారు.ఈ పరిస్థితుల కారణంగా పట్టణాభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రజలకు అందాల్సిన పలు సేవలు ప్రభావితమవుతున్నాయని . తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి తాండూరు మున్సిపాలిటీలో డీఈ అధికారిని నియమించి, అభివృద్ధి పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని సంతోష్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు."అధికారి కొరతతో అభివృద్ధి పనులు నిలిచిపోకుండా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి" అని ఆయన విజ్ఞప్తి చేశారు.

# బాలాపూర్ బొడ్రాయి మహోత్సవాలు

**- అధికారులను ఆహ్వానించిన- మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నరసింహారెడ్డి.**




బాలాపూర్: జూన్ 18 భారత శక్తి, ఈ నెల 25వ తేదీ నుండి బాలాపూర్ గ్రామంలో అత్యంత వైభవంగా ప్రారంభం కానున్న 'బొడ్రాయి మహోత్సవ పండుగ కు సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో, గురువారం నాడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నరసింహారెడ్డి, ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు



మరియు వివిధ పార్టీల నాయకులు పలువురు ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రాలను అందజేశారు.

### జోనల్ కమిషనర్, డిసిపిలకు ఆహ్వానం

ఉత్సవ కమిటీ ప్రతినిధులు మొదటగా జిహెచ్ఎంసి శంషాబాద్ జోనల్ కమిషనర్ శ్రీమతి చంద్రకళ గారిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేసి, ఉత్సవాలకు విచ్చేయాల్సిందిగా కోరారు. అనంతరం, శంషాబాద్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (DCP) శ్రీ రాజేష్ గారిని కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మహోత్సవాల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు మరియు భక్తులకు కల్పించాల్సిన కనీస సౌకర్యాల గురించి అధికారులతో చర్చించారు. గ్రామ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ బొడ్రాయి మహోత్సవాలను అందరి సహకారంతో అత్యంత వైభవంగా, విజయవంతంగా నిర్వహిస్తామని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు.

### ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

చిగిరింత నరసింహారెడ్డితో పాటు కమిటీ సభ్యులు, వివిధ పార్టీల ముఖ్య నాయకులు అయిన:
- వంగేటి ప్రభాకర్ రెడ్డి - రఘునందన చారి - కళ్ళెం ఎల్లారెడ్డి
- వంగేటి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దళితుల మధ్య చిచ్చు పెడుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ

**కొలిమిగుండ్ల** నంద్యాల పట్టణంలో ఇవాళ నవ్యాంధ్ర మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కొర్రపాటి శరత్ బాబు పర్యటించారు. సూరత్ హోటల్లో నవ్యాంధ్ర మాల మహానాడు సంఘం నాయకులు కార్యకర్తలతో కొర్రపాటి శరత్ బాబు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో నంద్యాల జిల్లా నవ్యాంధ్ర మాల మహానాడు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా సంగటి భాస్కరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు కొర్రపాటి శరత్ బాబు మాట్లాడుతూ మన దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాల మాదిగల మధ్య చిచ్చు పెడుతూ పబ్బం గడుపుకుంటున్నాడని భవిష్యత్తులో వర్గీకరణ అనే అంశమే లేకుండా చేసేందుకు వారు కుట్ర పన్నుతున్నారని ఇప్పటికైనా మాలలు ఐకమత్యంతో ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నవ్యాంధ్ర మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కొర్రపాటి శరత్ బాబు, నంద్యాల జిల్లా ఉద్యోగుల సంఘం నూతన అధ్యక్షుడు సంగటి భాస్కరరావు, రాయలసీమ జిల్లాల చైర్మన్ మద్దిలేటి, సంఘం సభ్యులు రమేష్, రామ్మోహన్, తిరుపతి రాజు, ఎస్ విజయ్ కుమార్, గురువయ్య, జె నాసరయ్య ఇంకా తదితర మాల మహానాడు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9550336688,94405 08078 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy,Executive Editor: M.Venugopal Reddy